

‘ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 216

శుక్రవారం 28-10-2022




డచ్‌పై తీన్‌మార్
మెరిసిన రోహిత్, కోహ్లి, సూర్య.. భారత్‌కు మరో విజయం - 13లో



రూపాయి అప్
డాలర్ మారకంలో 48 పైసలు పెరిగిన రూపాయి విలువ - 12లో


SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పీఓకే స్వాధీనం తథ్యం
పీఓకేను స్వాధీనం చేసుకుంటేనే జమ్మూ కశ్మీర్, లద్దాఖ్‌ల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ అన్నారు.
వివరాలు 6లో



ఉత్సుకతతో ఎదురు చూస్తున్నా
భారత్, బ్రిటన్‌లు కలిసికట్టుగా సాధించే ఘనత కోసం ఎదురుచూస్తున్నానని బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ అన్నారు.
వివరాలు 6లో



ఆజాంఖాన్‌కు మూడేళ్ల జైలు
మూడేళ్ల క్రితం నాటి విద్వేషపూరిత ప్రసంగం కేసులో సమాజ్‌వాదీ పార్టీ నేత ఆజాంఖాన్‌కు కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది.
వివరాలు 6లో



మహిళా క్రికెట్‌లో కొత్త శకం
భారత మహిళా క్రికెటర్లకు కూడా పురుష క్రికెటర్లతో సమానంగా మ్యాచ్ ఫీజు చెల్లించనున్నట్లు బీసీసీఐ ప్రకటించింది.
వివరాలు 13లో

విద్యుత్ రంగంలో
మరో ముందడుగు

నేలటూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- శ్రీదామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రంలో 3వ యూనిట్ జాతికి అంకితం
- నాడు వైఎస్సార్ శ్రీకారం.. నేడు మనందరి ప్రభుత్వంలో పూర్తి
- మూడేళ్లలో రూ.3,200 కోట్ల వ్యయం.. మరో 800 మెగావాట్ల విద్యుత్.. ఈ సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్‌కు తక్కువ బొగ్గు వినియోగం
- ఏపీ గ్రిడ్‌కు రోజూ 19 మిలియన్ యూనిట్ల విద్యుత్
- 16,337 మత్స్యకారేతర కుటుంబాలకు పరిహారం జమ
- నెల్లూరు బ్యారేజీకి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరు
- రూ.93 కోట్లతో సబ్‌మెర్సిబుల్ కాజ్‌వే, రూ.25 కోట్లతో ఫిషింగ్ జెట్టి ఏర్పాటుకు శంకుస్థాపనలు
- రెండు హైలెవల్ వంతెనల కోసం రూ.22 కోట్లు మంజూరు



నేలటూరులోని దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్‌లో నిర్మించిన 3వ యూనిట్‌ను ప్రారంభించిన సీఎం జగన్. చిత్రంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: విద్యుత్ రంగంలో రాష్ట్రం మరో ముందడుగు వేసిందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్‌లో నిర్మించిన 3వ యూనిట్‌ను గురువారం ఆయన జాతికి అంకితం చేశారు. అనంతరం కృష్ణపట్నం పోర్టు నిర్వాసితుల ఖాతాల్లో మత్స్యకారేతర పరిహారం జమ చేశారు. ఈ సందర్భంగా నేలటూరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో ఏపీ జెన్‌కో స్వయంగా నిర్మించిన 800 మెగావాట్ల ప్లాంటును మీ అందరి సమక్షంలో జాతికి అంకితం చేస్తున్నానని చెప్పారు. ఈ థర్మల్ పవర్ స్టేషన్‌కు ఉమ్మడి రాష్ట్రంలో మన దివంగత నేత, ప్రియతమ నాయకుడు రాజశేఖరరెడ్డి (నాన్న గారు) 2008లో శంకుస్థాపన చేశారని తెలిపారు. దేశంలో తొలిసారిగా ప్రభుత్వ రంగంలో ఈ పవర్ స్టేషన్ నిర్మాణానికి ఆ మహానేత శ్రీకారం చుట్టగా, నేడు మనందరి ప్రభుత్వంలో పూర్తి సామర్థ్యంతో దానిని ప్రారంభించడం దేవుడిచ్చిన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ పవర్ స్టేషన్‌కు

మిగతా 2వ పేజీలో ▶

12న విశాఖ రైల్వేజోన్‌కు
శంకుస్థాపన

సీఎం జగన్‌తో కలిసి పనులను ప్రారంభించనున్న ప్రధాని మోదీ

- నవంబర్ 11, 12 తేదీల్లో విశాఖలో పర్యటన
- వడ్లపూడి వ్యాగన్ వర్క్‌షాప్ జాతికి అంకితం..
- రూ.446 కోట్లతో విశాఖ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన
- రూ.26 వేల కోట్లతో హెచ్‌పీసీఎల్ విస్తరణ ప్రారంభం
- గంభీరంలో నిర్మించిన ఐఐఎం (వైజాగ్) భవనానికి శ్రీకారం..
- రూ.380 కోట్లతో ఈఎస్ఐ ఆస్పత్రికి శంకుస్థాపన కూడా



సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరే సమయం వచ్చేసింది. విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటుకానున్న దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు శంకుస్థాపన ముహూర్తం కుదిరింది. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నరేంద్ర మోదీ మూడోసారి విశాఖలో పర్యటన దాదాపు ఖరారైన నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి ఆయన రైల్వే జోన్ శంకుస్థాపన పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకోసం నవంబర్ 11న విశాఖకు ఆయన రానున్నారని అధికారిక వర్గాల సమాచారం. ఈ పర్యటనలో రూ.వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారంతో పాటు ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కూడా విశాఖలో రెండ్రోజుల పాటు పర్యటిస్తారు. ఇందులో భాగంగా.. నవంబర్ 11న ఆయన విశాఖ చేరుకుని ప్రధానితో కలిసి ఆయా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

11న ప్రధానికి సీఎం స్వాగతం

వచ్చేనెల 11వ తేదీ రాత్రి 7 గంటలకు ఐఎన్ఎస్ డేగాకు చేరుకోనున్న ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఘనంగా స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి నేరుగా

మిగతా 2వ పేజీలో ▶

ఏది నిజం?
విశాఖపై విద్వేషాల కబ్జా

- రాజధానిగా విశాఖ వద్దనటంపై ఉత్తరాంధ్రలో ఆందోళన
- అది అంతకంతకూ పెరుగుతుండటంతో టీడీపీ కొత్త నాటకం
- ప్రతిరోజూ పనిగట్టుకుని విశాఖలో కబ్జాలంటూ రామోజీ రాతలు
- పరిరక్షణ సమితుల పేరిట.. ప్రభుత్వంపై విషం చిమ్మే కథనాలు
- రాజధాని వద్దని విశాఖ వాసులే అంటున్నారంటూ దుష్ప్రచారం
- అసలు విశాఖలో కబ్జాలకు ఆది గురువు ‘ఈనాడు’ రామోజీరావే
- లీజుకు తీసుకున్న స్థలం తిరిగి ఇవ్వకుండా.. కేసులతో కాలయాపన
- అందులో కొంత ప్రభుత్వానికిచ్చి.. పరిహారంగా ఇచ్చిన స్థలం కబ్జా
- ఇందుకు చీటింగ్, ఫోర్జరీ కేసులను సైతం ఎదుర్కొన్న రామోజీ
- చివరకు ఓడి స్థలానికి గుడ్‌బై.. కాళ్ల బేరంతో కేసుల రాజీ
- ఏకంగా 42.5 ఎకరాలను దశాబ్దాల పాటు కబ్జా చేసిన గీతం మూర్తి
- ఈ ప్రభుత్వం వచ్చాక ప్రహరీ కూలగొట్టి మరీ తిరిగి స్వాధీనం
- ఇపుడు అదేపనిగా కబ్జాలంటూ ‘ఈనాడు’ విషపు రాతలు

4లో

న్యూస్‌రీల్

అణ్వాయుధాలు ప్రయోగించం



ఉక్రెయిన్‌పై అణ్వాయుధాలు ప్రయోగించే ఉద్దేశం తమకు లేదని రష్యా అధ్యక్షుడు పుతిన్ స్పష్టం చేశారు. పెత్తనం కోసం పశ్చిమ దేశాలు చేస్తున్న ప్రయత్నం వల్లే ప్రస్తుత సంక్షోభం తలెత్తిందని పుతిన్ అన్నారు.
వివరాలు 6లో ▸

న్యాయ రాజధాని కోసం ఉద్యమ బాట



కర్నూలుకు న్యాయ రాజధాని కావాలని నినదిస్తూ రాయలసీమ ప్రజలు ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. తిరుపతి వేదికగా కలిసికట్టుగా ఉద్యమించేందుకు సన్నద్ధమవుతున్నారు. మహా ప్రదర్శన ద్వారా శనివారం తమ ఆకాంక్షను రాష్ట్రమంతా తెలియజేయనున్నారు.
వివరాలు 2లో ▸



అబ్బే! అతను అభ్యర్థి కాదు.. ఓటరు! కింద ఉన్న వాళ్లు అభ్యర్థులు!!

బీసీల ఆత్మగౌరవ సభలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య. చిత్రంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల, మంత్రులు, బీసీ నాయకులు



బీసీల చేతికి బలమైన ఆయుధం

- సీఎం జగన్ సామాజిక న్యాయ విప్లవకారుడు: ఎంపీ ఆర్.కృష్ణయ్య
- తలరాతలు, బతుకులు మార్చిన సంఘ సంస్కర్త
- పార్టీలకు అతీతంగా బీసీలంతా అండగా నిలుద్దాం
- పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ
- 40 ఏళ్లు తిరిగినా సాధ్యం కాని పనిని సాకారం చేశారు
- 175 స్థానాల్లో గెలుపును బీసీల విజయంగా భావించాలి: సజ్జల

“పార్టీలతో సంబంధం లేకుండా బీసీల కోసం పోరాడుతున్న నన్ను సీఎం జగన్ రాజ్యసభ సభ్యుడిని చేశారు. ‘అన్నా.. ఇంతకాలం ఆయుధం లేకుండా బయట ఉద్యమాలు చేశావ్. నీకు ఎంపీ అనే ఆయుధాన్ని ఇస్తున్నా. బీసీల ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో పోరాటాన్ని కొనసాగించు..’ అని ప్రోత్సహించారు. గత పాలకులు రాజ్యసభ సీట్లను రూ.200 కోట్లు, రూ.300 కోట్లకు అమ్ముకుంటే.. బీసీల కోసం ఉద్యమాలు చేయడమే నా అర్హతగా భావించి ఎంపీని చేసిన సీఎం జగన్ గొప్ప సామాజిక విప్లవకారుడని చెప్పేందుకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి?. -ఆర్.కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ

3లో

సీబీఐ లేదా సిట్‌తో దర్యాప్తు జరిపించండి

- ‘టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఎర’కేసుపై తెలంగాణ హైకోర్టులో బీజేపీ పిటిషన్
- పోలీసులు స్వేచ్ఛగా విచారణ చేసే అవకాశం లేదని వెల్లడి
- బీజేపీని అప్రతిష్టపాలు చేసేందుకు టీఆర్ఎస్ పన్నిన కుట్ర అని ఆరోపణ
- పిటిషన్‌పై నేడు విచారణ జరిగే అవకాశం



సాక్షి, హైదరాబాద్: టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఎర అంటూ దాఖలైన కేసులో విచారణను కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) లేదా ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)తో జరిపించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బీజేపీ.. తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఇదంతా తమను అప్రతిష్టపాలు చేసేందుకు రాష్ట్రంలోని అధికార టీఆర్ఎస్ పన్నిన కుట్రగా అభివర్ణించింది. ఏం చేసైనా మునుగోడు ఎన్నికల్లో గెలవాలని టీఆర్ఎస్ అధినేత, తెలంగాణ సీఎం కె.చంద్రశేఖర్‌రావు ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొంది. విచారణ నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా జరగాలని తాము కోరుకుంటున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గురువారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీ, సైబరాబాద్ సీపీ, రాజేంద్రనగర్ ఏసీపీ, మొయినాబాద్ స్టేషన్ హౌస్ ఆఫీసర్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి, కేంద్ర విచారణ సంస్థ(సీబీఐ), తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డిలను ప్రతివాదులుగా పేర్కొన్నారు. దీనిపై నేడు విచారణ జరిగే అవకాశం ఉంది.

కావాలనే బీజేపీపై నింద..

‘మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం నమోదైన ‘ఎమ్మెల్యేలకు ఎర’ కేసులో

మిగతా 10వ పేజీలో ▶

NABARD
పంజాబ్‌ను మించి..

- రైతులకు ఏపీలో మెరుగ్గా వ్యవసాయ రుణాల పంపిణీ
- దేశవ్యాప్తంగా దశాబ్ద కాలంలో మూడు రెట్లు పెరుగుదల
- కిసాన్ క్రెడిట్ కార్డులు కీలక పాత్ర
- అత్యధికంగా వ్యవసాయ రుణాలు దక్షిణాదిలోనే..
- నాబార్డు అధ్యయన నివేదికలో వెల్లడి

14లో

విక్టర్ ప్రసాద్ వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు



- మంత్రి మేరుగు నాగార్జున స్పష్టీకరణ
- ఆ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం.. లోకేశ్ ఒక చెల్లని కాణి
- రాష్ట్రంలో సామాజిక సంస్కరణలకు సీఎం వైఎస్ జగన్ శ్రీకారం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

10లో

ఆ ఉత్తర్వులను సవరించే ప్రసక్తే లేదు

- అమరావతి నుంచి అరసవెల్లి వరకు చేపట్టిన పాదయాత్రలో 600 మంది మాత్రమే ఉండాలని, సంఘీభావం తెలపాలనుకున్న వారు రోడ్డుకు ఇరువైపులా ఉండాలే తప్ప, యాత్రలో పాల్గొనడానికి వీల్లేదంటూ ఇచ్చిన ఆదేశాలను సవరించే ప్రసక్తే లేదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు తేల్చి చెప్పారు. తానేమీ కొత్తగా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని, గత నెలలో ఇచ్చిన వాటినే పునరుద్ఘాటిస్తూ.. ఆ ఆదేశాలను అమలు చేయాలని మాత్రమే చెప్పానన్నారు.

14లో

పత్రాలు మార్చి అసైన్డ్ అరాచకం

- అమరావతిలో అసైన్డ్ భూములు కేటాయించింది 1970–95 మధ్యలో
- వాటిని 1954కి ముందే పేదలకు కేటాయించినట్లు తప్పుడు రికార్డుల సృష్టి
- కారుచౌకగా కాజేశాక అసైన్డ్ అమ్ముకోవచ్చంటూ తాపీగా జీవో
- 964 ఎకరాలను అక్రమంగా దక్కించుకున్న టీడీపీ పెద్దలు


FORM D.

కురగల్లులోని ఎస్సీ రైతులకు 1987లో ఇచ్చిన అసైన్డ్ భూమి పట్టా

సాక్షి, అమరావతి: వడ్డించేవాడు మనోడైతే కడ బంతిలో కూర్చున్నా ఫర్వాలేదంటారు! పాలకుడు తమవాడైతే బరితెగించి భూదోపిడీకి పాల్పడవచ్చని టీడీపీ పెద్దలు నిరూపించారు! అమరావతి ముసుగులో ఏకంగా 964 ఎకరాల అసైన్డ్ భూములను కొల్లగొట్టిన భారీ కుంభకోణం వెనక చంద్రబాబు సర్కారు పన్నాగం తాజాగా వెలుగు చూసింది. నిబంధనలు ఉల్లంఘించి.. పత్రాలు మార్చి.. అందర్నీ ఏమార్చి ప్రత్యేకంగా జీవోలు జారీ చేసి చట్టబద్ధంగా భూ దోపిడీకి వేసిన స్కెచ్ బహిర్గతమైంది. అమరావతిలో అసైన్డ్ భూములను కాజేసేందుకు టీడీపీ పెద్దలు రెండంచెల వ్యూహం వేశారు. అయితే సాంకేతికపరమైన అంశాలు ప్రతిబంధకంగా మారడంతో మూడో ఎత్తుగడగా భూ దోపిడీకి

మిగతా 2వ పేజీలో ▶

ఇంకేం రుజువులు కావాలి?



మా కుటుంబానికి ప్రభుత్వం 1987లో రెండు ఎకరాల అసైన్డ్ భూమి కేటాయించింది. ఇదిగో ఆ పత్రం. అయితే మాకు అసైన్డ్ భూమిని 1954 కంటే ముందే కేటాయించినట్లు సీఆర్‌డీఏ రికార్డుల్లో నమోదు చేశారు. మా భూమిని టీడీపీ నేతలు పంపిన దళారులు సీఆర్‌డీఏకి ఇచ్చినట్లుగా రికార్డుల్లో చేర్చి క్రమబద్ధీకరించేశారు. ప్యాకేజీ కింద స్థలాలు, కౌలు పరిహారం వారికే ఇస్తున్నారు. మేం కనీసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కూడా వెళ్లకున్నా టీడీపీ నేతల పేరిట క్రమబద్ధీకరించి మోసగించారు. - దావు మోహన్‌రావు, అసైన్డ్ రైతు, కురగల్లు

క్లుప్తంగా

ఎలక్ట్రానిక్ మీడియా అడ్వైజర్‌గా నటుడు అలీ



సాక్షి, అమరావతి: ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారునిగా సినీనటుడు మహ్మద్ అలీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ పదవిలో అలీ రెండేళ్లు కొనసాగుతారని జీఏడీ ముఖ్య కార్యదర్శి ముత్యాల రాజు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'ఏపీ కార్ల్'లో పాల పరిశోధన కేంద్రం

- రూ.6కోట్లతో మిల్క్ టెస్టింగ్ యంత్రాలు



పులివెందుల రూరల్: వైఎస్సార్ జిల్లా పులివెందులలోని ఆంధ్రప్రదేశ్ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ఆన్ లైవ్ స్టాక్(ఏపీ కార్ల్)లో పాల పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో సుమారు రూ.6కోట్ల వ్యయంతో మిల్క్ టెస్టింగ్ యంత్రాలను కొనుగోలు చేసి ఏపీ కార్ల్‌లో పాల పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే పాల పరిశోధన కేంద్రానికి సంబంధించి స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటరమణ, క్వాలిటీ ఎనలిస్ట్ రవి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి రెండు భవనాలను ఎంపిక చేశారు. మిల్క్ టెస్టింగ్ ల్యాబ్ కోసం కూడా భవనాలు పరిశీలించారు. ఈ భవనాల్లో సివిల్ మరమ్మతులకు రూ.2కోట్లు కేటాయించారు. పాల పరిశోధన కేంద్రానికి సంబంధించిన నివేదికలను ప్రభుత్వానికి పంపి రెండు నెలల వ్యవధిలో పాల పరిశోధన కేంద్రం ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

కోవిడ్-19 మేనేజ్‌మెంట్ కార్యదర్శిగా నవీన్



సాక్షి, అమరావతి: రాష్ట్ర కోవిడ్-19 మేనేజ్‌మెంట్ కార్యదర్శిగా వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి జీఎస్ నవీన్‌కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలను ప్రభుత్వం ఇచ్చింది. ప్రస్తుతం నవీన్ ఏపీ శాక్స్ పీడీగా కూడా వ్యవహరిస్తున్నారు. కోవిడ్-19 మేనేజ్‌మెంట్ ముఖ్యకార్యదర్శిగా పనిచేస్తోన్న ముద్దాడ రవిచంద్ర ఇటీవల మహిళా, శిశు సంక్షేమ శాఖకు బదిలీ అవడంతో నవీన్‌కు అదనపు బాధ్యతలిస్తూ సీఎస్ సమీర్ శర్మ గురువారం ఉత్తర్వులిచ్చారు.

రెండ్రోజులు పొడి వాతావరణం

సాక్షి, విశాఖపట్నం: నైరుతి రుతుపవనాలు పూర్తిగా నిష్క్రమించడంతో రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. ఈశాన్య రుతు పవనాలు 29న ప్రవేశించనున్నాయి. వీటి ప్రభావంతో 31 నుంచి రాష్ట్రంలో మళ్లీ వర్షాలు ప్రారంభమవుతాయి. ఈ కారణంగా రెండు రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణం ఉంటుందని, ఒకట్రెండు చోట్ల జల్లులు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) గురువారం తెలిపింది.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతిపై పునర్విచారణ

ఆదేశించిన మహిళా కమిషన్

సాక్షి, అమరావతి: ప్రకాశం జిల్లా ఒంగోలులోని భాగ్యనగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ స్వాతి మృతిపై పునర్విచారణకు ఏపీ మహిళా కమిషన్ ఆదేశించింది. ఈమేరకు గురువారం ఒంగోలు ఎస్పీతో కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ మాట్లాడారు. కిందటి నెలలో అత్తింటి వేధింపులకు బలైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ స్వాతి మృతికి సంబంధించి ఆమె తల్లిదండ్రుల అనుమానాల్ని నివృత్తి చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన సమగ్ర దర్యాప్తు నివేదిక కమిషన్‌కు పంపాలన్నారు. బాధితురాలి మృతికి కారణమైన వారిలో ఏస్థాయి వ్యక్తి ఉన్నప్పటికీ పోలీసులు మాత్రం ఒత్తిడికి గురవరాదని ఆమె కోరారు.

15న ఎన్‌డబ్ల్యూడీఏ పాలకమండలి సమావేశం

- నదుల అనుసంధానమే అజెండా

సాక్షి, అమరావతి: జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) 70వ పాలక మండలి సమావేశం నవంబర్ 15వ తేదీన ఢిల్లీలో నిర్వహించనున్నారు. గోదావరి–కావేరితోపాటు దేశంలోని నదుల అనుసంధానమే ప్రధాన అజెండాగా నిర్వహించనున్న ఈ సమావేశానికి కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ అధ్యక్షత వహిస్తారు. అన్ని రాష్ట్రాల జలవనరుల శాఖ కార్యదర్శులు, ఈఎన్‌సీలు హాజరవుతారు. ప్రాధాన్యతగా చేపట్టిన కెన్–బెట్వా, గోదావరి–కావేరి నదుల అనుసంధానంపై ప్రధానంగా ఈ భేటీలో చర్చించనున్నారు. నదుల అనుసంధానానికి అవసరమైన నిధులను ఎలా సమీకరించాలనే అంశంపై కూడా ఈ సమావేశంలో చర్చిస్తారు.

న్యాయ రాజధాని కోసం ఉద్యమ బాట

రేపు తిరుపతిలో సీమ ఆత్మగౌరవ మహా ప్రదర్శన

- ఎమ్మెల్యే భూమన ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- సీమ ఆత్మగౌరవానికి.. అమరావతి అహంకారానికి మధ్య పోరుగా అభివర్ణిస్తున్న మేధావులు
- విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపు



మహా ప్రదర్శన కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూమన, పురుషోత్తంరెడ్డి, శైలుకుమార్ తదితరులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: కర్నూలుకు న్యాయ రాజధాని కావాలని నినదిస్తూ రాయలసీమ ప్రజలు ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలో ప్రజలంతా కలిసికట్టుగా ఉద్యమించేందుకు సన్నద్ధమవుతున్నారు. కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు రాయలసీమ ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమంటూ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా తిరుపతి నగరంలో శనివారం మహాప్రదర్శన నిర్వహించనున్న విషయం తెలిసిందే. వికేంద్రీకరణకు మద్దతుగా ఉదయం 10 గంటలకు కృష్ణాపురం ఠాణా నుంచి మునిసిపల్ కార్యాలయం వరకు ఈ ప్రదర్శన జరగనుంది. ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మహా ప్రదర్శన ద్వారా సీమ ఆకాంక్షలను, పౌరుషాన్ని చాటిచెప్పాలని సీమ ప్రజలకు పిలుపునిస్తున్నారు. ఎమ్మెల్యే భూమన ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు.

రాజధాని అంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు

రాజధాని అంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదని, 29 గ్రామాలే కాదని.. అత్యంత వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలు కూడా ఉన్నాయన్న విషయాన్ని ఈ ఉద్యమం ద్వారా మరోసారి చాటి చెప్పనున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన బినామీలు తమ స్వార్థం కోసం వెనుకబడిన ప్రాంతాలపై విషం చిమ్ముతున్నారని మేధావులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీమ వాసుల ఆత్మగౌరవానికి.. అమరావతిలోని ధనిక భూస్వాముల అహంకారానికీ మధ్య జరుగుతున్న ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిస్తున్నారు. ఈ మహాప్రదర్శన తర్వాత రాయలసీమ వ్యాప్తంగా న్యాయ రాజధాని కోసం పోరాటాలు ఊపందుకోనున్నాయి. సీమ హక్కుల సాధన కోసం ఇదే సరైన సమయమని మేధావులు, ప్రజా సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు.

న్యాయ రాజధాని కోసం కదం తొక్కాల్సిన సమయమిదే..

రాయలసీమ హక్కుల సాధనకు కదం తొక్కాల్సిన సమయం వచ్చింది. కర్నూలుకు న్యాయ రాజధాని కావాలన్న ఆకాంక్షను తిరుపతి వేదికగా తెలియజేద్దాం. సీఎం వైఎస్ జగన్ పాలన వికేంద్రీకరణలో భాగంగా కర్నూలుకు ప్రకటించిన న్యాయం రాజధానిని కొన్ని స్వార్థపూరిత శక్తులు అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆ ప్రయత్నాలను తిప్పికొడదాం..

– భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే

అమరావతి జేఏసీ కుట్రపూరిత రాజకీయాలను తరిమికొడదాం

కర్నూలుకు రానున్న హైకోర్టును రానివ్వకుండా అమరావతి జేఏసీ పేరుతో ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రపూరిత రాజకీయాలను తరిమికొడదాం. సీమ వాసులు ప్రశాంతంగా ఉన్నాం కనుకనే.. అమరావతి జేఏసీ వాళ్లు ఎంతో ధైర్యంతో తిరుపతి దాకా రాగలిగారు. ఇప్పుడు వారి కుట్రపూరిత రాజకీయాలను తరిమికొట్టేందుకు ప్రతి రాయలసీమ బిడ్డ మహాప్రదర్శనకు తరలిరావాలి.

– పురుషోత్తంరెడ్డి, రాయలసీమ మేధావుల ఫోరం అధ్యక్షుడు.

రాయలసీమ హక్కులను సాధించుకుందాం

రాయలసీమ హక్కులను సాధించుకునేందుకు సీమ వాసులంతా నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైంది. అమరావతి అభివృద్ధికి ఎలాంటి ఆటంకం లేకుండా.. రాయలసీమ, ఉత్తరాంధ్ర కూడా అభివృద్ధి చెందేలా సీఎం జగన్ వికేంద్రీకరణ నిర్ణయం తీసుకుంటే.. దానిని అడ్డుకోవడం దారుణం. సీమలో బిందెడు నీళ్లను రూ.2 వేలు ఇచ్చి కొనుక్కోవాల్సిన దుస్థితి రాకుండా జాగ్రత్తపడాల్సిన సమయం ఆసన్నమైంది.

– శైలుకుమార్, సాహితీవేత్త, మానసిక వికాస వేదిక కన్వీనర్

12న విశాఖ రైల్వేజోన్‌కు శంకుస్థాపన

▶ మొదటి పేజీ తరువాయి

తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రానికి ప్రధాని, ముఖ్యమంత్రి చేరుకుంటారు. కాసేపు ఈఎన్‌సీ అధికారులతో రక్షణ రంగంపై చర్చించి రాత్రి అక్కడే బసచేస్తారు. 12వ తేదీ ఉదయం ఏయూ గ్రౌండ్స్‌కి చేరుకుంటారు. అక్కడ భారీ బహిరంగ సభకు హాజరవుతారు. ఈ వేదిక నుంచే పలు కీలక కార్యక్రమాలకు ప్రధాని శ్రీకారం చుడతారు. అనంతరం మ.2 గంటలకు ఐఎన్ఎస్ డేగాకు చేరుకుని.. ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీ బయల్దేరుతారు. ఇక ప్రధాని మోదీ విశాఖలో ప్రారంభించే ప్రాజెక్టుల వివరాలివీ..

- ➤ దక్షిణ కోస్తా రైల్వేజోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి ప్రధాని మోదీ, సీఎం జగన్ శంకుస్థాపన చేస్తారు. సుమారు రూ.120 కోట్లతో జోన్ ప్రధాన కార్యాలయం నిర్మిస్తారు. డీఆర్ఎం కార్యాలయం సమీపంలోని వైర్‌లెస్ కాలనీలో ఈ హెడ్‌క్వార్టర్స్ నిర్మిస్తారు.
- ➤ విశాఖ శివారు వడ్లపూడిలో రైల్వే అనుబంధ సంస్థ ఆర్‌వీఎన్ఎల్ రూ.260 కోట్ల వ్యయంతో నిర్మించిన వ్యాగన్ వర్క్‌షాప్‌ను జాతికి అంకితం చేస్తారు. ఇక్కడ నెలకు 200 వ్యాగన్లను పూర్తిస్థాయిలో ఓవర్ హాలింగ్ చేసేలా నిర్మించారు.
- ➤ రైల్వే ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఆర్ఎల్‌డీఏ) నేతృత్వంలో రూ.446 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న విశాఖపట్నం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులకు ప్రధాని, సీఎం శంకుస్థాపన చేస్తారు.
- ➤ సుమారు రూ.26 వేల కోట్లతో హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్) చేపట్టిన రిఫైనరీ విస్తరణ ప్రాజెక్టుని కూడా వారిద్దరూ ప్రారంభిస్తారు.
- ➤ గంభీరంలో రూ.445 కోట్లతో మొదటి విడతలో నిర్మించిన ఐఐఎం విశాఖపట్నం క్యాంపస్‌నూ ప్రారంభిస్తారు. దీంతోపాటు రూ.380 కోట్లతో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికీ వారు శంకుస్థాపన చేస్తారు. వీటితో పాటు రైల్వే, ఇతర కేంద్ర సంస్థలకు సంబంధించిన పలు శంకుస్థాపనలను ప్రధాని చేస్తారు.
- ➤ ఆ తర్వాత ప్రధాని మోదీ, సీఎం జగన్ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరుకానున్నారు. కలెక్టర్ డా.మల్లికార్జున నేతృత్వంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పర్యవేక్షిస్తోంది.

బిగ్‌బాస్ షోపై స్పందించండి

కేంద్రానికి హైకోర్టు ఆదేశం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

సాక్షి, అమరావతి: బిగ్‌బాస్ షోపై కేంద్రం స్పందించాలని హైకోర్టు స్పష్టం చేసింది. షో ప్రసారాన్ని నిలిపివేయాలని పిల్ దాఖలు చేసిన పిటిషనర్ 2019లోనే కేంద్రానికి లేఖ రాశారని, అందువల్ల స్పందించడం కేంద్రం బాధ్యతని చెప్పింది. ప్రతివాదులుగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు డీజీపీ, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్, ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ ఫౌండేషన్, స్టార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ, షో రూపకర్త ఎండెమోల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు నటుడు అక్కినేని నాగార్జునకు నోటీసులిచ్చింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 10కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ దుప్పల వెంకటరమణ ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది.

పత్రాలు మార్చి అసైన్డ్ అరాచకం

▶ మొదటి పేజీ తరువాయి

రాజముద్ర వేస్తూ జీవోలు జారీ చేశారు. రూ.4 వేల కోట్ల విలువైన భూ దోపిడీ కోసం చంద్రబాబు సర్కారు అమలు చేసిన పన్నాగం ఇదిగో..

రెండంచెల్లో అసైన్డ్ భూ దోపిడీ

అమరావతి కోర్ క్యాపిటల్ పరిధిలోని 29 గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు చెందిన 964 ఎకరాల అసైన్డ్ భూములను సొంతం చేసుకునేందుకు టీడీపీ పెద్దలు తొలుత రెండంచెల పన్నాగాన్ని అమలు చేశారు. ఎలాంటి పరిహారం ఇవ్వకుండా అసైన్డ్ భూములను ప్రభుత్వం తీసుకుంటుందంటూ రెవెన్యూ, సీఆర్‌డీఏ అధికారుల ద్వారా విస్తృత ప్రచారం చేశారు. అనంతరం టీడీపీ ముఖ్య నేతల దళారీలు గ్రామాల్లో వాలిపోయారు. ప్రభుత్వానికి అప్పగిస్తే పరిహారం ఏమీ రాదని ఆందోళనకు గురి చేయడంతో పేద అసైన్డ్ రైతులు చేసేదిలేక వారికే విక్రయించేలా ఒప్పందం చేసుకున్నారు. ఇలా అసైన్డ్ భూ దోపిడీ వ్యవహారాన్ని 2014 జూన్ నుంచి 2015 డిసెంబరులోగా పూర్తి చేశారు. ఆ భూములన్నీ టీడీపీ నేతలు, వారి బినామీల గుప్పిట్లోకి వచ్చిన తరువాత అసైన్డ్ భూములకు కూడా పరిహారం ఇస్తామంటూ చంద్రబాబు ప్రభుత్వం 2016 ఫిబ్రవరి 17న జీవో 41 జారీ చేసింది. రూ.4 వేల కోట్ల విలువైన అసైన్డ్ భూములు తమ హస్తగతమయ్యాయని భావించింది. అసైన్డ్ భూములను టీడీపీ నేతలకు విక్రయించినట్లు మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేసేందుకు యత్నించారు. అయితే వీటిపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో పెండింగ్ రిజిస్ట్రేషన్లుగా నమోదు చేశారు. మరోవైపు ఆ భూములను రాజధాని కోసం భూ సమీకరణ కింద టీడీపీ నేతలు, వారి బినామీలు ఇచ్చినట్లు సీఆర్‌డీఏ రికార్డుల్లో నమోదు చేయడం గమనార్హం. సబ్ రిజిస్ట్రార్ రికార్డుల్లో భూములు అసైన్డ్ రైతుల పేరున ఉండగా సీఆర్‌డీఏ రికార్డుల్లో మాత్రం టీడీపీ నేతలు, బినామీలు ఇచ్చినట్లు చూపించారు.

జీవోలిచ్చి క్రమబద్ధీకరణ..

- ■ కురగల్లులో సర్వే నంబరు 538, 316/2, 534తో ఉన్న 2.46 ఎకరాల అసైన్డ్ భూములను టీడీపీ హయాంలో మంత్రిగా ఉన్న నారాయణకు సన్నిహితుడైన తేళ్ల శ్రీనివాసరావు (మైత్రి ఇన్ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్) కొనుగోలు చేశారు. 2015 సెప్టెంబరు 4న ఆ లావాదేవీని సబ్ రిజిస్ట్రార్ పెండింగ్ రిజిస్ట్రేషన్ నంబర్ 593/2015గా నమోదు చేశారు. టీడీపీ ప్రభుత్వం 2018లో జీవోలు 258, 575, 580 జారీ చేసిన తరువాత 2019 మార్చి 5న వాటిని 4420/2019 నంబరుతో క్రమబద్ధీకరించేశారు.
- ■ ఇదే తరహాలో 3534/2015 పెండింగ్ రిజిస్ట్రేషన్‌ను 2018 డిసెంబరులో 14113/18 నంబరుతో క్రమబద్ధీకరించేశారు.

ఏమార్చిన విధానం ఇలా..

టీడీపీ నేతల పేరిట అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు నిబంధనలు అడ్డంకిగా మారడంతో చంద్రబాబు ప్రభుత్వం భూ కుంభకోణంలో మూడో అంకానికి తెర తీసింది. 2018 మే 18న జీవో 258, నవంబరు 16న జీవో 575, 580 జీవోలు జారీ చేసింది. 1954 జూన్‌కు ముందు కేటాయించిన అసైన్డ్ భూములను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగిస్తున్నట్లు అందులో ప్రకటించింది. 22 ఏ జాబితా నుంచి తొలగించింది. టీడీపీ నేతలు దక్కించుకున్న అసైన్డ్ భూములన్నీ 1954 జూన్‌కు ముందే రైతులకు కేటాయించినవిగా చూపించి అధికారికంగా కాజేసే ఎత్తుగడ వేసింది. ఆమేరకు తహసీల్దార్ కార్యాలయాల్లో రికార్డులను తారుమారు చేశారు. అనంతరం జీవోలు 258, 575, 580 ద్వారా సీఆర్‌డీఏ కార్యాలయంలో కథ నడిపించారు. అయితే అమరావతిలో అసైన్డ్ భూములన్నీ 1970 నుంచి 1995 మధ్యలో కేటాయించినవే కావడం గమనార్హం. ఈ క్రమంలో అసైన్డ్ భూములన్నీ 1954కు ముందే కేటాయించినట్లుగా చూపిస్తూ వాటిని సొంతం చేసుకున్న టీడీపీ నేతలు భూ సమీకరణ కింద సీఆర్‌డీఏకు ఇవ్వడాన్ని క్రమబద్ధీకరించే ప్రక్రియ చేపట్టారు. 2019లో ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చేసరికి దాదాపు 400 పెండింగ్ రిజిస్ట్రేషన్లను సీఆర్‌డీఏ రికార్డుల్లో ఇలా క్రమబద్ధీకరించేశారు. భూ సమీకరణ ప్యాకేజీ కింద ఇచ్చే నివాస, వాణిజ్య స్థలాలతోపాటు ఏటా పంట పరిహారం టీడీపీ పెద్దల బినామీలకే దక్కేలా స్కెచ్ వేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులను నిండా ముంచారు. 2019లో మళ్లీ అధికారంలోకి వస్తే మొత్తం 964 ఎకరాలను టీడీపీ పెద్దల పేరిట క్రమబద్ధీకరించాలని భావించారు. కానీ చంద్రబాబు ఒకటి తలిస్తే దైవం మరోలా తలచింది. టీడీపీ ఘోర పరాజయంతో చంద్రబాబు అసైన్డ్ భూముల కుంభకోణం కథ అడ్డం తిరిగింది.

విద్యుత్ రంగంలో మరో ముందడుగు



మత్స్యకారులకు ప్రత్యేక జెట్టీ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు



ముదివర్తి–ముదివర్తిపాళెం మధ్య సబ్‌మెర్సిబుల్ కాజ్‌వేకు శంకుస్థాపన చేస్తున్న సీఎం వైఎస్ జగన్



కృష్ణపట్నం పోర్టు నిర్వాసితుల ఖాతాల్లో మత్స్యకారేతర పరిహారాన్ని జమ చేస్తున్న ముఖ్యమంత్రి

▶ మొదటి పేజీ తరువాయి

మన రాష్ట్ర తొలి దళిత సీఎం శ్రీ దామోదరం సంజీవయ్య పేరు పెట్టుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎం ఇంకా ఏమన్నారంటే..

నాణ్యమైన, నిరంతర విద్యుత్

- ➤ రాష్ట్రంలో గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాల వినియోగదారులందరికీ రోజంతా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో పాటు, వ్యవసాయానికి తొమ్మిది గంటల పాటు ఉచిత విద్యుత్ ఇవ్వడం కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నాం.
- ➤ మనందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ థర్మల్ పవర్ స్టేషన్లోని ఈ ప్రాజెక్టుకు రూ.3,200 కోట్లు యుద్ధ ప్రాతిపదికన ఖర్చు చేశాం. 3 సంవత్సరాల 4 నెలల కాలంలో ప్రాజెక్టు పూర్తి చేశాం. రాష్ట్ర విద్యుత్ అవసరాల్లో దాదాపు 45 శాతం కరెంటు ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలు ఉత్పత్తి చేస్తున్నాయి.
- ➤ ఈ రోజు జాతికి అంకితం చేసిన ఈ ప్లాంటు నుంచి రోజుకు 19 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఏపీ గ్రిడ్‌కు సరఫరా అవుతుంది. సాధారణ థర్మల్ విద్యుత్ ప్లాంటుతో పోల్చితే సూపర్ క్రిటికల్ ప్లాంటు తక్కువ బొగ్గుతో విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. దీనివల్ల వెలువడే కాలుష్యం తగ్గుతుంది.

భూములిచ్చిన రైతులకు అభివాదం

- ➤ ఒకవైపు కృష్ణపట్నం పోర్టు, మరోవైపు థర్మల్ పవర్ ప్లాంటు.. ఈ రెండూ ఈ ప్రాంతంలో రావాలి. వీటి ద్వారా జిల్లా అభివృద్ధి చెందాలని, ఈ ప్రాజెక్టుల కోసం భూములిచ్చిన రైతులందరికీ నిండు మనసుతో శిరసు వంచి ప్రత్యేకంగా అభివాదం తెలియజేస్తున్నా.
- ➤ వీళ్లందరికీ మంచి కార్యక్రమాలు చేసే దిశగా అడుగులు ముందుకు వేస్తున్నాం. ఇందులో భాగంగానే ఇదివరకే 326 కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వడమే కాకుండా, రెండో దశలో మరో 150 కుటుంబాలకు ఉద్యోగాలిచ్చే ప్రక్రియను ఈ నవంబర్ పూర్తయ్యేలోగా ప్రారంభించాలని ఆదేశించాం.

నెరవేరిన మరో ఎన్నికల హామీ

- ➤ ప్రాజెక్టు ప్రారంభోత్సవంతో పాటు ఎన్నికల వేళ ఆరోజు మీకు ఇచ్చిన హామీ నెరవేర్చడానికి నేను ఇక్కడకు వచ్చాను. ఎన్నికలప్పుడు మాత్రమే చంద్రబాబునాయుడుకు మేమంతా గుర్తుకు వస్తామని ఆ రోజు మీరందరూ చెప్పారు.
- ➤ ఆయన ఐదేళ్ల పరిపాలనలో చేసిన మంచేమీ లేకపోయినా, హడావుడిగా ఎన్నికలప్పుడు ఇక్కడికి వచ్చి మమ్మల్ని అందరినీ మళ్లీ మోసం చేసే ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. మీ అందరి కష్టాలు నేను చూశాను.. నేను విన్నాను.. నేను ఉన్నాను అని ఆ రోజు నేను చెప్పాను.
- ➤ ఆనాడు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఇవాళ 16,337 మత్స్యకారేతర కుటుంబాలకు కూడా బటన్ నొక్కి నేరుగా రూ.36 కోట్ల పరిహారాన్ని వాళ్ల బ్యాంక్ అకౌంట్లో జమ చేస్తున్నాం. ఆ వేళ హడావుడిగా కేవలం మోసం చేసే ఉద్దేశంతో చంద్రబాబు కేవలం 3,550 కుటుంబాలకు రూ.14,000 కూడా సరిగా ఇవ్వని పరిస్థితులు. ఈ రోజు వాళ్లకు మిగతా సొమ్ము ఇవ్వడమే కాకుండా, మిగిలిపోయిన 12,787 కుటుంబాలకు కూడా మంచి చేస్తూ, ఒక్కో కుటుంబానికి రూ.25 వేల చొప్పున ఈ ప్యాకేజీ ఇస్తున్నాం.



థర్మల్ పవర్ స్టేషన్‌లో నిర్మించిన 3వ యూనిట్‌ను బటన్ నొక్కి ప్రారంభిస్తున్న సీఎం జగన్

ముదివర్తి–ముదివర్తిపాళెం మధ్య సబ్‌మెర్సిబుల్ కాజ్‌వే

- ➤ నెల్లూరు జిల్లాలో పెన్నా నదిపై ముదివర్తి–ముదివర్తిపాళెం మధ్య సబ్‌మెర్సిబుల్ కాజ్‌వే నిర్మాణం కోసం రూ.93 కోట్లు కేటాయిస్తూ.. దానికి ఇవాళ శంకుస్థాపన చేస్తున్నాం. నా సోదరుడు, శాసనసభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరిక మేరకు ఈ కాజ్‌వే నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నా.
- ➤ ఇటువంటి ప్రాజెక్టు కోసం దశాబ్దాలుగా అడుగుతున్నా, పట్టించుకోని పాలకులను మనం చూశాం. ఈ ప్రాజెక్టు కట్టడం వల్ల సముద్రంలోకి వెళ్లే నీటిని ఆపగలుగుతాం. సముద్రం నుంచి వచ్చే బ్యాక్ వాటర్‌నూ ఆపగలుగుతాం. తద్వారా నాలుగు మండలాల్లో నీటి సమస్య పరిష్కారం అవుతుంది. ఇటీవల ప్రారంభించిన నెల్లూరు బ్యారేజీకి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరు పెడుతున్నాం.

మత్స్యకారుల కోసం ప్రత్యేక జెట్టీ

- ➤ ఈ ప్రాంతానికి చెందిన మత్స్యకారులకు ప్రత్యేక జెట్టీ ఏర్పాటు కోసం రూ.25 కోట్లతో శంకుస్థాపన చేశాం. ఉప్పుకాలువ, వెంకటాచలం రోడ్డు నుంచి తిరుమలమ్మపాళెం హైలెవల్ బ్రిడ్జి కోసం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రూ.12 కోట్లు అడిగారు. దాన్ని మంజూరు చేస్తున్నాం. మరో హైలెవల్ బ్రిడ్జి.. నెల్లూరు నక్కలవాగు – కృష్ణపట్నం రోడ్డు నుంచి పోటంపాడు (వయా బ్రహ్మదేవం) వరకు మరో రూ.10 కోట్లు అడిగారు. అది కూడా మంజూరు చేస్తున్నా.
- ➤ ప్రతి గ్రామం రూపురేఖలు మార్చాలని, ప్రతి ఒక్కరికీ మంచి చేయాలనే తాపత్రయంతో అడుగులు వేగంగా వేస్తున్న మనందరి ప్రభుత్వానికి దేవుడి చల్లని దీవెనలు, మీ అందరి చల్లని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నా.



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నేలటూరులో నిర్వహించిన సభకు భారీగా హాజరైన జనవాహిని

మనం గర్వించాల్సిన రోజు

మనం నిజంగా గర్వించాల్సిన రోజిది. అనేక సందర్భాల్లో ఈ ప్రాంతానికి నాన్ ఫిషర్‌మెన్ ప్యాకేజీ కోసం ప్రతి వాగ్దానం చేయడం, అమలు చేయకపోవడం జరిగింది. ఎన్నికల ముందు చంద్రబాబు మూడు విడతల్లో ప్యాకేజీ ఇస్తామని చెప్పారు. 3,500 మంది ఎస్సీ, ఎస్టీలకు గాను వారిలో కూడా టీడీపీ వారికే ఇస్తామని, వైఎస్సార్‌సీపీ వారిని పక్కనపెట్టండని చెప్పి.. ఎవరికీ ఇవ్వలేదు. మా నాయకుడు వైఎస్ జగన్ ఇచ్చిన మాట మేరకు తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి నాన్ ఫిషర్‌మెన్ ప్యాకేజీ ఇస్తున్నారు. టీడీపీ హయాంలో కేవలం 7 పంచాయతీలనే ప్యాకేజీకి ఎంపిక చేశారు. మన ప్రభుత్వం 20 పంచాయతీలతో పాటు, పోర్టుకు, థర్మల్ విద్యుత్ కేంద్రానికి భూములిచ్చిన వారికీ రూ.36 కోట్ల ప్యాకేజీ ఇస్తోంది. ఉప్పుకాలువ మీద రూ.12 కోట్లతో బ్రిడ్జి, కృష్ణపట్నం నక్కలకాలువ వాగు మీద రూ.9.40 కోట్లతో మరో బ్రిడ్జి మంజూరు చేయాలని అడుగుతున్నాం.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి

విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు

ఈ రోజు 800 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల 3వ యూనిట్ అందుబాటులోకి వచ్చింది. ఈ సూపర్ క్రిటికల్ టెక్నాలజీ విద్యుత్ స్టేషన్ దేశంలోనే మొదటిది. అడ్డగోలు పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లతో చంద్రబాబు రూ.20 వేల కోట్లకు పైగా నష్టాల్లోకి తోశారు. రోజు రోజుకు పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని బట్టి ఉత్పత్తి కూడా పెంచాలని సీఎం జగన్ అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారు. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ ద్వారా ఉత్పత్తిని పెంచడమే కాకుండా ఖర్చు తగ్గేలా ప్రణాళికలు రూపొందించారు. ఇవి ఆచరణలోకి వస్తే మనం ఇతర రాష్ట్రాలకు విద్యుత్ ఇచ్చే పరిస్థితి వస్తుంది. ట్రాన్స్‌కో అభివృద్ధికి రూ.4 వేల కోట్లతో ఎన్నో చర్యలు తీసుకున్నారు. రూ.40 వేల కోట్ల ఆర్థిక సాయంతో డిస్కంలను ఆదుకుంటున్నారు. ఇవాళ మనం 45 శాతం విద్యుత్‌ను జెన్‌కో ద్వారా ఉత్పత్తి చేస్తున్నాం. ఇంకా పలు విధాలా ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై దుష్ట చతుష్టయం దుష్ప్రచారం చేస్తోంది. నిత్యం అసత్యాలు వల్లించే ఈ పచ్చ పత్రికలు, పచ్చ టీవీలు చూడొద్దని విజ్ఞప్తి చేస్తున్నా.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి

బీసీల చేతికి బలమైన ఆయుధం


సభకు హాజరైన బీసీ నాయకులు

సాక్షి, అమరావతి: దార్శనికతతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న విప్లవాత్మక చర్యలతో బీసీలకు మంచి రోజులు వచ్చాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎన్నో ఏళ్లుగా బీసీలే ముఖ్యమంత్రులుగా ఉన్నా ఏ ఒక్కరూ సీఎం జగన్ మాదిరిగా బీసీలకు న్యాయం చేయలేకపోయారన్నారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు, సమాజంలో గౌరవం, రాజకీయ అధికారంలోనూ బీసీలకు తగిన వాటా కల్పించిన సీఎం జగన్ గొప్ప సామాజిక విప్లవకారుడని అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదన్నారు. గతంలో భిక్షాటన చేసిన అత్యంత వెనుకబడిన సంచార జాతులకు చెందిన వారు సైతం ఇప్పుడు కార్పొరేషన్ చైర్మన్లుగా చైతన్యంతో పనిచేస్తున్నారని చెప్పారు. ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్ అధ్యక్షతన గురువారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన 'బీసీ ఆత్మగౌరవ సభ'లో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని 40 ఏళ్లుగా పోరాడుతున్నానని, ఎందరో ప్రధానులను కలిశానని, ఆర్జేడీ, సమాజ్‌వాదీ లాంటి పార్టీలను కలిసినా ఎవరూ ముందుకు రాలేదన్నారు. ఒకే ఒక్కసారి సీఎం జగన్‌ను కలిసి బీసీ బిల్లు పెట్టాలని కోరగా విజయసాయిరెడ్డి ద్వారా ప్రవేశపెట్టాలని పార్టీ ఎంపీలను ఆదేశించారని వెల్లడించారు. బీసీ బిల్లు ఎప్పటికైనా పార్లమెంట్‌లో కచ్చితంగా ఆమోదం పొందుతుందని, బీసీల కోసం తొలిసారిగా ప్రైవేట్ బిల్లు పెట్టిన ఏకైక పార్టీగా వైఎస్సార్‌సీపీ నిలిచిపోతుందని కృష్ణయ్య చెప్పారు. బీసీల తలరాతలు, బతుకుల్లో మార్పు తెచ్చిన సీఎం జగన్‌ను రాజకీయ నాయకుడిగా కాకుండా సంఘ సంస్కర్తగా గుర్తించి పార్టీలకు అతీతంగా బీసీలంతా అండగా నిలబడాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు.

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఏపీ బీసీ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు బేబీరాణి, ఆసిఫా, కొండా రాజీవ్‌గాంధీ, నౌడు వెంకటరమణ, జబ్బల శ్రీనివాసులు తదితరులు కార్యక్రమంలో మాట్లాడారు.

బీసీల విజయంగా భావించాలి



సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్‌ను మళ్లీ గెలుపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో గెలుపు సాధించటాన్ని బీసీల విజయంగా భావించాలి. ఆర్థిక పరిస్థితి సరిగా లేకున్నా సంక్షేమ పథకాలు సజావుగా అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే. ఆర్.కృష్ణయ్య లాంటి బీసీ ఉద్యమ నేతకు రాజ్యసభ సీటు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుంది. బీసీలకి వైఎస్సార్‌సీపీ వెన్నుదన్నుగా నిలుస్తోందని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం అవసరంలేదు. చంద్రబాబు 14 ఏళ్లు అధికారంలో ఉండి బీసీలకు ఏమీ చేయలేదు.

– సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు

మన బాధ్యత



టీడీపీ నేతలు రాజకీయ లబ్ధి కోసం బీసీలను రెచ్చగొడుతున్నారు. సీఎం జగన్‌ను 2024 ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి తెచ్చి బీసీల కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు కొనసాగేలా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది.

–ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

ఆత్మ గౌరవ రక్షకుడు



చట్ట సభల్లో రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టిన ఘనత వైఎస్సార్‌సీపీదే. పథకాల కోసం యాచించే దుస్థితిని తొలగించి సీఎం జగన్ సగౌరవంగా అందిస్తున్నారు. బీసీలను పాలకులుగా తీర్చిదిద్దుతున్నారు. బీసీల ఆత్మగౌరవ రక్షకుడు సీఎం జగన్.

–చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి

బలవంతులుగా తీర్చిదిద్దారు



జనరల్ సీట్లను కూడా బీసీలకు ఇచ్చి గెలిపించిన అభినవ పూలే సీఎం జగన్. విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ఇందుకు నిదర్శనం. టీడీపీ బీసీలను బానిసలుగా వాడుకుంటే వైఎస్సార్‌సీపీ అనేక అవకాశాలిచ్చి బలవంతులుగా తీర్చిదిద్దింది.

–జోగి రమేష్, గృహనిర్మాణ శాఖ మంత్రి

చంద్రబాబును చరిత్ర క్షమించదు



బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేసిన చంద్రబాబును చరిత్ర క్షమించదు. బీసీలకు సీఎం జగన్ కల్పిస్తున్న భరోసాను ప్రతి ఇంటికీ వివరించి అండగా నిలవాలి.

–విడదల రజిని, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి

వ్యక్తిత్వాలే నిదర్శనం



2014లో చంద్రబాబు తొలి కలెక్టర్ల సమావేశంలోనే టీడీపీ కార్యకర్తలు, తమ పార్టీ నేతలు చెప్పిన పనులే చేయాలని ఆదేశించారు. 2019లో సీఎం జగన్ తొలి కలెక్టర్ల సమావేశంలో కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా సంక్షేమ కార్యక్రమాలను అర్హులకు అందించాలని ఆదేశించారు. ఇద్దరి వ్యక్తిత్వాలు ఏమిటో చెప్పేందుకు ఇది చాలు.

– కారుమూరి నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ మంత్రి

గొప్ప అవకాశాలు



మునుపెన్నడూలేని విధంగా బీసీలకు గొప్ప అవకాశాలు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుంది. బీసీల్లో చురుకైన యువతకు బాధ్యతలు అప్పగించి ఆయా సామాజిక వర్గాల అభ్యున్నతిని ప్రోత్సహిస్తున్నారు.

– సీదిరి అప్పలరాజు, పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి

గుండెల్లో దాచుకుంటాం



మా తలరాతలు మార్చిన విజనరీ సీఎం వైఎస్ జగన్. ఆర్.కృష్ణయ్యను పిలిచి రాజ్యసభ సీటు ఇచ్చిన సీఎం జగన్‌ను ఎప్పటికీ గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటాం. బీసీ మంత్రులపై దాడి చేసిన వారిని చంద్రబాబు పరామర్శించడం దారుణం.

–మారేష్, ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు

బాబు బెదిరిస్తే.. జగన్ ఆదరిస్తున్నారు

బీసీ సదస్సు విజయవంతం కావడంతో టీడీపీలో వణుకు: మంత్రి చెల్లుబోయిన

సాక్షి, అమరావతి: బీసీల్లో వెనుకబాటుతనాన్ని రూపుమాపి సమాజానికి వెన్నెముకగా నిలిపేలా సీఎం జగన్ మూడున్నరేళ్లుగా చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తెలిపారు. బీసీలను గుర్తించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ బీసీ సదస్సు ఫలప్రదం కావడంతో విపక్ష టీడీపీ నేతలు అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రంలో సీఎం జగన్ సంక్షేమ పరిపాలన ఆరంభంతోనే టీడీపీకి బీసీలు పూర్తిగా దూరమయ్యారు. భయాన్ని దాచుకుంటూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. వైఎస్సార్ సీపీ నేత విజయసాయిరెడ్డికి బీసీల సభతో ఏం సంబంధం ఉందని విమర్శిస్తున్న టీడీపీ నాయకులకు కనీస పరిజ్ఞానం ఉందా? పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో సభకు హాజరై బీసీ ప్రముఖులతో చర్చించి సీఎం విధానాలను వివరించారు. చంద్రబాబు బీసీలను అగౌరవించి తోకలు కత్తిరిస్తానని బెదిరిస్తే సీఎం వైఎస్ జగన్ ఆత్మగౌరవంతో బతికేలా అండగా నిలిచారు. పథకాల కోసం యాచించాల్సిన దుస్థితిని తొలగించి సగౌరవంగా డీబీటీతో నేరుగా ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నారు. బీసీలంటే చంద్రబాబుకు ద్వేషం, కక్ష. ఆయన పాలన చూసి ఓటెయ్యాలని ప్రజలను అడిగే ధైర్యం లేక అక్రమ పొత్తులు, కుట్ర పూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో బీసీలకు విదిల్చింది సుమారు రూ.19 వేల కోట్లు మాత్రమే. వైఎస్సార్ సీపీ పాలనలో మూడున్నరేళ్లలో బీసీలకు రూ.82,373.43 కోట్లు పారదర్శకంగా అందించాం. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన పాపం టీడీపీదే. జిల్లా కలెక్టర్ పెన్షన్ మంజూరు చేయాలంటే జన్మభూమి కమిటీకి చెందిన టీడీపీ నేత సంతకం చేయాలనే దుస్థితికి పరిపాలనను తీసుకెళ్లింది ఎవరు? సర్పంచ్, ఎంపీటీసీలు జన్మభూమి కమిటీల నుంచి అనుమతి పొందాలని ఆంక్షలు విధించింది చంద్రబాబు కాదా? 2018లోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా బీసీ రిజర్వేషన్లకు తూట్లు పొడిచింది చంద్రబాబే.' అని మంత్రి అన్నారు.

కుప్పంలో అరాచకాన్ని కేస్ స్టడీగా తీసుకోవచ్చు

నియోజకవర్గ సమీక్షలో చంద్రబాబు


లోకేశ్‌తో మంగళగిరి నియోజకవర్గంపై చంద్రబాబు సమీక్ష

సాక్షి, అమరావతి : ముఖ్యమంత్రి జగన్ క్యారెక్టర్ ఏంటో తెలియాలంటే కుప్పంలో ఈ ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాన్ని ఒక కేస్ స్టడీగా తీసుకోవచ్చని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అన్నారు. అభివృద్ధి రాజకీయాలు మాత్రమే తెలిసిన కుప్పం ప్రజలకు వైసీపీ అరాచక రాజకీయం కొత్తగా ఉందని చెప్పారు. కుప్పంను తొలి నుంచి ఒక మోడల్ నియోజకవర్గంగా చేశామని.. హింస, విద్వేష రాజకీయాలను ఇక్కడి ప్రజలు అనుమతించరన్నారు. పార్టీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లతో రివ్యూలలో భాగంగా గురువారం ఆయన కుప్పం నేతలతో సమీక్ష నిర్వహించారు. నేతలు ఎవరూ భేషజాలకు పోవద్దని, గ్రామ స్థాయి వరకు అందరినీ కలుపుకుని వెళ్లాలని సూచించారు. కుప్పంలో నేతలను, కార్యకర్తలను.. కేసులు, దాడులు, కుల విద్వేషాలతో నైతికంగా దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని, దీన్ని స్థానిక నాయకత్వం సమర్థంగా తిప్పికొట్టాలని సూచించారు. ఈ సమీక్షలో 11 మంది క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, మండల పార్టీ అధ్యక్షులతో పాటు మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీఎస్ మునిరత్నం, తదితర నేతలు హాజరయ్యారు.

మంగళగిరి నియోజకవర్గంపై లోకేశ్‌తో సమీక్ష

మంగళగిరి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై ఆ నియోజకవర్గ ఇన్‌చార్జ్, తన కుమారుడు లోకేశ్‌తో గురువారం చంద్రబాబు సమీక్షించారు. 2019 ఎన్నికల తర్వాత మంచి మార్పు కనిపిస్తోందన్నారు. తిరుగులేని విజయంతో మంగళగిరిలో కొత్త చరిత్ర రాయాలని లోకేశ్‌కు సూచించారు. తాను ఓడినా, నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజలకు చేరువ అయ్యానని లోకేశ్ తెలిపారు. కర్నూలు ఇన్‌చార్జ్ టీజీ భరత్, ఇచ్చాపురం ఇన్‌చార్జ్ బెందాళం అశోక్‌లతో సమీక్ష నిర్వహించారు.

నేడు కాకినాడలో ఐఐఎఫ్‌టీ ప్రారంభం

- దేశంలోనే మూడో క్యాంపస్...
- ప్రారంభించనున్న కేంద్ర మంత్రులు

సాక్షిప్రతినిధి, కాకినాడ : ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ) కాకినాడ క్యాంపస్‌ను శుక్రవారం కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తదితరులు ప్రారంభించనున్నారు. ప్రస్తుతం స్థానిక జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన ఐఐఎఫ్‌టీ కాకినాడ క్యాంపస్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సును 40 సీట్లతో ప్రారంభించారు. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఐఐఎఫ్‌టీ తొలి క్యాంపస్‌ను 1963లో ఢిల్లీలో, రెండో క్యాంపస్‌ను కోల్‌కతాలో 2006లో ప్రారంభించారు. తాజాగా మూడో క్యాంపస్ కాకినాడలో ఏర్పాటు చేశారు. డీమ్డ్ యూనివర్సిటీగా ఉన్న ఈ ఐఐఎఫ్‌టీకి దేశవ్యాప్తంగా నాక్-ఏ ప్లస్ గుర్తింపు ఉంది. ఇంటర్మీడియెట్, ప్లస్-2 అనంతరం ఇండోర్ ఐఐఎం నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్ ద్వారా అర్హత పొందిన వారికి ఐఐఎఫ్‌టీలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సులో ప్రవేశానికి అవకాశం ఉంటుంది. ఈ కోర్సులో తొలి మూడేళ్లు బీబీఏ, తర్వాత రెండేళ్లు ఎంబీఏ చేయాలి. ఈ కోర్సులో శిక్షణ, పరిశోధనలు ఉంటాయి. ఐఐఎఫ్‌టీ కోర్సు పూర్తి చేసిన వారికి ప్రారంభంలోనే రూ.12 లక్షల నుంచి రూ.65 లక్షలు వరకు వార్షిక వేతనాలు ఉన్నాయి. దీంతో దేశవ్యాప్తంగా ఈ కోర్సుకు మంచి డిమాండ్ ఉంది.

సీఎం చొరవతో 25 ఎకరాల కేటాయింపు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఐఐఎఫ్‌టీ కాకినాడ క్యాంపస్ కోసం సముద్ర తీరం వెంబడి కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి (కేఎస్ఈజడ్)లో 25 ఎకరాలను గతేడాది కేటాయించారు. సముద్ర తీర ప్రాంతంలో ఈ క్యాంపస్ ఏర్పాటు చేయడం ద్వారా దేశం నలుమూలల నుంచి వచ్చే విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలనేది ఆలోచన. ఇందుకనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

లక్ష్యం దిశగా 'టిడ్కో' అడుగులు

మౌలిక వసతుల కల్పనపై నేడు ఉన్నతస్థాయి సమావేశం

సాక్షి, అమరావతి: పట్టణ పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను సాధ్యమైనంత వేగంగా లబ్ధిదారులకు అందించేందుకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం గృహ నిర్మాణ శాఖ ప్రగతిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలు కీలక ఆదేశాలు జారీచేయడంతో అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా తక్కువ కాలంలోనే 40 వేలకు పైగా టిడ్కో యూనిట్లను లబ్ధిదారులకు అందజేయడంపై సంబంధిత శాఖ అధికారుల పనితీరును అభినందించిన ముఖ్యమంత్రి, డిసెంబర్ నాటికి 1.10 లక్షల యూనిట్లను పూర్తిస్థాయిలో అందజేయాలని ఆదేశించారు. దీంతో టిడ్కో ఎండీ చిత్తూరి శ్రీధర్, చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు బుధ, గురువారాల్లో సమావేశాలు నిర్వహించి మొత్తం 88 అర్బన్ లోకల్ బాడీల్లో (యూఎల్బీ-స్థానిక సంస్థలు) చేపట్టిన జీ+త్రీ నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. ఫేజ్-1 కింద చేపట్టిన ఇళ్లల్లో 1.05 లక్షల యూనిట్లు పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తిచేసుకోగా, వాటిలో కొన్నింటికి విద్యుత్, డ్రైనేజీ, తాగునీరు, ఎస్టీపీలు, రోడ్లు వంటి అన్ని మౌలిక వసతులు కల్పించాల్సి ఉందని తేల్చారు. ఆయా పనులకు మొత్తం రూ.2 వేల కోట్లు అవసరం కాగా, ఆ నిధులను హడ్కో నుంచి తీసుకోవాలని నిర్ణయించారు. మరో వారం పదిరోజుల్లో అవసరమైన రుణం రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోపక్క.. పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తిచేసుకున్న ఇళ్లను ఎప్పటికప్పుడు జిల్లాల వారీగా లబ్ధిదారులకు అందజేత ప్రక్రియ సైతం కొనసాగించాలని నిర్ణయించారు. రాష్ట్రంలోనే అతి పెద్ద టిడ్కో ప్రాజెక్టుల్లో ఒకటిగా గుర్తింపు పొందిన గుడివాడ మున్సిపాలిటీ పరిధిలో నిర్మిస్తున్న 8,912 గృహాలను డిసెంబర్‌కల్లా పూర్తిచేసి అందించాలని నిర్ణయించారు.

తీరం వెంబడి రక్షణ గోడ నిర్మాణం

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్
- నరసాపురంలో పర్యటన


పెదమైనవానిలంక బీచ్‌లో సముద్రనీటిని నెత్తిన జల్లుకుని అభివాదం చేస్తున్న నిర్మలాసీతారామన్

నరసాపురం: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం నియోజకవర్గంలోని పెదమైనవానిలంకలో పైలట్ ప్రాజెక్ట్‌గా తీరం వెంబడి రక్షణగోడ నిర్మిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ తెలిపారు. నిర్మలాసీతారామన్ తన అత్తగారి ఊరు, ఆమె చాలా కాలం నివాసం ఉన్న నరసాపురానికి దాదాపు ఐదేళ్ల తర్వాత గురువారం వచ్చారు. ఆమె నియోజకవర్గం అంతా కలియదిరిగారు. ప్రధానమంత్రి సంసద్ ఆదర్శ గ్రామ యోజన పిలుపులో భాగంగా తాను దత్తత తీసుకున్న నరసాపురం మండలంలోని పెదమైనవానిలంక, తూర్పుతాళ్లు గ్రామాల్లో ఆమె పర్యటించారు. పెదమైనవానిలంకలో ఆమె 2015లో కేంద్ర మంత్రిగా ఉండగా, మంజూరు చేసిన నిధులు రూ.3.30 కోట్లతో నిర్మించిన డిజిటల్ కమ్యూనిటీ భవనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ భవనంలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. వెబ్ డిజైనింగ్, బ్యూటీషియన్ తదితర కోర్సులు ప్రారంభించారు. ఈ భవనంలో పెద్ద ఎత్తున యువతకు ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇచ్చే కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం అదే గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయ భవనాలను, రూ.27 లక్షలతో నిర్మించిన రక్షిత నీటి కేంద్రాన్ని, రూ.13 లక్షలతో నిర్మించిన ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. తీర గ్రామాల్లో సముద్ర కోతను నివారించడానికి అమెరికాకు చెందిన డిలైట్ సంస్థ ప్రతినిధులను వెంటబెట్టుకుని వచ్చిన నిర్మలా సీతారామన్... పైలట్ ప్రాజెక్ట్‌గా పెదమైనవానిలంకలో తీరం వెంబడి రక్షణగోడ నిర్మిస్తున్నట్లు తెలిపారు. పెదమైనవానిలంకలో సముద్రానికి అభివాదం చేశారు. అక్కడ జరిగిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు.

మంత్రి సురేష్ మోకాలికి శస్త్రచికిత్స


మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న మంత్రి ఆదిమూలపు సురేష్

సాక్షి, అమరావతి/యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మోకాలికి శస్త్రచికిత్స చేశారు. ఆయన కొద్దికాలంగా మోకాలు నొప్పితో బాధపడుతున్నారు. వైద్యుల సూచన మేరకు ఆయన గురువారం హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆపరేషన్ విజయవంతంగా జరిగిందని వైద్యులు తెలిపారు. త్వరలోనే పూర్తిగా కోలుకుని ప్రజలకు అందుబాటులో ఉంటానని మంత్రి సురేష్ పేర్కొన్నారు.

సచివాలయాల్లో కారుణ్య నియామకాలు

- ప్రొబేషన్ సమయంలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు అవకాశం
- ఉత్తర్వులు జారీచేసిన గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక సీఎస్

సాక్షి, అమరావతి: ప్రొబేషన్ సమయంలో విధి నిర్వహణలో మరణించిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించే కారుణ్య నియామకాలకు అనుమతిస్తూ గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. పలు ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆ ఉత్తర్వుల్లో తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల ఆధారంగా కారుణ్య నియామకాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రొబేషన్ సమయంలో మరణించిన గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల కుటుంబాల్లో కారుణ్య నియామకాలకు అనుమతించడం పట్ల గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఉత్తర్వుల ద్వారా 200కు పైగా కుటుంబాల్లో వెలుగులు నింపి మనోధైర్యం కల్పించినట్లయిందని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ రజాక్, చిరు కుటుంబాలకు ప్రభుత్వం కొండంత ఆసరాగా నిలిచిందని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.జానిపాషా వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. కారుణ్య నియామకాలకు అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి ఆయా కుటుంబాలకు అండగా నిలిచారని, అందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని గ్రామ,వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భీమిరెడ్డి అంజన్‌రెడ్డి, అసోసియేషన్ ఇతర ప్రతినిధులు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ రాత పరీక్షల షెడ్యూల్

సాక్షి, అమరావతి : వివిధ పోస్టుల భర్తీకి సంబంధించిన రాత పరీక్షల షెడ్యూల్‌ను ఏపీపీఎస్సీ గురువారం ప్రకటించింది. ఈ పరీక్షల హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని అభ్యర్థులకు సూచించింది. ఈ షెడ్యూల్ లోని పోస్టులన్నింటికీ జనరల్ స్టడీస్ మెంటల్ ఏబిలిటీ పరీక్ష నవంబర్ 7న జరగనుంది. అన్ని పోస్టులకు ఇది కామన్ పేపర్.

దేవదాయ శాఖ ఈవో స్క్రీనింగ్ టెస్ట్ ఫలితాలు

దేవదాయ శాఖ ఈవో స్క్రీనింగ్ టెస్ట్ ఫలితాలను ఏపీపీఎస్సీ ప్రకటించింది. పరీక్ష రాసిన మొత్తం 52,915 మందికి గాను 1,278 మంది మెయిన్ పరీక్షకు ఎంపికయ్యారు

సబ్జెక్టు పరీక్షల షెడ్యూల్ ఇలా..

డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్(పేపర్ 2, 3)	: నవంబర్-3
ఏపీఆర్వో(పేపర్ 2)	: నవంబర్-4
అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్(పేపర్ 2)	: నవంబర్-4
హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్ 2 ఉమెన్(పేపర్ 2)	: నవంబర్-5
డీపీఆర్వో (పేపర్ 2, 3)	: నవంబర్-6
ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ స్త్రీశిశు సంక్షేమం(పేపర్ 2)	: నవంబర్-7
తెలుగు రిపోర్టర్(పేపర్ 2)	: నవంబర్-16

ఆర్బీకేలలో విజిలెన్స్ తనిఖీలు


ఆర్బీకే లలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 42 రైతు భరోసా కేంద్రాల్లో విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. తేమ శాతం ఎక్కువగా ఉందని, రాళ్లు ఉన్నాయంటూ రైస్ మిల్లర్లు రైతుల నుంచి బస్తాకు 3 కేజీల నుంచి 6 కేజీల ఎక్కువ ధాన్యం తీసుకుంటున్నట్టు అధికారులు గుర్తించారు. కొన్ని చోట్ల ధాన్యం సేకరణ అధికారులు క్షేత్రస్థాయిలో ఉండకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తేల్చారు. తమ తనిఖీల్లో బయటపడిన అంశాలపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని విజిలెన్స్ అధికారులు చెప్పారు.

జనవరిలో సీఎస్‌ల సమావేశం

సాక్షి, అమరావతి: వచ్చే ఏడాది జనవరి మొదటి వారంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఢిల్లీ నుంచి అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, కేంద్ర పాలిత ప్రాంతాల అడ్మినిస్ట్రేటర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. రాజీవ్ గౌబ మాట్లాడుతూ వచ్చే జనవరి 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు మూడు రోజుల పాటు ద్వితీయ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల సమావేశాన్ని నిర్వహించేందుకు ప్రతిపాదించినట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఆయా ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలతో పాటు పలు వినూత్న పథకాలు, కార్యక్రమాలను పరస్పరం తెలుసుకునేందుకు ఈ సమావేశం ఎంతో దోహదం చేస్తుందని రాజీవ్ గౌబ పేర్కొన్నారు. వచ్చే చీఫ్ సెక్రటరీల సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను నీతి ఆయోగ్ నేతృత్వంలోని ఆర్గనైజింగ్ కమిటీ చూస్తుందని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.సమీర్ శర్మ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళల భద్రతకు సంబంధించి 'దిశ' పేరిట ప్రత్యేక యాప్‌ను రూపొందించారని, దానిని రానున్న సమావేశాల్లో షోకేస్ చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, అజయ్ జైన్, ముఖ్య కార్యదర్శులు ఎం.టి.కృష్ణబాబు, ఎం.రవిచంద్ర, అనిల్ కుమార్ సింఘాల్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



తప్పిపోయివున్న నిన్ను ఆయన కనుక్కున్నాడు.
నీకు మార్గదర్శకత్వం వహించాడు.
- ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, అక్టోబర్, 28

ఇదేనా రాజ్యాంగ స్ఫూర్తి?

కథ కొత్త మలుపులు తిరిగినట్టే, కేరళ ప్రభుత్వానికీ, ఆ రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌కూ మధ్య వరుస వివాదాల్లో కొత్త అంకం వచ్చి చేరింది. కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్. బాలగోపాల్‌పై తాను విశ్వాసాన్ని కోల్పోయాననీ, ఆయనపై చర్య తీసుకోవాలనీ ముఖ్యమంత్రిని గవర్నర్ కోరడం దిగ్భ్రాంతికరం. నిన్న గాక మొన్న 11 యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లపై కినిసిన మహాప్రభువులకు ఇప్పుడు మంత్రి గారిపై విరక్తి కలిగింది. దానికి ఆయన కారణాలు ఆయనకున్నాయి. దేశ సమైక్యతకు భంగం కలిగేలా మంత్రి మాట్లాడారనీ, పదవీ ప్రమాణాన్ని ఉల్లంఘించారనీ, కడకు గవర్నర్‌గా తన విశ్వాసాన్ని మంత్రి కోల్పోయారనీ... ఆరిఫ్ ఆరోపణ. అధికార ఎల్డీఎఫ్ సర్కార్ సారథి పినరయ్ విజయన్ మాత్రం సదరు మంత్రిపై తనకు పూర్తి విశ్వాసం ఉందంటూ, గవర్నర్ డిమాండ్‌ను తోసిపుచ్చాల్సి వచ్చింది. గవర్నర్ చర్యను తప్పుబడుతూ అధికార, ప్రతిపక్షాలు ఒకే స్వరం వినిపిస్తున్నాయంటే ఆరిఫ్ గీత దాటేశారని అర్థమవుతోంది. అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వాలకూ, రాజ్‌భవన్‌కూ పెరుగుతున్న దూరంపై అర్థవంతమైన చర్చ అవసరమని గుర్తుచేస్తోంది.

కేరళలో తలుచుకుంటే మంత్రులను సైతం ఇంటికి పంపే అధికారం తనకు ఉందని కొద్దివారాల క్రితం రాష్ట్రపెద్ద హూంకరించారు. ఆ వివాదం సద్దుమణగక ముందే సుప్రీమ్ కోర్ట్ ఓ నియామకంలో ఇచ్చిన ఉత్తర్వును సాకుగా తీసుకొని, 11 విశ్వవిద్యాలయాల వీసీల నియామక ప్రక్రియను తప్పు పడుతూ, తప్పుకోవాల్సిందిగా ఆదేశించారు. అదీ అవాంఛనీయంగా ట్విట్టర్‌లో చెప్పారు. హైకోర్ట్ జోక్యంతో ఆ కథలో కొత్త దృశ్యం నవంబర్ మొదటి వారానికి వాయిదా పడిందో లేదో, ఓ విశ్వ విద్యాలయంలో ఆర్థిక మంత్రి ప్రసంగాన్ని తప్పుబడుతూ ఆరిఫ్ కొరడా తీశారు. అన్ని ప్రాంతాల వారినీ కలుపుకొనిపోతూ కేరళ విశ్వవిద్యాలయాలు ప్రజాస్వామ్యబద్ధంగా నడుస్తున్నాయని మంత్రి గత వారం అన్నారు. విద్యార్థి నేతగా యూపీలోని విశ్వవిద్యాలయంలో చూసిన కాల్పుల ఘటనల్ని ప్రస్తావించారు. అది ఆరిఫ్‌కు సుతరామూ నచ్చినట్టు లేదు. దాంతో పరోక్షంగా పదవీచ్యుతుణ్ణి చేయమనే ప్రతిపాదన తెచ్చారనుకోవాలి. వరస చూస్తే- కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నియుక్తులైన గవర్నర్, కేరళలో ప్రజలెన్నుకున్న వామపక్ష ప్రభుత్వంపై పగబట్టినట్టు వ్యవహరిస్తున్నారనిపిస్తుంది.

అలాగని కొన్నిసార్లు ప్రజాప్రభుత్వాలు గవర్నర్ గౌరవాన్ని మరీ తేలికగా తీసుకున్న ఘటనలూ లేవనీ అనలేం. వీసీల నియామకంలో గవర్నర్ అధికారాలకు కత్తెర వేస్తూ వివాదాస్పద విద్యాబిల్లు తెచ్చినప్పటి నుంచి కేరళ సర్కార్‌కూ, ఆరిఫ్‌కూ మధ్య అగాధం ఏర్పడినట్టుంది. నిజానికి వీసీలు సహా వివిధ నియామకాల్లో లాంఛనపూర్వక పాత్ర పోషించాల్సిన గవర్నర్లు లక్ష్మణరేఖ దాటుతున్నారనే ఆరోపణ తరచూ వింటున్నాం. గవర్నర్ పాత్రను మరింత పరిమితం చేసేందుకు ఆ మధ్య తమిళనాడు సహా ఇతర రాష్ట్రాల్లోనూ ప్రయత్నాలు సాగడం గమనార్హం. రాజ్యాంగబద్ధమైన ఉన్నత నియామక పదవుల్లో ఉన్నవారు రాజకీయాలకు అతీతంగా ఉండాలి. కనీసం ఉన్నట్టయినా కనిపించాలి. అలాంటిది... కూర్చున్న కుర్చీని మర్చిపోయి, ఆ పదవికి కారణమైనవారి పట్ల మునుపటి ప్రభుభక్తిని ప్రదర్శించాలనుకుంటేనే సమస్య. గవర్నర్ పదవిలో రాజ్యాంగం ద్వారా సంక్రమించిన అధికారాలను మించి వ్యక్తిగత అజెండాకు తగ్గట్టు ప్రవర్తిద్దామనీ, ఆభిజాత్యం ప్రదర్శిద్దామనీ అనుకుంటే పదే పదే అగ్గి రాజుకుంటుంది. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఢిల్లీ, పుదుచ్చేరి, తెలంగాణ రాష్ట్రాలు సహా ఇప్పుడు కేరళలోనూ జరుగుతోంది అదే.

ఒకప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ సారథ్య ప్రభుత్వాలున్నప్పుడు పలు రాష్ట్రాల గవర్నర్లు ఇలాగే నాటి ప్రధానమంత్రుల చిత్తానుసారం వ్యవహరించేవారనే విమర్శలున్నాయి. అప్పట్లో వివిధ సందర్భాల్లో పలు రాష్ట్ర ప్రభుత్వాల రద్దు, ఆర్టికల్ 356 కింద రాష్ట్రపతి పాలన విధింపు ఇలాంటి ప్రభుభక్తి పరాయణత పర్యవసానమే. తెలుగునాట ప్రజాబలంతో గద్దెనెక్కిన ఎన్టీఆర్‌ను గవర్నర్ రామ్‌లాల్ పక్కకు తప్పించడం, ప్రజా ఉద్యమంతో ఎన్టీఆర్ తిరిగి పగ్గాలు చేపట్టడం, రామ్‌లాల్ కథ కంచికి చేరడం లాంటివన్నీ చరిత్రలో మర్చిపోలేని పాఠాలు. తమిళనాట గవర్నర్ చెన్నారెడ్డి వర్సెస్ సీఎం జయలలిత లాంటి కథలూ చూశాం. తాజాగా వివిధ ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో గవర్నర్లు కయ్యానికి కాలు దువ్వుతున్న తీరు అంతకన్నా ఒక మెట్టు పైనే ఉంది. పైకి ఇది సీఎంలకూ, గవర్నర్లకూ మధ్య కయ్యంగా కనిపించినా, అంతకన్నా లోతైన రాజకీయమే ఉంది. కేంద్ర పెద్దల ఆదేశంతో వీరిలా చేస్తున్నారో లేదో కానీ, అండ లేకుండానే ఈ దుస్సాహసాలకు దిగుతారనుకోలేం.

రాష్ట్రం చేసే చట్టాలు, నియామకాలపై అభ్యంతరాలుంటే పునఃపరిశీలన కోరే అధికారం రాజ్యాంగం గవర్నర్లకిచ్చింది. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా అంతకు మించి ఆ విచక్షణాధికారాల్ని ఉపయోగించే ప్రయత్నాలతోనే తంటా. అందుకే, కొందరు గవర్నర్ల తీరు మొత్తం ఆ వ్యవస్థకే అప్రతిష్ఠ తెస్తోంది. సమాఖ్య వ్యవస్థలో ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలనూ, వాటి నిర్ణయాలనూ పరిహాసం చేస్తున్న గవర్నర్ వ్యవస్థపై చర్చను ప్రేరేపిస్తోంది. ఇటు ప్రజాతీర్పుతో గద్దెనెక్కినవారు, అటు రాజ్యాంగ పదవిలో ఉన్నవారు తమ హక్కులు, బాధ్యతల్ని గుర్తెరిగి ప్రవర్తిస్తే వ్యవహారం ఇంత దూరం రాదు. మరీ ముఖ్యంగా, ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారి నుంచి ఆ హుందాతనం మరింతగా ఆశిస్తాం. ఆ సంగతి ఆరిఫ్ లాంటి వారికి పదే పదే గుర్తుచేయాల్సి రావడమే విచారకరం. నిలువునా చీలిన నేటి రాజకీయ వాతావరణంలో ఈ పరిస్థితి మారుతుందా అన్నది అనుమానమే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తీక మాసం, **తిథి:** శు.తదియ ప.12.23 వరకు, తదుపరి చవితి **నక్షత్రం:** అనూరాధ ప.1.18 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** సా.6.34 నుండి 8.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.04 వరకు తదుపరి ప.12.07 నుండి 12.53 వరకు **అమృతఘడియలు:** రా.3.40 నుండి 5.10 వరకు.

సూర్యోదయం : 6.00
సూర్యాస్తమయం: 5.28
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు



సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అలా మారామా?



కరెన్సీ నోట్ల మీద దేవీ దేవతల ఫొటోలను ముద్రిస్తే మనం ఓట్లు వేస్తామని వారు అనుకుంటున్నారంటే- తప్పు వాళ్లది కాదు, మనది. - శ్రుతీ చతుర్వేది, జర్నలిస్ట్

సమానత్వానికి జై



పురుషులు, మహిళలకు చెల్లింపుల్లో సమానత్వం ప్రకటించడం... ఇండియాలో మహిళా క్రికెట్‌కు నిజంగా ఇది శుభదినం. థాంక్యూ బీసీసీఐ అండ్ జై షా. - హర్మన్‌ప్రీత్ కౌర్, మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్

పుట్టుక మాత్రమే స్పెషల్



ఇండియా 'బిలియన్త్ (నూరు కోట్లవ) బేబీ' ఆస్థా అరోరా పుట్టిన కొద్దిరోజులకు మే 2000 సంవత్సరంలో వెళ్లి చూశాను. ఈ 'స్పెషల్ బేబీ' ఎలావుందో, ఏం చేస్తుందోనని మళ్లీ రెండు దశాబ్దాల తర్వాత ఢిల్లీలోని ఆమె ఇంటికి వెళ్లి కలిశాను.(కుటుంబ పరిస్థితుల వల్ల ఈమధ్యే ఆస్థా నర్సుగా ఉద్యోగంలో చేరింది.) - గీతా పాండే, బీబీసీ జర్నలిస్ట్

పేలవమైన వాదన



'పాకిస్తాన్‌కు వెళ్లిపోండి' అనడానికి మించని వాదన చేసే ఐఐటీ, ఐఐఎంలు నాకు ఎంతోమంది తెలుసు. డిగ్రీలు ద్వేషాన్ని తగ్గించలేవు, చదువు ఆ పని చేస్తుంది. - రాఖీ త్రిపాఠి, అసోసియేట్ ప్రొఫెసర్

వివక్షకు చెల్లు



లింగ వివక్షను ఎదుర్కోవడానికి బీసీసీఐ తన మొదటి అడుగు వేస్తున్నదని ప్రకటించడానికి సంతోషిస్తున్నాను. బీసీసీఐ కాంట్రాక్టు మహిళా క్రికెటర్లకు సమాన చెల్లింపు విధానాన్ని అమలుచేస్తున్నాం. ఇండియన్ క్రికెట్‌లో లింగ సమానత్వంతో కూడిన కొత్త తరంలోకి ప్రవేశించేలా ఇకనుంచీ పురుషులు, మహిళలకు మ్యాచ్ ఫీజు సమంగా ఉంటుంది. - జై షా, బీసీసీఐ గౌరవ కార్యదర్శి

నేరుగా మాట్లాడుకుంటారా?



అమెరికాకు మయన్మార్, పాకిస్తాన్ దేశాలలో రాయబారులున్నారు. అలాగే నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో కూడా ఉన్నారు. కానీ న్యూఢిల్లీలో మాత్రం లేరు. ఎప్పుడైతే మీరు సన్నిహిత మిత్రులో, రాయబారులను నియమించడం గురించిన పట్టింపు ఎందుకనేమో! - హేపీమాన్ జాకబ్, ప్రొఫెసర్

విశాఖపై విద్వేషాల కబ్జా

అసలు వైజాగ్‌లో కబ్జాలకు ఆదిగురువు 'ఈనాడు' రామోజీరావే
లీజుకు తీసుకున్న స్థలం తిరిగి ఇవ్వకుండా... కేసులతో కాలయాపన
ఏకంగా 42.5 ఎకరాలను దశాబ్దాల పాటు కబ్జా చేసిన గీతం మూర్తి
ఆలయాన్ని, ఆలయ స్థలాన్ని కబ్జా చేసిన పల్లా సోదరుడు
అయ్యన్న, బండారు కుటుంబీకుల అక్రమాలకు అంతేలేదు
వీళ్లలో ఒక్కరికి కూడా వ్యతిరేకంగా అక్షరం ముక్క రాయని 'ఈనాడు'
ఇపుడు అదేపనిగా కబ్జాలంటూ ప్రతిరోజూ విషపు రాతలు



రామోజీరావుకు విశాఖపట్నమంటే ప్రేమో, ద్వేషమో, మరేదో తెలియని భావసంభోగం ఉన్నదనే చెప్పాలి. ఎందుకంటే అక్కడే ఆయన 47 ఏళ్ల కిందట అక్షర ఫ్యాక్షనిజానికి అంకురార్పణ చేశారు. లీజు పేరిట స్థలాలు తీసుకుని న్యాయ పోరాటాలతో కాజేయటమనే టక్కు టమారానికీ ఇక్కడే శ్రీకారం చుట్టారు. ఇతరుల స్థలాలను కబ్జా చేయటానికి ఎన్ని 420 పనులైనా చేయొచ్చునని... ఎన్ని ఫోర్జరీలైనా చేయొచ్చునని ఇక్కడి నుంచే నిరూపించబోయారు. అందుకే ఆయనది విశాఖతో విడదీయలేని బంధం.

కాకుంటే న్యాయం గెలుపు ఆలస్యం కావచ్చేమో గానీ... గెలవటం మాత్రం పక్కా అనేది రామోజీ సైతం నమ్మక తప్పలేదు. లీజు పోరాటం ఒక్కో న్యాయస్థానాన్నీ దాటుకుంటూ సుప్రీంకోర్టుకు కూడా చేరాక తల వంచారు. లీజు ముగిసిన ఏడేళ్ల తరవాత స్థలాన్ని అప్పగించాల్సి వచ్చింది కూడా. ఇప్పుడు ఇదంతా ఎందుకంటే... కొద్దిరోజులుగా ఆయన విశాఖపై ప్రేమ ముసుగులో విద్వేషం కక్కుతున్నారు. ప్రభుత్వంపై విషం చిమ్మటానికి ప్రతిరోజూ విశాఖలో భూ కబ్జాలంటూ అడ్డగోలు రాతలు రాస్తున్నారు. దానికి సాక్ష్యంగా ఊరూపేరూ లేని వ్యక్తులను తెరపైకి తీసుకొచ్చి... ఉత్తరాంధ్రకు, విశాఖకు, రాష్ట్రానికి పరిరక్షణ సమితుల పేర్లతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై, నాయకులపై పక్కా స్కెచ్ ప్రకారం నానా అభాండాలూ వేస్తున్నారు. ప్రతిరోజూ చెబితే అవి ఎంత పచ్చి అబద్ధాలైనా జనాన్ని నమ్మించవచ్చనేది 'ఈనాడు' పుట్టిన దగ్గర్నుంచీ రామోజీరావు అనుసరిస్తున్న వ్యూహం. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉత్తరాంధ్ర బాగుపడకూడదన్న దురుద్దేశంతో... ఇపుడదే వ్యూహాన్ని విశాఖ విషయంలో అమలు చేస్తున్నారు. అసలు విశాఖలో భూ కబ్జాలు చేసిందెవరు? ఆ భూముల్ని కబ్జా దారుల నుంచి కాపాడిందెవరు? భూములకు సంబంధించి రామోజీ చేస్తున్న రచ్చలో నిజమెంత? ఒకసారి చూద్దాం...

ఏది నిజం?

'గ'లీజు' పనులకు రామోజీ అంకురార్పణ

రామోజీరావు తన కబ్జాలు, కుట్రలు మొదలుపెట్టింది ఇక్కడేనని చెప్పాలి. ఎందుకంటే 'ఈనాడు' అక్షర వ్యాపారాన్ని ఆరంభించింది విశాఖ సీతమ్మ ధారలోనే!. ఇక్కడి సర్వే నెంబరు 50/4లో 2.78 ఎకరాల భూమిని రామోజీ 1974 మార్చి 30న స్థల యజమాని మంతెన ఆదిత్య వర్మ నుంచి 33 సంవత్సరాల లీజుకు తీసుకున్నారు. మొదటి 14 ఏళ్లూ నెలకు చెల్లించే అద్దె రూ.2,500. తరవాత నెలకు రూ.3వేలు. లీజు గడువు ముగిశాక భూమిని తిరిగి అప్పగించి వెళ్లిపోవాలి. కానీ వెళ్లిపోతే రామోజీ గొప్పేముంది? లీజు స్థలాన్ని కాజేయాలనే దుర్బుద్ధి 1989లోనే పుట్టింది రామోజీకి. అక్కడ రోడ్డు వెడల్పు చేయడానికి 618 గజాలను ప్రభుత్వం తీసుకుంది. ప్రతిఫలంగా సీతమ్మధార లోనే సర్వే నెంబర్ 52లో 872 గజాల స్థలాన్ని కేటాయించారు. మరి ఆ భూమి ఆదిత్య వర్మది కదా? దాన్ని రామోజీ తీసుకున్నది లీజుకు కదా? ప్రభుత్వానికిచ్చే అధికారం ఎవరిది? ప్రభుత్వం పరిహారంగా ఇచ్చే భూమిని తీసుకోవాల్సింది ఎవరు? వీటన్నిటికీ మనం చెప్పే జవాబులు తప్పని నిరూపించారు రామోజీ. ఆదిత్య వర్మకు విషయం చెప్పకుండా... ప్రభుత్వానికి భూములిచ్చి, పరిహారంగా ఇచ్చిన భూమిని తన కుమారుడి పేరిట రిజిస్ట్రేషన్ చేయించేసుకున్నారు. అలా... విశాఖలో మోసాలు మొదలెట్టారు!!. రామోజీ మోసాన్ని ఆలస్యంగా గుర్తించారు ఆదిత్య వర్మ. 2007 సెప్టెంబరు 19న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ రామోజీరావు 'ఈనాడు'కు చీఫ్ ఎడిటర్ మరి. పోలీసులను అంత తేలిగ్గా విచారణ చేయనిస్తారా? తన మనుషుల ద్వారా ఒత్తిడి తెచ్చారు. పోలీసులు ఊరుకున్నారు. దీంతో ఆదిత్య వర్మ న్యాయపోరాటం మొదలెట్టారు. చివరకు న్యాయమూర్తి స్పందించి... పోలీసులకు అక్షింతలు వేయటంతో విచారణ మొదలైంది.

కోర్టులో మరో డ్రామా!!

ఈ 420 కేసు కోర్టులో విచారణకు వచ్చాక రామోజీ మరో కుట్రకు తెరలేపారు. రోడ్డు కోసం తాను ప్రభుత్వానికి స్థలమివ్వటం, ప్రతిగా ప్రభుత్వం స్థలాన్ని తన కుమారుడి పేరిట ఇవ్వటం వంటివేవీ తనకు తెలియవంటూ... తాను స్థలం ఇవ్వకముందే అక్కడ రోడ్డు ఉందని వాదించారు. అలాంటపుడు తాను స్థలమెందుకు ఇస్తానని ఎదురు తిరిగారు. దీనికోసం ఏకంగా విశాఖ జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌నే ఫోర్జరీ చేసేశారన్నది అప్పట్లో పిటిషనర్ ఆరోపణ. ఫోర్జరీ మ్యాప్‌లను వారు కోర్టుకు కూడా సమర్పించారు. దీంతో రామోజీపై ఫోర్జరీ, కుట్ర కేసులు కూడా నమోదయ్యాయి.

లీజు ముగిసినా ఖాళీ చేయకుండా..

నిజానికి లీజు గడువు 2007తో ముగిసింది. కానీ రామోజీ ఆ స్థలాన్ని ఖాళీ చేయలేదు. అప్పటిదాకా నెలకు ఇస్తున్న రూ.3వేలును రూ.10వేలు చేస్తానని, మరో 33 ఏళ్ల లీజు పొడిగించాలని కోరారు. అప్పటికే అక్కడ స్థలం విలువ దాదాపు రూ.40 కోట్లు ఉండటంతో... కుదరదన్నారు యజమాని వర్మ. కానీ రామోజీ కోర్టుకెళ్లారు. మేజిస్ట్రేటు కోర్టు నుంచి సుప్రీం కోర్టు దాకా 2014 వరకూ లాగారు. అద్దె కూడా పెంచలేదు. లీజు గడువు ముగిసిన 2007 నుంచీ నెలకు రూ. 3వేల చొప్పున కూడా సక్రమంగా చెల్లించలేదు. దీనిపై స్థల యజమాని రెంట్ కంట్రోల్ కోర్టుకు వెళ్లటంతో... రామోజీ స్టే తెచ్చారు. ఈ స్టేతో చాన్నాళ్లు నెట్టుకొచ్చారు. దీన్ని హైకోర్టులో వర్మ సవాలు చేయగా... రామోజీకి ఎదురుదెబ్బ తగిలింది. దిగువ కోర్టు ఇచ్చిన స్టేను కొనసాగించాలంటే.. తుది తీర్పు వెలువడేదాకా అప్పటి విలువల ప్రకారం నెలకు రూ.17 లక్షల చొప్పున ఈనాడు కార్యాలయానికి అద్దె చెల్లించాలని , అది కూడా ప్రతి నెలా 10వ తేదీలోపు చెల్లించాలని, అప్పటిదాకా బకాయిలుగా ఉన్న అద్దె రూ.2.57 కోట్లను తక్షణం ఇచ్చేయాలని హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. రామోజీ సుప్రీంకు వెళ్లారు. అక్కడా చుక్కెదురు కావటంతో అద్దె చెల్లించాల్సి వచ్చింది. తరవాత చెల్లించటం ఇష్టం లేక స్థలాన్ని ఖాళీ చేశారు. అన్ని వ్యూహాలూ విఫలమవటంతో.. నాలుగేళ్ల తరవాత స్థల యజమానితో రాజీపడి కుట్ర, మోసం, ఫోర్జరీ కేసులనుంచి బయటపడ్డారు. ఇదీ... ఈ నీతుల కొండ బాగోతం. తెల్లారి లేస్తే పేపర్లో అందరికీ సుద్దులు చెప్పే ఈ అనకొండ బాగోతాల్లో ఇది కేవలం విశాఖ పార్ట్ మాత్రమే. హైదరాబాద్‌లో సాగించిన అరాచకాలు గానీ, విజయవాడలో బంధువుల్ని మోసం చేసిన తీరుగానీ, రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో జరిపిన అక్రమాలు గానీ రాస్తే.. ఎన్ని పార్ట్‌లైనా సరిపోవేమో!!

తెలుగుదేశం కబ్జాల అడ్డా... విశాఖ

విచిత్రమేంటంటే కబ్జాలకు కేరాఫ్‌గా మారిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు పనిగట్టుకుని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తుండటం. వాటికి బాకా ఊదుతూ... అవన్నీ నిజమనేట్లుగా రామోజీరావు దరువేయటం. అందరూ కలిసి విశాఖ ప్రజలకు ఓ ఎల్లో చిత్రాన్ని చూపిస్తుండటం!!. నిజానికి అందినకాడికల్లా తెలుగుదేశం నేతలు కబ్జాలు చేస్తే... సిట్‌ల పేరిట కాలయాపన చేస్తూ... చర్యలకు మాత్రం దూరంగా ఉంటే... గడిచిన మూడేళ్లలో ఏకంగా 430 ఎకరాల భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నది ఈ ప్రభుత్వమేనన్న విషయం 'ఈనాడు' ఎప్పుడూ చెప్పదు. ఎందుకంటే ఈ కబ్జాదారుల్లో తెలుగుదేశం మాజీ ఎంపీ, చంద్రబాబు బంధువైన ఎంవీవీఎస్ మూర్తి సహా టీడీపీ మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోదరుడు, అయ్యన్న, బండారుల పుత్రరత్నాలు... ఇలా చాలా మందే ఉన్నారు. వీళ్లని వెనకేసుకు రావటమే తమ బాధ్యతగా భావించే చంద్రబాబు మీడియా మిత్రులెవరూ వీటి విలువ దాదాపు రూ.5వేల కోట్లకుపైనే ఉంటుందని గానీ, ఇంతటి విలువైన భూముల్ని ప్రభుత్వం కాపాడిందని గానీ చెప్పరు. ఆఖరికి దసపల్లా భూముల్లో పాగా వేసి తెలుగుదేశం పార్టీ కార్యాలయం కట్టేసుకున్న చంద్రబాబునూ మహాత్ముడిగానే చెబుతుంటుంది 'ఈనాడు'. అదీ కథ.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక విశాఖ జిల్లాలో కబ్జాకోరుల నుంచి తిరిగి స్వాధీనం చేసుకున్న భూములు ఎకరాల్లో..

మండలం	ఎన్ని ప్రాంతాలు	ఆక్రమణల విస్తీర్ణం	రిజిస్ట్రేషన్ విలువ (రూ.లలో)
అనకాపల్లి	07	2.3850	50,34,500
ఆనందపురం	25	104.35	105,35,31,060
అచ్యుతాపురం	02	0.28	5,83,000
భీమునిపట్నం	47	58.73	137,13,99,300
గాజువాక	70	50.5661	274,05,35,800
గోపాలపట్నం	01	0.0150	43,56,000
కశింకోట	02	0.25	4,30,000
నర్సీపట్నం	01	1.56	32,76,000
పద్మనాభం	12	11.55	36,25,00,000
పరవాడ	16	32.30	48,38,16,080
పెదగంట్యాడ	17	0.402	2,50,80,880
పెందుర్తి	08	16.12	4,60,72,000
రాంబిల్లి	11	8.02	1,40,57,000
సబ్బవరం	22	28.86	7,80,20,000
సీతమ్మధార	01	0.0723	1,92,50,000
విశాఖ రూరల్	23	114.2765	2016,97,78,380
యలమంచిలి	05	1.08	27,00,000
మొత్తం	270	430.8169	2638,04,20,000

లేటరైట్ మాఫియా కేరాఫ్ అయ్యన్న?

నోటికొచ్చినట్లు తూలటం, తూగటంలో అయ్యన్నపాత్రుడిని మించిన తెలుగుదేశం నాయకుడు లేడనే చెప్పాలి. విశాఖలో లేటరైట్ తవ్వకాలకు సంబంధించి ఆయన కుటుంబంపై వచ్చిన ఆరోపణలు అన్నీ ఇన్నీ కావు. ఎందుకంటే విశాఖ మన్యంలో బాక్సైట్ తరవాత అత్యంత విలువైనది లేటరైటే. నాతవరం మండలంలోని పలు గ్రామాల్లో వేల హెక్టార్లలో లేటరైట్ నిక్షేపాలున్నాయి. కాకపోతే వీటిని తవ్వే హక్కు గిరిజనులకే ఉండటంతో 2009 జులైలో సింగం భవాని అసనగిరిలో 5 హెక్టార్లకు, సుందరకోటలో 35.5 హెక్టార్లకు తవ్వకం అనుమతులు పొందారు. బమిడి కలొద్దిలో 110 హెక్టార్లకు జర్తా లక్ష్మణ్‌రావు అనుమతి పొందారు. 5 హెక్టార్లు మించితే పర్యావరణ అనుమతులు తప్పనిసరి కావటం... వీటికి అనుమతులు రాకపోవటంతో వారు తవ్వకాలు చేపట్టలేకపోయారు. కానీ తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక అయ్యన్న కుటుంబీకుల కన్ను లేటరైట్ గనులపై పడింది. తొలుత అధికారాన్ని ఉపయోగించి సింగం భవానీకి చెందిన 5 హెక్టార్లను చెరబట్టారు. వేరొక ఎంపీ కుమారుడితో కలిపి తవ్వకాలు చేపట్టి ... 11 నెలల వ్యవధిలో రూ.20 కోట్లకుపైగా విలువైన ఖనిజాన్ని స్వాహా చేశారు. ఆ తరవాత 110 హెక్టార్లపై కన్నేశారు. లక్ష్మణ్‌రావును, అతని దగ్గర సబ్‌లీజుకు తీసుకున్న వారిని తొలుత 80 శాతం వాటా అడిగి... ఇవ్వనన్నటంతో కేసులు పెట్టి వేధింపులకు దిగారు. సహకరించని సర్పంచ్‌ను సైతం చెక్‌పవర్ రద్దుచేసి మరీ వేధించారు. చివరకు అక్కడ తవ్వకాలు జరపకుండా కలెక్టర్ ద్వారా నిషేధం ఉత్తర్వులు కూడా జారీ చేయించారు. ఆ ప్రాంతం మొత్తానికి నిషేధం ఉత్తర్వులు వర్తించినా.. తన చేతుల్లో ఉన్న 5 హెక్టార్లను మాత్రం ఆయన గారి పుత్రరత్నం అడ్డూఅదుపూ లేకుండా తవ్వేశాడు.

'గీత'ం దాటి కబ్జాలు

టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి రుషికొండ ప్రాంతంలో ఏకంగా 42.51 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు. బీచ్‌ను ఆనుకుని ఉండే అత్యంత విలువైన ఈ స్థలం... గీతం యూనివర్సిటీకి సమీపంలోనే ఉంది. దీన్ని ఆక్రమించుకుని రెండెకరాల్లో కళాశాల భవన నిర్మాణాలు కూడా చేపట్టారు. మిగిలిన స్థలానికి కాంపౌండ్ వాల్ కట్టేశారు. సుమారు రూ.500 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని దశాబ్దాల పాటు కబ్జా చేసినా... మనోడే కదా అని టీడీపీ సర్కారు పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఈ కబ్జాలపై దృష్టిపెట్టింది. ప్రహరీని తొలగించి కబ్జాలో ఉన్న 40.51 ఎకరాలను స్వాధీనం చేసుకుంది. అప్పట్లో నానా యాగీ చేయబోయిన పచ్చ బ్యాచ్... ప్రభుత్వం స్థిరంగా నిలబడటంతో తోక ముడుచుకుంది.

పల్లా సోదరుడి భూ ఫలహారం..

అధికారులు స్వాధీనం చేసుకున్న భూముల్లో సింహభాగం టీడీపీ నేతల కబంధ హస్తాల్లో ఉన్నవే. గయాలు, పోరంబోకు, గోర్జి, కొండ పోరంబోకు, వాగులు, కాలువలు, గెడ్డలు, రాస్తాలు, గుట్టలు, ఇనాం, జిరాయితీ, గ్రామకంఠాలు, చెరువులు.. ఇలా కాదేదీ కబ్జాకు అనర్హం అన్నట్లుగా కాజేశారు. కొద్దిరోజుల క్రితం గాజువాక నియోజకవర్గం తుంగ్లాం గ్రామ సర్వే నంబరు 33-2లో గుడితో పాటు ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమించేందుకు టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోదరుడు పల్లా శంకర్రావు ప్రయత్నించాడు. అడ్డువచ్చిన స్థానిక యువతపై దాడికి యత్నించాడు. ప్రభుత్వ జోక్యంతో వెనక్కి తగ్గాడు.

బినామీ పేర్లతో.. లెక్కేలేదు

ఇవన్నీ ఒకెత్తయితే టీడీపీ అధికారంలో ఉన్నపుడు ఆ పార్టీ నేతలు బినామీ పేర్లతో చేసిన కబ్జాలకు లెక్కేలేదు. దీంతో వైసీపీ ప్రభుత్వం గడిచిన మూడేళ్లుగా విశాఖ, దాని చుట్టుపక్కల మండలాల్లో ఆక్రమణలకు గురైన విలువైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు చర్యలు తీసుకుంటూ వస్తోంది. ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యేక దర్యాప్తు బృందాలు క్షేత్రస్థాయి పరిశీలనతో భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాయి. ఫలితంగా మొత్తం 270 ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైన 430.81 ఎకరాల ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ ధరల ప్రకారం వీటి రిజిస్ట్రేషన్ విలువ రూ.2,638 కోట్లు కాగా మార్కెట్ విలువ రూ.5 వేల కోట్లకుపైనే ఉంటుందని అంచనా. ఆక్రమణలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులూ నమోదు చేస్తున్నారు.

'బండార'ం బయటపడి... పరాజయం

- పెందుర్తి మండలం గుర్రమ్మపాలెంలో గతంలో ఏపీఐఐసీ 110 ఎకరాలు సేకరించి... ఎకరాకు రూ. 23 లక్షల చొప్పున రైతులకు నష్ట పరిహారం చెల్లించింది. అక్కడే బండారు చక్రం తిప్పాడు. ప్రభుత్వానికి చెందిన 20 ఎకరాలకు బినామీలను సృష్టించి... ఆ పరిహారాన్ని తన ఖాతాలో వేసుకున్నాడని అప్పట్లోనే ఆరోపణలొచ్చాయి. అక్కడితో ఆగకుండా... భూమికి పరిహారం పొందిన ప్రతి రైతు నుంచీ ఎకరాకు రూ.5 లక్షల చొప్పున తనకు కట్టాల్సిన పరిహారంగా నిర్ణయించి మరీ లాక్కున్నాడని అప్పట్లో రైతులు బహిరంగంగానే వాపోయారు. కాకపోతే ఇలా ఎన్ని కోట్లు మింగేసినా... అధికారంలో ఉన్నది మిత్రపక్ష తెలుగుదేశం కాబట్టి రామోజీకి ఇలాంటివేవీ కనిపించలేదు.
- ఆ మధ్య దుమారం రేపిన పెందుర్తి మండలం లక్ష్మీపురం భూ వివాదంలోనూ బండారు తనయుడిదే కీలకపాత్ర. అసలు వారసులకు- నకిలీలకు తగవు పెట్టింది అప్పలనాయుడైతే, ఈ వివాదాన్ని సెటిల్ చేసేందుకు ఈయన భారీగా రూ.10 కోట్ల వరకూ డిమాండ్ చేశాడని, తాము ఇవ్వనందుకు కేసులతో వేధిస్తున్నారని వారసులు అప్పట్లో వాపోయారు కూడా.
- ఇక వేపగుంట, పెందుర్తి ప్రాంతంలో బీఆర్‌టీఎస్ రహదారిలో భవనాలు కోల్పోయిన వారికి టీడీఆర్ రూపంలో నష్టపరిహారం చెల్లించారు. ఇందులో దాదాపు 300 టీడీఆర్‌లు ఇప్పించినందుకు ఈ పుత్ర రత్నం దాదాపు 5 కోట్లు కొట్టేశారన్నది అప్పట్లో బహిరంగంగానే వినవచ్చింది
- ఇవన్నీ ఈ పుత్రరత్నం భూములకు సంబంధించిన దందాలు. ఇక ఉద్యోగాలిప్పిస్తామంటూ వసూళ్లు, వ్యక్తిగత సెటిల్‌మెంట్లు వంటివన్నీ లెక్కలోకి తీసుకుంటే ఎన్ని పేజీలైనా చాలవు మరి.

విశాఖకు త్వరలోనే పరిపాలన రాజధాని

వైఎస్సార్‌సీపీ నేత, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



మన విశాఖ–మన రాజధాని వాహనాన్ని ప్రారంభిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

డాబా గార్డెన్స్(విశాఖ దక్షిణ): త్వరలోనే విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటు కానుందని ఉమ్మడి విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. వికేంద్రీకరణపై చైతన్యం కలిగించేందుకు జేఏసీ రూపొందించిన ప్రత్యేక వాహనాన్ని విశాఖలో ఆయన ప్రారంభించారు. అన్ని సమస్యలు పరిష్కారం కాగానే.. విశాఖ నుంచి పరిపాలన ప్రారంభమవుతుందన్నారు. ఈ ప్రాంత ప్రజలు రాజధానిని బలంగా కోరుకుంటున్నరనడానికి ఇటీవల విశాఖలో నిర్వహించిన గర్జన విజయవంతం కావడమే నిదర్శనమన్నారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జేఏసీ నాయకులు గంట్ల శ్రీనుబాబు, కాంతారావు, బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వీసీతో రక్షణశాఖ అధికారి భేటీ



హరిప్రసాద్‌ను సత్కరిస్తున్న వీసీ

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని కేంద్ర రక్షణ శాఖ విశ్రాంత సైనికోద్యోగుల సంక్షేమ విభాగం సంయుక్త కార్యదర్శి పూడి హరిప్రసాద్ సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. సైనికోద్యోగులు, మాజీ సైనికోద్యోగులకు ఏయూ అందిస్తున్న వివిధ కోర్సుల నిర్వహణ, ప్రగతిపై చర్చించారు. ఈ కోర్సులు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. నూతన కోర్సుల నిర్వహణపై వీసీకి ప్రతిపాదనలిచ్చారు. వీటిపై సానుకూలంగా స్పందించిన వీసీ.. సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. సైనికోద్యోగులకు సాధ్యమైనంత స్థాయిలో సహకరించడానికి వర్సిటీ సిద్ధంగా ఉందని చెప్పారు. ఏయూ–రక్షణ రంగ సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి రక్షణ రంగ ఉన్నతాధికారులతో సమావేశం కావడానికి త్వరలో ఢిల్లీకి రావాలని హరిప్రసాద్ వీసీని ఆహ్వానించారు.

లోన్ యాప్ నిర్వాహకుల అరెస్ట్

- 138 బ్యాంక్ అకౌంట్లలోని రూ.8 కోట్లు ఫ్రీజ్
- వివరాలు వెల్లడించిన విజయవాడ డీసీపీ విశాల్‌గున్ని



నిందితుల వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న డీసీపీ విశాల్ గున్నీ

విజయవాడ స్పోర్ట్స్: సామాన్య, మధ్య తరగతి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పలువురు లోన్ యాప్ నిర్వాహకులను ఎన్టీఆర్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని ముంబై, మధ్యప్రదేశ్‌లోని భోపాల్, కర్ణాటకలోని బెంగళూరు, ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్, రాజస్థాన్‌లోని జైపూర్ కేంద్రాలుగా సాగుతున్న ఈ దందా గుట్టును రట్టు చేశారు. రాష్ట్ర డీజీపీ కే రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాలతో ఏర్పడిన ఐదు పోలీస్ బృందాలు ఆయా రాష్ట్రాలకు వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకున్నాయి. వివరాలను డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) విశాల్‌గున్ని ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని కమాండ్ కంట్రోల్ రూంలో గురువారం వెల్లడించారు. లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు భరించలేక విజయవాడకు చెందిన లంక మణికంఠ (33) ఈ నెల 10వ తేదీన ఉరి వేసుకుని మరణించాడు. మృతుడు మణికంఠ 33 లోన్ యాప్స్‌నుంచి రూ.85,400 అప్పుగా తీసుకున్నాడు. దీనిలో రూ.42 వేలను వారం రోజుల వ్యవధిలోనే తిరిగి చెల్లించాడు. యాప్ నిర్వాహకుల వేధింపులు రోజు రోజుకీ తీవ్రమవడంతో తనువు చాలించాడు. ఈ కేసును తీవ్రంగా పరిగణలోకి తీసుకున్న పోలీసు ఉన్నతాధికారులు యాప్ నిర్వాహకులపై దృష్టి సారించారు. సెంట్రల్ డివిజన్ పరిధిలోని ఏసీపీ, సీఐలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి లోతైన విచారణ చేపట్టారు. ఒక్కో బృందం ఒక్కో ప్రాంతానికి వెళ్లి యాప్ నిర్వాహకుల కోసం వేట ఆరంభించారు. వానీష్ టెక్నాలజీ పేరుతో ముంబై నుంచి చైన్ లింక్ ద్వారా యాప్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న సోహైల్, లతీఫ్‌ను, గిపోసర్ టెక్నాలజీ పేరుతో బెంగళూరు నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న నవీన్, శంకరయ్యన్, భోపాల్ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న అనురాగ్‌సింగ్, మాల్విక్‌ను, జైపూర్ నుంచి అరుణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరికి సంబంధించి 138 బ్యాంక్ అకౌంట్లలో ఉన్న రూ.8 కోట్లను ఫ్రీజ్ చేశారు. గూగుల్ ప్లే స్టోర్ ద్వారా వీరు నిర్వహిస్తున్న లోన్ యాప్స్‌ను బ్యాన్ చేయాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాశారు. కేసు విచారణలో పలు విస్తు గొలిపే అంశాలు వెలుగులోకి వచ్చాయి. లోన్‌యాప్ నిర్వాహకులు గ్రూప్‌గా దేశంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నారు. పోలీసులకు దొరక్కుండా బినామీ బ్యాంక్ అకౌంట్లను వాడుతున్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వ్యక్తుల బ్యాంక్ అకౌంట్లను కొంతమంది మధ్యవర్తుల ద్వారా యాప్ నిర్వాహకులు సేకరిస్తున్నారు. మూడునాలుగు దశల్లో ఈ బ్యాంక్ ఖాతాలను వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. లోన్ మంజూరు, తిరిగి వసూలుకు ఆయా బ్యాంక్ అకౌంట్లనే వాడుతూ మోసాలకు పాల్పడుతున్నారు. పోలీసు విచారణలో దొరక్కుండా ఎంతో పకడ్బందీగా సాగుతున్న ఈ అక్రమ దందాను ఛేదించిన జిల్లా పోలీసులను డీసీపీ అభినందించారు.

రైలులో తరలిస్తున్న సిగరెట్లు పట్టివేత

- బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో సరుకు విడిచిపెట్టి వ్యక్తి పరారీ



సిగరెట్ల బాక్సులను పరిశీలిస్తున్న జీఎస్టీ అధికారులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రైలులో అక్రమంగా తరలిస్తున్న 16 బాక్సుల సిగరెట్లను విజయనగరం జిల్లా బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో జీఎస్టీ అధికారులు పట్టుకున్నారు. మూడు జిల్లాల జాయింట్ కమిషనర్ కె.రఘునాథరెడ్డి నేతృత్వంలో అధికారుల బృందం గురువారం వేకువ జామున రైల్వేస్టేషన్‌లో తనిఖీలు జరిపింది. భువనేశ్వర్–జునాగఢ్ ఎక్స్‌ప్రెస్‌లో 16 బాక్సుల సిగరెట్లను ఓగుర్తు తెలియని వ్యక్తి బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో దించారు. వాటిని బయటకు తరలించేందుకు ట్రాలీ బండిలో ఎక్కించాడు. విషయాన్ని గమనించిన జీఎస్టీ అధికారులు తనిఖీ చేశారు. అధికారులు తనిఖీ చేస్తుండగానే సిగరెట్లు తీసుకొచ్చిన వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. సిగరెట్ బాక్సులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

విశాఖ పోర్టులో అత్యాధునిక సదుపాయాలు

ఫ్యాప్సీ ఓపెన్ హౌస్ ట్రేడ్ మీట్‌లో వీపీఏ చైర్మన్ రామ్మోహనరావు



ఫ్యాప్సీ సంచికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, విశాఖపట్నం: విశాఖ పోర్టులో అత్యాధునిక సదుపాయాలు ఉన్నాయని.. ట్రేడర్లు, ఇన్వెస్టర్లు పోర్టు సేవలను సద్వినియోగం చేసుకోవాలని విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్మన్ కె.రామ్మోహనరావు చెప్పారు. గురువారం సాయంత్రం విశాఖలోని సాగరమాల కన్వెన్షన్స్‌లో ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫ్యాప్సీ) నిర్వహించిన ఓపెన్ హౌస్ ట్రేడ్ మీట్‌లో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో శరవేగంగా మారుతున్న సాంకేతికతకనుగుణంగా విశాఖ పోర్టులో యాంత్రీకరణ చేపట్టామన్నారు. ఈ పోర్టును వినియోగించుకోవడం ద్వారా వ్యాపారాభివృద్ధిని సాధించాలని ఫ్యాప్సీ ప్రతినిధులను కోరారు. జీఎస్టీ కమిషనర్ ఎంఆర్ఆర్ రెడ్డి మాట్లాడుతూ.. జీఎస్టీ క్లెయింలకు సంబంధించి ఎలాంటి జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరిస్తున్నామన్నారు. పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దుబే, కాంకర్ జీఎం కేవీఎస్ఆర్‌కే కిషోర్ పోర్టులో కల్పించిన సదుపాయాలను వివరించారు.

ప్రభుత్వ విధానాలకు సహకరిస్తాం

ఫ్యాప్సీ అధ్యక్షుడు కరుణేంద్ర ఎస్ జాస్తి మాట్లాడుతూ.. ఎగుమతి, దిగుమతులపై ప్రభుత్వం తీసుకుంటున్న విధానాలకు సహకరిస్తామన్నారు. ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ గత ఏడాదికంటే 15.31 శాతం వృద్ధి సాధించిందన్నారు. గత నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు. ఇటీవల ఆమోదించిన 2022–27 ఏపీ ఎక్స్‌పోర్టు పాలసీ వల్ల ఆంధ్రప్రదేశ్ రానున్న రోజుల్లో దేశంలోకెల్లా ఎక్స్‌పోర్టు హబ్‌గా మారుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే నెలలో ఎక్స్‌పోర్టు, ఇంపోర్టు మేనేజ్‌మెంటు కోర్సును ప్రవేశపెడ్తున్నామని, ఫ్యాప్సీ సభ్యుల సౌలభ్యం కోసం ఓ ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కస్టమ్స్ కమిషనర్ కె.ఇంజినీర్, ఫ్యాప్సీ ఉపాధ్యక్షుడు కంకటాల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఫ్యాప్సీ సంచికను ఆవిష్కరించారు.

ధారాలమ్మ ఆలయంలో దోపిడీ

- సీసీ కెమెరాలు, సీడీఆర్ యంత్రాన్ని ఎత్తుకుపోయిన దుండగులు

సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ధారాలమ్మ ఘాట్‌రోడ్డులోని ప్రముఖ పుణ్యక్షేత్రం ధారాలమ్మ తల్లి ఆలయంలో దొంగలు బీభత్సం సృష్టించారు. నగదుతోపాటు అమ్మవారి బంగారు ఆభరణాలను దోచుకుపోయారు. బుధవారం అర్ధరాత్రి దాటాక దొంగలు ఆలయ ఇనుప గ్రిల్‌ను తొలగించి గర్భగుడిలోకి ప్రవేశించారు. హుండీలో ఉన్న డబ్బు, అమ్మవారి మెడలో ఉన్న బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకుపోయారు. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాలో నమోదు కావడాన్ని గమనించిన దొంగలు సీడీఆర్ యంత్రాన్ని కూడా దొంగిలించుకుపోయారు. రాత్రి 2.30 గంటల సమయంలో ఆలయాన్ని శుభ్రంచేసే మహిళలు వచ్చేసరికి గర్భగుడి తాళాలు తెరిచి ఉన్నాయి. డబ్బులు కింద పడి ఉండడంతో స్థానికులకు తెలియజేశారు. ఎస్పీ సతీష్‌కుమార్ నేతృత్వంలో అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్, గూడెం కొత్తవీధి ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ ఘటనాస్థలికి చేరుకున్నారు. సెంట్రల్ క్రైం స్టేషన్ సిబ్బంది, విశాఖపట్నానికి చెందిన క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లతో పాటు, పోలీసులు దొంగతనం జరిగిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి కొన్ని ప్రాథమిక ఆధారాలను సేకరించారు. ఒడిశా, చింతూరు పోలీసులను అప్రమత్తం చేసి తనిఖీలు చేపట్టారు. రూ.2 లక్షలు నగదు, పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు దొంగలు దోచుకుపోయారని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. దుండగులు తీసుకువెళ్లిన అమ్మవారి బంగారు ఆభరణాలు 19.1 గ్రాములు, 4 తులాల వెండి ఆభరణాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

ట్రాఫిక్ ఎస్‌ఐ ఆత్మహత్య

- హత్యేనంటున్న కుటుంబ సభ్యులు
- మృతుడిది శ్రీకాకుళం జిల్లా సోమనాథపురం



రమణ (ఫైల్)

సికింద్రాబాద్/కోటబొమ్మాళి (శ్రీకాకుళం): బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ప్రొబేషనరీ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న బొడ్డాపు రమణ (26) రైలు పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మౌలాలి–చర్లపల్లి రైల్వేస్టేషన్ల మధ్య సీ క్యాబిన్ వద్ద పట్టాలపై మృతదేహం రెండు ముక్కలై ఉన్నట్టు సికింద్రాబాద్ రైల్వే పోలీసులు గుర్తించారు. సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీను కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం పట్టుపురం పంచాయతీ శివారి సోమనాథపురం గ్రామానికి చెందిన బొడ్డాపు అప్పలస్వామి రెండో కుమారుడు రమణ 2020 బ్యాచ్‌లో ఎస్‌ఐగా ఎంపికయ్యారు. చిక్కడపల్లి అశోక్‌నగర్‌లో ముగ్గురు మిత్రులతో కలిసి ఉంటూ బంజారా హిల్స్‌లో ట్రాఫిక్ ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం రాత్రి 10 గంటల తరువాత బయటకు వెళ్లి వస్తానని రూమ్‌మేట్స్‌కు చెప్పి వెళ్లిన రమణ అదేరోజు అర్ధరాత్రి దాటిన తరువాత మౌలాలి ప్రాంతానికి చేరుకుని రైలు పట్టాలపై తలపెట్టి అత్యహత్య చేసుకుని ఉంటాడని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. కొద్దిరోజులుగా రమణ మానసిక ఆందోళనలకు గురవుతున్నట్టు, ఇందుకు ప్రేమ వ్యవహారం కారణమై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

గౌరైల కాపరి నుంచి ఎస్‌ఐగా..

బంజారాహిల్స్‌లో ట్రాఫిక్ ఎస్‌ఐగా పనిచేస్తున్న బొడ్డాపు రమణ మృతితో ఆయన స్వగ్రామం సోమనాథపురంలో విషాదఛాయలు అలముకున్నాయి. రమణకు తండ్రి అప్పలస్వామి, తల్లి సరస్వతి, అన్నయ్య సింహాచలం, ఇద్దరు అక్కచెల్లెళ్లు ఉన్నారు. రమణ అందరి కంటే చిన్నవాడు. బీటెక్ పూర్తిచేసిన రమణ చిన్నప్పటి నుంచి కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. ఒకవైపు గొర్రెలు కాస్తూ పట్టుదలతో చదివాడు. 2020లో తెలంగాణ రాష్ట్రంలో ఎస్‌ఐగా ఎంపికయ్యాడు. ప్రేమ వ్యవహారం కారణంగా రమణ ఆత్మహత్య చేసుకున్నట్టు ప్రచారం జరుగుతుండగా, కుటుంబీకులు రమణది ఆత్మహత్య కాదని, ఎవరో హత్య చేసి రైలు కింద పడేశారని చెబుతున్నారు. వారంతా హైదరాబాద్‌కు బయలుదేరారు.

యూనియన్ బ్యాంక్‌లో ఈ–స్టాంప్ సేవలు ప్రారంభం



ఈ–స్టాంప్ పత్రాన్ని వినియోగదారులకు అందజేస్తున్న నవనీత్ కుమార్

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): ఏపీలో త్వరలో 104 యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌ల్లో ఈ–స్టాంప్ సేవలు ప్రారంభించనున్నట్లు యూనియన్ బ్యాంక్ జీఎం నవనీత్ కుమార్ చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మాచవరం శాఖ కార్యాలయంలో గురువారం ఆయన ఈ–స్టాంప్ సేవలను ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,200 బ్రాంచ్‌లు ఉండగా అందులో 104 బ్రాంచ్‌ల్లో ఈ–స్టాంప్ సేవలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మాచవరం బ్రాంచ్‌లో ఈ–స్టాంప్ సేవలు ప్రయోగాత్మకంగా ప్రారంభిస్తున్నామని తెలిపారు. స్టాంప్ పేపర్ల కోసం రిజిస్ట్రార్ కార్యాలయం వరకు వెళ్లకుండా మాచవరం యూనియన్ బ్యాంక్‌లో తీసుకోవచ్చన్నారు. దళారీ వ్యవస్థ, అదనపు చార్జీలు లేకుండా పూర్తి పారదర్శకంగా ఈ స్టాంప్‌లను అందజేస్తామన్నారు. బ్యాంకు రుణాలు, హౌసింగ్ రుణాలు, మార్ట్‌గేజ్‌ల కోసం ఈ స్టాంప్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

‘కులవాదులను కఠినంగా శిక్షించాలి’

తాడికొండ: రైతుల పేరుతో మభ్యపెడుతూ కోర్టులనూ మోసం చేస్తున్న కులవాదులను కఠినంగా శిక్షించాలని బహుజన పరిరక్షణ సమితి నేతలు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తాళ్ళాయపాలెం సీడ్‌యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో 760వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో పలువురు మాట్లాడారు. సీఎం సారథ్యంలో చట్ట సభల సాక్షిగా రాజధానిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అంగీకారం తెలపడం హర్షణీయమని, త్వరలో మూడు రాజధానులకు ఉన్న అడ్డంకులు తొలగిపోయి సానుకూలంగా తీర్పు వస్తుందన్నారు.

వికేంద్రీకరణతోనే రాష్ట్రాభివృద్ధి

- నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ లజపతిరాయ్



మాట్లాడుతున్న లజపతిరాయ్

జామి(విజయనగరం): పాలనా వికేంద్రీకరణతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. విజయనగరం జిల్లా జామి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ పరిపాలన రాజధాని అయితే ఉత్తరాంధ్ర విద్యార్థులకు ఉద్యోగ, విద్యా అవకాశాలు లభిస్తాయన్నారు. 1954 లోనే విశాఖని రాజధానిగా ఏర్పాటు చేస్తూ తీర్మానం చేశారని, అది కాలక్రమేణ మరుగున పడిపోయిందన్నారు. ఇన్నాళ్లకు సీఎం జగన్ నిర్ణయంతో మళ్లీ విశాఖకు గుర్తింపు లభించిందన్నారు. విశాఖలో పరిపాలనా రాజధాని ఏర్పాటయ్యేవరకు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ గొర్లె సరయు, ఎంపీపీ సబ్బవరపు అరుణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ చలుమూరి సత్యారావు, జేఏసీ సభ్యుడు జి.మోహన్‌కుమార్, పాల్గొన్నారు.

అలుపెరుగని బాటసారి

11 రోజుల్లో నాన్-స్టాప్‌గా 13,558 కిలోమీటర్ల ప్రయాణం • ప్రపంచ రికార్డు సృష్టించిన ఐదు నెలల గాడ్‌విట్ పక్షి

సిడ్నీ: పొడవైన ముక్కు, పొడవైన కాళ్లతో చూడగానే ఆకట్టుకొనే గాడ్‌విట్ పక్షి ఒకటి (శాస్త్రీయ నామం లిమోసా ల్యాపోనికా) అరుదైన ప్రపంచ రికార్డు సృష్టించింది. అమెరికాలోని అలాస్కా నుంచి ఆస్ట్రేలియాకు చెందిన ఈశాన్య టాస్మానియా ద్వీపంలోని అన్సాన్స్ బే వరకూ 11 రోజుల్లో 8,425 మైళ్లు (13,558.72 కిలోమీటర్లు) ప్రయాణించింది. ఎక్కడా ఆగకుండా ఏకధాటిగా ప్రయాణం సాగించడం గమనార్హం. కేవలం ఐదు నెలల వయసున్న ఈ మగ పక్షి (234684) ఈ నెల 13వ తేదీన అలాస్కా నుంచి బయలుదేరింది. ఓషియానియా, వనౌతు, న్యూ కాలెడోనియా తదితర ద్వీపాల గగనతలం నుంచి ప్రయాణం సాగించింది. ఈ నెల 24వ తేదీన అన్సాన్స్ బే ప్రాంతంలో కాలుమోపింది. సరిగ్గా చెప్పాలంటే 11 రోజుల ఒక గంట సమయంలో అలుపెరుగని తన ప్రయాణాన్ని పూర్తిచేసింది. ఈ పక్షికి సైంటిస్టులు 234684 అనే ఒక నంబర్ ఇచ్చారు. అలాస్కాలో పలు గాడ్‌విట్ పక్షులకు



5జీ శాటిలైట్ ట్యాగ్‌లు అమర్చి గాల్లోకి వదిలారు. వాటి గమనాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించారు. మిగతా పక్షులకంటే 234684 నంబర్ పక్షి సుదీర్ఘంగా ప్రయాణించినట్లు తేల్చారు. నాన్-స్టాప్‌గా గాల్లో దూసుకెళ్తూ 11 రోజుల ఒక గంటలో టాస్మానియాకు చేరుకుందని న్యూజిలాండ్‌లోని పుకొరోకొరో మిరండా షోర్‌బర్డ్ సెంటర్ ప్రకటించింది.

నీటిపై వాలితే మృత్యువాతే

గాడ్‌విట్ పక్షులు వలసలకు పెట్టింది పేరు. ప్రతి ఏటా వేసవిలో టాస్మానియాకు చేరుకుంటాయి. అక్కడ సంతతిని వృద్ధి చేసుకొని యూరప్ దేశాలకు తిరిగి వస్తుంటాయి. 2021లో 4బీబీఆర్‌డబ్ల్యూ అనే గాడ్‌విట్ మగ పక్షి 8,108 మైళ్లు(13,050 కిలోమీటర్లు) నాన్-స్టాప్‌గా ప్రయాణించింది. ఇప్పటిదాకా ఇదే రికార్డు. ఈ రికార్డును 234684 పక్షి బద్దలుకొట్టింది. ఇది 11 రోజుల ప్రయాణంలో సగంబరువును కోల్పోయి ఉంటుందని టాస్మానియాలోని పక్షి శాస్త్రవేత్త ఎరిక్ వోహ్లర్ చెప్పారు. ఈ రకం పక్షులు నీటిపై వాలలేవని, ఒకవేళ వాలితే చనిపోతాయని తెలిపారు. ఎందుకంటే వాటి కాలి వేళ్లను కలుపుతూ చర్మం ఉండదని వెల్లడించారు. గాట్‌విట్ జాతి పిట్టల్లో ప్రధానంగా నాలుగు రకాలు ఉంటాయి. అవి బార్-టెయిల్డ్ గాడ్‌విట్, బ్లాక్-టెయిల్డ్ గాడ్‌విట్, హడ్సోనియన్ గాడ్‌విట్, మార్బ్‌ల్డ్ గాడ్‌విట్. పొడవైన ముక్కును సముద్ర తీరాల్లోని ఇసుకలోకి దూర్చి అక్కడున్న పురుగులు, కీటకాలను తింటాయి.

ఎట్టకేలకు తిరిగిచ్చారు

84 ఏళ్లకు మళ్లీ గ్రంథాలయ గుమ్మం తొక్కిన పుస్తకం • తాత తీసుకున్న బుక్‌ను లేట్ ఫీజుతోసహా చెల్లించిన మనవడు

లండన్: పుస్తక పఠనంపై ఆసక్తితో గ్రంథాలయం నుంచి అద్దెకు తెచ్చుకున్న ఒక పుస్తకాన్ని ఓ పెద్దాయన తిరిగి ఇవ్వడం మరిచాడు. అలా అది 84 సంవత్సరాలు అల్మారాలో అలాగే ఉండిపోయింది. వారసత్వంగా తాత నుంచి వచ్చిన పాత వస్తువులను సర్దుతున్న మనవడికి లైబ్రరీ పుస్తకంపై దృష్టిపడింది. 1938 అక్టోబర్ 11న ఈ పుస్తకం తిరిగి ఇవ్వాలి అంటూ పుస్తకం ముందుపేజీపై ముద్రించి ఉండటం చూసి అవాక్కయ్యా. వెంటనే ఆ పుస్తకాన్ని లైబ్రరీలో అప్పజెప్పాడు. ఇంగ్లండ్‌లో ఇటీవల ఈ ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. ఇంగ్లాండ్‌లోని కోవెంట్రీ నగరం సమీపంలోని ఎర్లీస్‌డన్ ప్రాంతంలోని కోవెంట్రీ పబ్లిక్ లైబ్రరీ శాఖ నుంచి కెప్టెన్ విలియం హారిసన్ అనే వ్యక్తి రిచర్డ్ జెఫరీ రచించిన రెడ్ డీర్ అనే పుస్తకాన్ని అద్దెకు తెచ్చుకున్నాడు. 1938 తొలినాళ్లలో ఈ పుస్తకం విలియం చేతికొచ్చింది. విలియం 1957లో మరణించారు. పుస్తకం విషయం తెలియక ఆయన కుమార్తె సైతం పుస్తకాన్ని గ్రంథాలయానికి పంపలేదు. ఆమె ఇటీవల కన్నుమూశారు. ఆమె కుమారుడు ప్యాడీ రియార్డన్ ఇటీవల తాత వస్తువుల్లో దీనిని కనుగొన్నాడు. వెంటనే లైబ్రరీకి తీసుకెళ్లి ఇచ్చేశాడు. 84 ఏళ్ల తర్వాత పుస్తకం తిరిగి ఇవ్వడం చూసి లైబ్రరీ సిబ్బంది ఒకింత ఆశ్చర్యపడినా చాలా ఆలస్యంగా ఇచ్చారంటూ జరిమానా విధిస్తామన్నారు. అందుకు ప్యాడీ సిద్ధపడ్డాడు. 30,695 రోజుల ఆలస్యానికి లెక్కలు కట్టి, ప్రతి ఏడు రోజుల్లో ఒకరోజుకు జరిమానా విధిస్తూ ఫైన్‌ను 18.27 బ్రిటిష్ పౌండ్లుగా తేల్చారు. అది కట్టేసి ప్యాడీ బాధ్యత తీరిందని సంతోషపడ్డాడు. ఇన్ని రోజుల తర్వాత పుస్తకం తిరిగిఇవ్వడం రికార్డ్ అవుతుందని కొందరు నెటిజన్లు ట్వీట్లు చేశారు. వాస్తవానికి ఇలాంటి గిన్నిస్ ప్రపంచ రికార్డ్ ఇంగ్లాండ్‌లోనే నమోదవడం విశేషం. గ్రేట్ బ్రిటన్ తొలి ప్రధానిగా పరిగణించబడే సర్ రాబర్ట్ వాల్పోలే తండ్రి కల్నల్ రాబర్ట్ 1668లో సిడ్నీ ససెక్స్ కాలేజీ నుంచి ఒక పుస్తకం తీసుకున్నారు. అది ఏకంగా 288 సంవత్సరాల తర్వాత తిరిగి కళాశాలకు చేరింది.



క్లుప్తంగా...

ఉచితాలతో ఓటర్లను ఆధారపడేలా చేయొద్దు

న్యూఢిల్లీ: ఉచిత పథకాలకి, సంక్షేమ కార్యక్రమాలకి చాలా తేడా ఉందని బీజేపీ స్పష్టం చేసింది. ఓటర్లను ఆకర్షించడానికి వారిపై ఉచితాల వల విసిరి ఆధారపడి బతికే తత్వాన్ని పెంచొద్దని సూచించింది. ప్రజలు స్వశక్తితో వారి కాళ్ల మీద వారు నిలబడేలా సాధికారత కల్పించడానికి పార్టీలు వ్యవహరించేలా చర్యలు చేపట్టాలని బీజేపీ ఎన్నికల సంఘానికి రాసిన లేఖలో పేర్కొన్నట్టు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఎన్నికల నియమావళిని సవరణల ప్రతిపాదనలపై అన్ని పార్టీల అభిప్రాయాలను సేకరిస్తున్న ఎన్నికల కమిషన్ రాజకీయ పార్టీల ఎన్నికల హామీలకు సంబంధించిన ఆర్థిక సాధ్యాసాధ్యాలను వెల్లడించాలని ఎన్నికల సంఘం కోరింది. దీనికి సమాధానమిచ్చిన బీజేపీ ఉచిత పథకాలు ఓటర్లను ఆకర్షించే వ్యూహాలైతే, సంక్షేమ పథకాలు సమ్మిళిత వృద్ధి సాధించడానికి ఒక సాధనమని బీజేపీ ఆ లేఖలో స్పష్టం చేసింది. ఉచితంగా రేషన్ అందించడం వేరని, అదే ఉచిత కరెంట్‌ని వేర్వేరుగా చూడాలని పేర్కొంది.

విద్వేష ప్రసంగం కేసులో ఆజంఖాన్‌కు మూడేళ్ల జైలు

బరేలీ(యూపీ): మూడేళ్ల క్రితం నాటి కేసులో సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నేత ఆజంఖాన్‌కు గురువారం రామ్‌పూర్ కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. శిక్షతోపాటు రూ.6వేల జరిమానా విధించింది. ఈ తీర్పును హైకోర్టులో సవాల్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తూ కోర్టు ఆయనకు బెయిల్ మంజూరుచేసింది. 2019 ఏప్రిల్‌లో ఖతానగరియాలో సార్వత్రిక ఎన్నికల ప్రచారసభలో రామ్‌పూర్ అధికార యంత్రాంగం, ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగిలనుద్దేశిస్తూ ఆజంఖాన్ విద్వేషపూరిత ప్రసంగం చేశారనే కేసులో రామ్‌పూర్ కోర్టు ఆజంఖాన్‌కు జైలు శిక్ష విధించింది. ఉత్తరప్రదేశ్‌లో అవినీతి, చోరీ తదితర 90కిపైగా కేసులు ఖాన్‌పై నమోదవడం గమనార్హం. కేసులో దోషిగా తేలడంతో ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటిస్తూ యూపీ అసెంబ్లీ స్పీకర్ సంబంధిత ప్రక్రియను మొదలుపెట్టొచ్చు. ప్రజా ప్రతినిధి దోషిగా తేలి రెండేళ్లకు మించి శిక్ష పడితే ప్రజాప్రతినిధుల చట్టం ప్రకారం అతడిపై నిషేధం అమల్లోకి వస్తుంది. శిక్షా కాలం పూర్తయ్యాక ఆరేళ్లపాటు అతనిపై నిషేధం కొనసాగుతుంది.

విషపూరిత టీ తాగి ఐదుగురు దుర్మరణం

మైన్‌పురి: విష రసాయనాలు కలిసిన టీ తాగి ఇద్దరు చిన్నారులు, వారి తండ్రి సహా ఐదుగురు మృత్యువాతపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని మైన్‌పురి జిల్లా నగ్లా కన్హాయ్ గ్రామంలో ఈ విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రామమూర్తి అనే మహిళ గురువారం తన ఇంట్లో టీ పొడిగా పొరపడి, పొలంలో పిచికారీ చేసిన పురుగుమందు డబ్బాలోని పౌడర్‌ను వేసి టీ కాచింది. దానిని భర్త శివనందన్(35), కుమారులు శివాంగ్(6), దివ్యాన్ష్(5)తోపాటు తన తండ్రి రవీంద్ర సింగ్(55), పొరుగునుండే సొబ్రాన్(42)లకు ఇచ్చింది. తాగిన తర్వాత వీరంతా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. రవీంద్ర సింగ్, శివాంగ్, దివాన్ష్ ఆస్పత్రికి తీసుకెళ్లేలోగానే చనిపోగా మిగతా ఇద్దరు చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారని ఎస్పీ చెప్పారు.

వడోదరలో ఎయిర్ బస్ విమానాల తయారీ

న్యూఢిల్లీ: గుజరాత్ రాష్ట్రం వడోదరలో ఎయిర్ బస్, టాటా ఉమ్మడిగా సి-295 రవాణా విమాన తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాయని రక్షణ శాఖ కార్యదర్శి అజయ్ కుమార్ తెలిపారు. ఈ కేంద్రానికి ఈ నెల 30వ తేదీన ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తారని ఆయన గురువారం వెల్లడించారు. యూరప్ వెలుపల ఎయిర్‌బస్ విమాన తయారీ విభాగం ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారని వివరించారు. భారత వైమానిక దళం ఎప్పటినుంచో వినియోగిస్తున్న అవ్రో-748 రవాణా విమానాల స్థానంలో సి-295 రకం 56 సైనిక విమానాలను సమకూర్చుకునేందుకు ఎయిర్‌బస్ డిఫెన్స్ అండ్ స్పేస్ సంస్థతో గత ఏడాది కేంద్ర ప్రభుత్వం రూ.21 వేల కోట్ల విలువైన ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం 16 విమానాలను స్పెయిన్‌లోనే తయారు చేసి నాలుగేళ్లలో అప్పగించాల్సి ఉంది. మిగతా 40 విమానాలను టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్(టీఏఎస్ఎల్)తో కలిసి దేశీయంగానే ఉత్పత్తి చేయాల్సి ఉంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఏరోనాటికల్ క్వాలిటీ అస్యూరెన్స్ అనుమతులు మంజూరు చేసింది.

పీఓకే స్వాధీనం తథ్యం

రక్షణ మంత్రి రాజ్‌నాథ్
- గిల్గిత్, బాల్టిస్తాన్‌కు చేరుకున్నప్పుడే మన లక్ష్యం పూర్తవుతుంది
- శ్రీనగర్‌లో ఘనంగా 'శౌర్య దివస్'

శ్రీనగర్: పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)ను తిరిగి స్వాధీనం చేసుకోవడం తథ్యమన్న సంకేతాలను భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇచ్చారు. భారత్‌కు పాకిస్తాన్ వెన్నుపోటు పొడిచిందని మండిపడ్డారు. పాక్ ఆక్రమించుకున్న కశ్మీర్ భూభాగంలో నివసిస్తున్న ప్రజలను దారుణంగా వేధిస్తున్నారని, వారిపై అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పీఓకేలో అకృత్యాలకు గాను పాక్ మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. తదుపరి పరిణామాలను దాయాది దేశం ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. రాజ్‌నాథ్ బుధవారం శ్రీనగర్‌లోని ఓల్డ్ ఎయిర్‌ఫీల్డ్‌లో 'శౌర్యదివస్'లో ప్రసంగించారు. పాకిస్తాన్ సైనికులను తరిమికొట్టడానికి 1947 అక్టోబర్ 27న భారత సైన్యం (1 సిక్కు రెజిమెంట్) మొదటిసారిగా శ్రీనగర్ విమానాశ్రయంలో అడుగుపెట్టిన సందర్భాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించారు. పీఓకేలోని గిల్గిత్, బాల్టిస్తాన్‌లను స్వాధీనం చేసుకొంటేనే జంట కేంద్ర పాలిత ప్రాంతాలు జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌ల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని రాజ్‌నాథ్ తేల్చిచెప్పారు. జమ్మూకశ్మీర్, లద్దాఖ్ అభివృద్ధి ప్రయాణాన్ని ఇప్పుడే ప్రారంభించామని తెలిపారు. గిల్గిత్, బాల్టిస్తాన్‌కు చేరుకున్నప్పుడే మన లక్ష్యాలను సాధిస్తామన్నారు. మన సైనిక దళాల త్యాగాల వల్లే భారత్‌లో కశ్మీర్ ఒక అంతర్భాగంగా మారిందని కొనియాడారు. పీఓకేలోని కశ్మీరీల బాధలను మనం అర్థం చేసుకుంటున్నామని, కశ్మీర్‌లో అభివృద్ధి ప్రక్రియను ప్రారంభించామని, గిల్గిత్, బాల్టిస్తాన్‌కు చేరుకునే దాకా మన ప్రయాణం ఆపే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లతోపాటు పీఓకేలోని గిల్గిత్, బాల్టిస్తాన్‌లను కూడా కలుపుకుని సంపూర్ణ అభివృద్ధి సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 1994 ఫిబ్రవరి 22న భారత్ పార్లమెంట్ ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసినప్పుడే మన ప్రయాణం ముగుస్తుందని పేర్కొన్నారు.

ఉగ్రవాదుల ఏకైక లక్ష్యం భారత్

కశ్మీరీయత్ పేరిట పాకిస్తాన్ లష్కరే తోయిబా ముష్కరులను భారత్‌లోకి పంపిస్తోందని రాజ్‌నాథ్ సింగ్ దుయ్యబట్టారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రమూకల తాండవాన్ని కశ్మీరీయత్‌గా పరిగణించలేమని అన్నారు. పాకిస్తాన్ తీరుతో కేవలం పీఓకే ప్రజలే కాదు, మనమూ ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఉగ్రవాదానికి మతం లేదని, ఉగ్రవాదుల ఏకైక లక్ష్యం భారత్ అని ఉద్ఘాటించారు. కశ్మీర్‌లో ఉగ్రవాదానికి ఒకవైపు ఆజ్యం పోస్తూనే మరోవైపు మానవ



హక్కుల పేరిట మొసలి కన్నీరు కారుస్తోందని పాక్‌పై విరుచుకుపడ్డారు. ఆర్టికల్ 370 రద్దు గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. జమ్మూకశ్మీర్ ప్రజల పట్ల వివక్షను అంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఒక సాధనంగా మారిందని చెప్పారు. జమ్మూకశ్మీర్ ప్రజల పట్ల కొనసాగిన వివక్ష ప్రధాని మోదీ నాయకత్వంలో 2019 ఆగస్టు 5న అంతమైందని వివరించారు. జమ్మూకశ్మీర్‌ను భారత్‌లో పూర్తిస్థాయిలో విలీనం చేయడానికి జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామప్రసాద్ ముఖర్జీ ప్రారంభించిన మహాయజ్ఞం 2019 ఆగస్టు 5న పూర్తయ్యిందన్నారు. ఉగ్రవాదులపై ప్రభుత్వం చర్యలు తీసుకొంటే కొందరు స్వయం ప్రకటిత మేధావులు మానవ హక్కుల ఉల్లంఘన అంటూ గగ్గోలు పెడుతున్నారని రాజ్‌నాథ్ సింగ్ విమర్శించారు. శౌర్యదివస్‌లో అమర జవాన్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మనం సాధించబోయే ఘనత కోసం ఉత్సుకతతో ఎదురు చూస్తున్నా

మోదీతో బ్రిటన్ ప్రధాని సునాక్

లండన్: ప్రపంచంలో రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాలైన భారత్, బ్రిటన్ కలిసి పనిచేయాలని, ఇరు దేశాల నడుమ రక్షణ, ఆర్థికపరమైన భాగస్వామ్యం మరింత బలోపేతం కావాలని బ్రిటన్ నూతన ప్రధానమంత్రి రిషి సునాక్ ఆకాంక్షించారు. రెండు దేశాలు కలిసికట్టుగా సాధించబోయే ఘనత కోసం తాను ఉత్సుకతతో ఎదురు చూస్తున్నానని చెప్పారు. బ్రిటన్ ప్రధానిగా ఎన్నికైన తనను అభినందించినందుకు గాను ఆయన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ట్విట్టర్‌లో కృతజ్ఞతలు తెలియజేశారు. మోదీ గురువారం ఫోన్‌లో రిషి సునాక్‌తో మాట్లాడి, అభినందించారు. ''సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడానికి మేమిద్దరం కలిసి పనిచేస్తాం. సమగ్ర, సమ



తుల్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) కుదుర్చుకోవాలని అంగీకారానికి వచ్చాం'' అని మోదీ ట్వీట్ చేశారు. దీనిపై రిషి సునాక్ ట్విట్టర్‌లో స్పందించారు. కొత్త పాత్రలో తన ప్రయాణం ఇప్పుడే మొదలైందని, బ్రిటన్-భారత్ కలిసి పనిచేయాలని పేర్కొన్నారు. బ్రిటన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రిషి సునాక్‌తో మోదీ మాట్లాడడం ఇదే మొదటిసారి.

రెండో ఆప్షన్ కోసం అన్వేషిస్తున్నా: గవర్నర్ వ్యాఖ్య

రాయ్‌పూర్: లాభదాయక పదవి కేసులో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించాలంటూ వెల్లువెత్తుతున్న డిమాండ్లపై ఆ రాష్ట్ర గవర్నర్ స్పందించారు. 'నేనేమీ రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరిచేవాడిని కాదు. ఈసీ సిఫార్సు తర్వాత తుది నిర్ణయంపై తేల్చుకునేందుకు రెండో ఆప్షన్‌కు వెళ్తున్నా. నిపుణుల సలహాలు తీసుకుంటున్నా' అని గవర్నర్ రమేశ్ స్పష్టంచేశారు. గనుల తవ్వకం లీజును సీఎం సోరెన్ తనకు తానే మంజూరుచేసుకున్నాడనే కేసు నమోదైన విషయం తెల్సిందే. దీంతో లాభదాయక పదవి కోణంలో సోరెన్ ఎమ్మెల్యేగా కొనసాగేందుకు అర్హుడా ? కాదా? అనేది స్పష్టంచేస్తూ ఈసీ నుంచి గవర్నర్‌కు లేఖ వచ్చింది. అందులో ఏముందో తెలీదు. అనర్హుడిగా ప్రకటించాలని ఈసీ సిఫార్సు చేసిందని వార్తలొచ్చాయి. 'నిపుణుల సలహా తర్వాత జార్ఖండ్‌లో అణుబాంబ్ పేలొచ్చు' అని గవర్నర్ వ్యాఖ్యానించడం గమనార్హం.

మున్సిపల్ ఎన్నికల్లో చెత్తే కీలకాంశం

న్యూఢిల్లీ: గుట్టలుగా పేరుకుపోతున్న చెత్త, వ్యర్థాలే ఈసారి ఢిల్లీ మున్సిపల్(ఎంసీడీ) ఎన్నికల్లో ప్రధానాంశాలని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. చెత్తగుట్టలకు చిరునామాగా నిలిచిన ఘాజీపూర్ ప్రాంతంలో వ్యర్థాల నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కేజ్రీవాల్ గురువారం ఆ ప్రాంతానికి వెళ్లారు. విషయం తెల్సుకున్న బీజేపీ కార్యకర్తలు భారీసంఖ్యలో అక్కడికి చేరుకుని దారిపొడవునా కేజ్రీవాల్‌కు నల్లజెండాలతో నిరసన తెలిపారు. వారికి పోటీగా ఆప్ కార్యకర్తలు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడారు. 'ఇటీవల విలీనమైన ఢిల్లీ పరిధిలోని మూడు మున్సిపాలిటీలను బీజేపీ దాదాపు 15 ఏళ్ల ఏలింది. అయినా, చెత్తను సరిగా ప్రాసెస్‌చేయకుండా వదిలేసి దేశరాజధాని సమీప ప్రాంతాన్ని చెత్తతో నింపేసింది. బీజేపీ అవినీతి, తప్పులకు ఈ చెత్తగుట్టలు నిలువెత్తు సాక్ష్యాలు' అని బీజేపీని తిట్టిపోశారు. 'ఢిల్లీ ప్రాంత మాతృమూర్తులారా.. ప్రభుత్వ పథకం ద్వారా



తీర్థయాత్రలకు పంపించిన మీ ఈ శ్రవణ కుమారుడిని ఓటుతో ఆశీర్వదించండి. బీజేపీకి బుద్ధిచెప్పండి' అని ఢిల్లీ మహిళా ఓటర్లను కేజ్రీవాల్ కోరారు. ఆప్‌ను గెలిపిస్తే చెత్తనంతా తొలగిస్తామన్నారు. కేజ్రీవాల్ ఆరోపణలను ఢిల్లీ బీజేపీ ఎంపీ గౌతమ్ గంభీర్ తిప్పికొట్టారు. 'ఘాజీపూర్ సమస్యను గతంలో చాలాసార్లు సీఎం కేజ్రీవాల్ దృష్టికి తీసుకెళ్లాం. ఇక్కడికి చాలాసార్లు వచ్చాం. ఆయననూ రమ్మన్నాం. ఆయన రాలేదు. ఎన్నికలు వస్తున్నాయని ఇప్పుడు వచ్చారు. వర్షాలప్పుడు కనిపించే సీజనల్ కప్పలు' అని హిందీలో ట్వీట్‌చేశారు.

సమష్టి కృషితోనే నేరాలకు అడ్డుకట్ట

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం ఆవశ్యకం
- రాష్ట్రాల హోం మంత్రులు, పోలీసు ఉన్నతాధికారుల సదస్సులో షా



సూరజ్‌కుండ్(హరియాణా): దేశవ్యాప్తంగా విస్తరించిన నేర సామ్రాజ్యాన్ని కూల్చేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమష్టి బాధ్యత అని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. హరియాణాలోని సూరజ్‌కుండ్‌లో జరుగుతున్న అన్ని రాష్ట్రాల హోం శాఖ మంత్రులు, పోలీసు ఉన్నతాధికారుల 'చింతన్ శిబిర్' సదస్సులో అమిత్ షా ప్రసంగించారు. 'స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రధాని మోదీ అభిలషించిన పంచప్రాణ లక్ష్యాలు, వందేళ్ల స్వతంత్రభారతం(2047 దార్శనికత)ను సాకారం చేసుకోవడానికి ఈ చింతన్ శిబిర్‌లో ఫలవంత కార్యాచరణను సంసిద్ధం చేసుకుందాం. జమ్మూకశ్మీర్, విదేశీ అక్రమ విరాళాలు, మాదకద్రవ్యాల నిరోధం, ఈశాన్య రాష్ట్రాల్లో వేర్పాటువాదుల లొంగుబాటుతో సమస్యలను అణచేసి దేశ అంతర్గత భద్రతను పెంచడంలో మోదీ సర్కార్ సఫలత సాధించింది. 'పశుపతి(నాథ్) నుంచి తిరుపతి వరకు వామపక్ష తీవ్రవాదం ఉండేది. అదీ సద్దుమణిగింది. ఇక, రాష్ట్రంలో శాంతిభద్రత అనేది ఆ రాష్ట్ర అంశమే. కానీ, మనందరం ఉమ్మడిగా పోరాడి అన్ని రాష్ట్రాల్లో నేరాలను అణచివేద్దాం. ఇది మనందరి సమష్టి బాధ్యత' అని హోం మంత్రులతో షా వ్యాఖ్యానించారు. 'కొన్ని ఎన్‌జీవోలు మతమార్పిడి వంటి దుశ్చర్యలకు పాల్పడ్డాయి. దేశార్థికాన్ని బలహీనపరిచేలా, అభివృద్ధిని అడ్డుకునేలా దేశ వ్యతిరేక కార్యకలాపాలకు విదేశీ నిధులను దుర్వినియోగం చేశాయి. వీటిపై విదేశీ విరాళాల నియంత్రణ చట్టం కింద ఆంక్షల చర్యలు తీసుకున్నాం' అని షా చెప్పారు.

ఇంటి పని చేయాలనడం క్రూరత్వం కాదు

ముంబై: ఇంట్లో పనులు చేయాలని వివాహితను ఆమె కుటుంబ సభ్యులు ఆదేశించడం క్రూరత్వం కిందకు రాదని బాంబే హైకోర్టుకు చెందిన ఔరంగాబాద్ బెంచ్ స్పష్టం చేసింది. ఇంట్లో వివాహిత చేసే పనులు పనిమనిషి చేసే పనులతో సమానం కాదని వెల్లడించింది. ఇంట్లో కుటుంబం కోసం పనులు చేయాలంటూ భర్త, అత్తమామలు వేధిస్తున్నారంటూ ఓ మహిళ పెట్టిన కేసు(ఎఫ్ఐఆర్)ను న్యాయమూర్తులు జస్టిస్ విభా కంకాన్‌వాడీ, జస్టిస్ రాజేశ్ పాటిల్‌తో కూడిన డివిజన్ బెంచ్ ఈ నెల 21న కొట్టివేసింది. పెళ్లయ్యాక కేవలం నెల రోజుల పాటు తనను చక్కగా ఆదరించారని, ఆ తర్వాత ఒక పనిమనిషిలా మార్చారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అంతేకాకుండా రూ.4 లక్షలతోపాటు ఒక కారు ఇవ్వాలంటూ భర్త, అత్తమామలు డిమాండ్ చేశారని పేర్కొంది. శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేశారని వెల్లడించింది. మహిళ ఫిర్యాదు మేరకు ఆమె భర్త, అత్తమామలపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ మహిళ భర్త, అత్తమామలు బాంబే హైకోర్టు ఔరంగాబాద్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. ''ఇంట్లో వివాహితను పనులు చేయాలనడం కుటుంబం కోసమే కదా. ఇంటి మనిషికి పనులు చెప్పడం పనిమనిషిని ఆదేశించినట్లు కాదు. ఒకవేళ ఆమెకు ఇంటి పనులు చేయడం ఇష్టం లేకపోతే పెళ్లికి ముందే ఆ విషయం చెప్పాలి. అప్పుడు పెళ్లికొడుకు ఆ పెళ్లి విషయంలో పునరాలోచించుకొనే అవకాశం ఉంటుంది'' అని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఐపీసీ సెక్షన్ 498ఏ ప్రకారం.. శారీరకంగా, మానసికంగా వేధించారంటూ కేవలం నోటిమాటగా చెబితే సరిపోదని, అందుకు ఆధారాలు చూపాలని, తగిన వివరణ ఇవ్వాలని సూచించింది.



రష్యా దాడులతో షక్తార్స్క్‌లోని ఆయిల్ డిపోలో ఎగసిన మంటలు

అణ్వాయుధాలు ప్రయోగించం: పుతిన్

మాస్కో: ఉక్రెయిన్‌పై అణ్వాయుధాలను ప్రయోగించే ఉద్దేశం తమకు లేనేలేదని రష్యా అధ్యక్షుడు పుతిన్ స్పష్టం చేశారు. రాజకీయంగా, సైనికపరంగా కూడా తమకు అలాంటి అవసరం లేదన్నారు. ప్రపంచంపై పెత్తనం కోసం పశ్చిమ దేశాలు చేస్తున్న ప్రయత్నాల వల్లనే ప్రస్తుత సంక్షోభం తలెత్తిందని అన్నారు. ఇతర దేశాలపై తమ పెత్తనం సాగించేందుకు ప్రమాదకరమైన, క్రూరమైన క్రీడ ఆడుతున్నాయంటూ అమెరికా, మిత్ర పక్షాలపై ఆయన విరుచుకుపడ్డారు. కాగా, ఖేర్సన్‌ను తిరిగి తమ వశం చేసుకోవడమే లక్ష్యంగా ముందుకొస్తున్న ఉక్రెయిన్ సేనల ధాటికి ఖేర్సన్‌లోని రష్యా అనుకూల ఉన్నతాధికారులు పారిపోయారు. వీరితోపాటు వేలాది మంది స్థానికులు దాడుల భయంతో స్వస్థలాలను వదిలి వెళ్లిపోయారు. 'తాజాగా అమెరికా, పశ్చిమ దేశాలకు చెందిన వాణిజ్య ఉపగ్రహాలను యుద్ధంకోసం ఉక్రెయిన్ వాడుతోంది. ఇది అత్యంత ప్రమాదకరం' అని ఐరాసలో ఆయుధాల నియంత్రణ ప్యానెల్‌లో రష్యా ప్రతినిధి కాన్‌స్టాంటిన్ ఆరోపించారు. యుద్ధం కారణంగా శిలాజ ఇంధనాలకు ఎవరూ ఊహించనంతగా డిమాండ్ పెరిగే ప్రమాదముందని పారిస్ కేంద్రంగా పనిచేసే అంతర్జాతీయ ఇంధన ఏజెన్సీ తన నివేదికలో హెచ్చరించింది.

నోటుతో పొలిటికల్ హీట్

న్యూఢిల్లీ: గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికలు ముందున్న వేళ కరెన్సీ నోట్లపై ముద్రించే చిత్రాల వివాదం ముదురుతోంది. ఆమ్ ఆద్మీ పార్టీ హిందూ వ్యతిరేకి అని బీజేపీ చేస్తున్న ప్రచారాన్ని తిప్పి కొట్టడానికి, దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతోందన్న విషయాన్ని చాటి చెప్పడానికి ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ కొత్త వాదన తెరపైకి తెచ్చారు. లక్ష్మీదేవి, గణేశుడి చిత్రాలను ముద్రిస్తే మన దేశం సుసంపన్నమవుతుందని ఆయన వాదిస్తున్నారు. ముస్లిం దేశమైన ఇండోనేసియాలో గణేశుడి చిత్రాన్ని ముద్రిస్తూ ఉంటే మనం చేస్తే తప్పేమిటని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఇండోనేసియాలో 20 వేల రూపాయల నోటుపై మాత్రమే గణేశుడి బొమ్మ ఉంటుంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రం ముద్రించాలని డిమాండ్ చేస్తోంది. అంబేద్కర్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారమే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉనికిలోకి వచ్చిందని కాబట్టి ఆయన చిత్రమే ముద్రించాలని అంటోంది. నోట్లపై ఎవరి బొమ్మలు ముద్రించాలి, డిజైన్ ఎలా ఉండాలి అన్న అధికారం కేంద్రప్రభుత్వంతో పాటు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా చట్టంలోని సెక్షన్ 22 ప్రకారం ఆర్‌బీఐకే ఉంది. గుజరాత్ ఎన్నికల దృష్ట్యా కేజ్రీవాల్ లక్ష్మీదేవి చిత్రం ముద్రించాలన్న డిమాండ్ తెచ్చారని కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ ధ్వజమెత్తారు. అసలు నోటుపై ఎవరిదైనా చిత్రాన్ని ముద్రించాలంటే అన్నివిధాలా అర్హుడైన వ్యక్తి అంబేద్కరేనని ఆయన అంటున్నారు. గాంధీజీ, అంబేద్కర్ చిత్రాలతో నోట్లను ముద్రించాలన్న డిమాండ్ తెచ్చి కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ హీట్ పెంచింది.



ఒక్కసారి చరిత్రలోకి వెళితే

1969లో తొలిసారి గాంధీ శతజయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రాలున్న నోట్లు అందుబాటులోకి వచ్చాయి. అంతకుముందు ప్రముఖ గుళ్లు, గోపురాలు, ఉపగ్రహాలు, ఆనకట్టలు, ఉద్యానవనాలు వంటివి ముద్రించారు. 1935లో ఆర్‌బీఐ ఏర్పాటయ్యాక 1938లో తొలిసారిగా రూపాయి నోటు ముద్రించింది. 1949లో జాతీయ చిహ్నమైన నాలుగు సింహాలు, అశోక స్తూపాన్ని నోట్లపై ముద్రించారు. తర్వాత జింకలు, ఏనుగులు, పులుల చిత్రాలు నోట్లపై వచ్చాయి. 1954లో ఆర్‌బీఐ విలువ అధికంగా ఉండే రూ.1,000, రూ.5,000, రూ.10,000 నోట్లను ముద్రించినప్పుడు తంజావూర్ ఆలయం, గేట్ వే ఆఫ్ ఇండియా, సారానాథ్‌లో అశోక స్తూపం నోట్లపై వచ్చి చేరాయి. తర్వాత పార్లమెంటు, బ్రహ్మేశ్వర్ ఆలయం కనిపించాయి.

ధాన్యం సేకరణ అంతంత మాత్రమే!

- నిర్దేశిత లక్ష్యంలో ఇప్పటిదాకా 10 శాతమే పూర్తి
- పలు రాష్ట్రాల్లో ఇంకా ప్రారంభం కాని కొనుగోళ్లు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ప్రస్తుత ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు అనుకున్న స్థాయిలో జరగడం లేదు. అక్టోబర్ 1 నుంచి కొనుగోళ్లు మొదలైనా తొలి మూడు వారాల్లో నిర్దేశిత లక్ష్యంలో సేకరణ కేవలం 10 శాతమే పూర్తయినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. అక్టోబర్‌లో ఇప్పటిదాకా 53 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం కొనుగోళ్లు జరగ్గా, 2004లో ఇదే సమయానికి 35.83 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ జరిగింది. ఆ తర్వాత అక్టోబర్ నెలలో ఇంత తక్కువ స్థాయిలో కొనుగోళ్లు జరగడం ఇదే తొలిసారి అని కేంద్ర ప్రభుత్వ లెక్కలు వెల్లడిస్తున్నాయి. నిజానికి దేశంలో వరిసాగు విస్తీర్ణం గత ఏడాదితో పోలిస్తే ఈసారి 5.5 శాతం తగ్గింది. 3.67 కోట్ల హెక్టార్లకు పరిమితం అయ్యింది. సాగు విస్తీర్ణాన్ని బట్టి చూస్తే ధాన్యం కొనుగోళ్లు దేశవ్యాప్తంగా 5.18 కోట్ల మెట్రిక్ టన్నులు ఉంటాయని కేంద్రం అంచనా వేసింది. ఈ నెల నుంచే సేకరణ ప్రారంభించింది. అయితే, పంజాబ్, హరియాణాలో మాత్రమే చెప్పుకోదగ్గ స్థాయిలో సేకరణ జరిగింది. పంజాబ్‌లో 1.50 కోట్ల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 18.94 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ పూర్తయ్యింది.

అధిక తేమశాతంతో ఇబ్బందులు

ప్రతికూల వాతావరణం కారణంగానే ధాన్యం సేకరణ మందగించిందని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ధాన్యంలో తేమశాతం పరిమితిని 17 శాతంగా నిర్ణయించగా, పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో ఇది 22 శాతం వరకూ ఉంటోంది. దీంతో ఆశించినంత వేగంగా సేకరణ జరగడం లేదు. వరి అధికంగా పండించే ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ధాన్యం సేకరణ ప్రారంభం కాలేదు. ఆయా రాష్ట్రాల్లో వర్షాలు ఆలస్యంగా మొదలయ్యాయి. ఫలితంగా పంటల సాగులో జాప్యం జరిగింది.

సాక్షి
శ్రీకాకుళం

శుక్రవారం ‌। 28 ‌। అక్టోబర్ ‌। 2022



గోగుసాగుకు పూర్వ వైభవం

ప్లాస్టిక్ నిషేధం అమలుతో జూట్ ఉత్పత్తులకు గిరాకీ పెరిగే అవకాశముంది. దీంతో గోగు రైతులు సాగుపై దృష్టి సారిస్తున్నారు. - 8లో



బుడితి.. నలుదిశలా ఖ్యాతి

కంచు, ఇత్తడి వస్తువులకు బుడితి గ్రామం కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఇక్కడి వస్తువులకు దేశ వ్యాప్తంగా గిరాకీ ఉంటోంది. - 8లో

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

అరసవల్లి: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని సీఈవో ఆర్.వెంకట్రామన్ ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తదితర ప్రజాప్రతినిధులంతా హాజరుకానున్నారని, అన్ని శాఖల ఉన్నతాధికారులు విధిగా తమ ప్రగతి నివేదించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

30న జిల్లా సాఫ్ట్ టెన్నిస్ జట్టు ఎంపికలు

పాతపట్నం/శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30న సాఫ్ట్ టెన్నిస్ జిల్లా స్థాయి జూనియర్ టీమ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.అప్పన్న, జె.షణ్ముఖరావు గురువారం తెలిపారు. పాతపట్నం తిడ్డిమి రోడ్డులోని అక్షర స్కూల్ ఆవరణలో ఉదయం 9 గంటలకు ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. 2004 జనవరి 1 తర్వాత పుట్టిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్ జిరాక్సులతో హాజరుకావాలన్నారు. ఎంపికైన జట్టు నవంబర్ 11 నుంచి 13 వరకు గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 88971 34281 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆర్డీఓ ఆకస్మిక తనిఖీలు



భూసర్వేపై ఆరా తీస్తున్న ఆర్డీఓ శాంతి

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం మండల తహశీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ బొడ్డేపల్లి శాంతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమగ్ర భూ సర్వే, ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియపై సీనియర్ సహాయకుడు ప్రకాశ్‌ను అడిగి తెలుసుకున్నారు. స్పందన సమస్యల పరిష్కారంపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.వెంకటరావు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ప్రభుత్వ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. జగనన్న భూ హక్కు, ప్రాధాన్యతా భవనాలు, పీఎంజీఏఎస్‌వై, ఉపాధి హామీ పనులు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం జిల్లాలో జరుగుతున్న పనుల ప్రగతిని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జెడ్పీ సీఈఓ వెంకటరామన్, డీపీఓ రవికుమార్, పంచాయతీ రాజ్ ఎస్ఈ సత్యనారాయణమూర్తి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసాదరావు, డ్వామా పీడీ చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.


ఏఈకి క్షమాపణ చెప్పకపోతే 'కూన' పనులకు బాయ్‌కాట్

అరసవల్లి: శ్రీకాకుళం మండలం శాస్త్రులపేట పీఆర్ రోడ్డు పనుల్లో నాణ్యత లోపించడంపై నోటీసు ఇచ్చిన పీఐయూ ఏఈ కేసీహెచ్ మహంతిపై భౌతికదాడికి యత్నించి దురుసుగా వ్యవహరించిన కాంట్రాక్టర్ కూన వెంకట సత్యనారాయణపై పీఆర్ ఇంజినీర్ల జేఏసీ ఘాటుగా స్పందించింది. ఇటీవల జరిగిన ఘటనపై 'సాక్షి'లో 'కూన సోదరుడి కండకావరం' పేరిట కథనం ప్రచురించిన సంగతి విదితమే. దీనిపై జిల్లా పీఆర్ ఇంజినీర్లు స్పందించి బాధిత ఏఈ పక్షాన నిలబడి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఎస్.రామకృష్ణ, కో చైర్మన్లు ఎస్.శ్రీరాములు, ఎస్‌వీఎస్ పోలినాయుడులు గురువారం మాట్లాడుతూ కాంట్రాక్టర్ వ్యవహారం హేయమైందని, ఇప్పటికైనా ఏఈకి లిఖితపూర్వకంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు సదరు కాంట్రాక్టర్ చేపడుతున్న పనులకు శాఖాపరంగా సహకారం అందించేది లేదని, పనులు కూడా బాయ్‌కాట్ చేస్తున్నామని ముకుమ్మడిగా తీర్మానించారు.

నిందితులకు రిమాండ్

శ్రీకాకుళం క్రైమ్ : ఎచ్చెర్ల మండలం ఎస్ఎం పురం పంచాయితీ లింగాలపేటలో ఈ నెల 24న ఇద్దరు యువకులు ఓ బాలికపై సామూహిక లైంగిక దాడికి పాల్పడిన విషయం విదితమే. గురువారం నిందితులు రంగుల నవీన్ (19), నల్లగుంట్ల శామ్యూల్ (19)లను అరెస్టు చేసి రిమాండుకు తరలించి కోర్టు మెజిస్ట్రేట్‌కు అప్పగించినట్లు శ్రీకాకుళం దిశా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ వాసుదేవ్ చెప్పారు. నవీన్ స్వస్థలం అనకాపల్లి మండలం రామాపురం కాగా, శామ్యూల్‌ది విశాఖపట్నం జిల్లా అక్కిరెడ్డిపాలెం. వీరిరువురూ కొంతకాలంగా లింగాలపేటలోనే ఉంటున్నారు.

గడప గడపలో ప్రగతి వెలుగులు



మూడున్నరేళ్లుగా సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. అదే సమయంలో ప్రగతిని పరుగులు పెట్టిస్తోంది. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ లకు పక్కా భవనాలు ఒకవైపు ప్రధాన రహదారుల అభివృద్ధి పనులు మరోవైపు చురుగ్గా సాగుతున్నాయి. వీటికి తోడు కొద్ది నెలలుగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల దృష్టికి వచ్చిన స్థానిక సమస్యల పరిష్కారానికి నడుం కట్టింది. ఇందుకోసమే ప్రతి సచివాలయానికి రూ. 20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఇంతకు ముందే సీఎం వైఎస్ జగన్ ప్రకటించారు. ఆమేరకు జిల్లాకు రూ. 32.34 కోట్లు మంజూరయ్యాయి. వీటితో 907 పనులకు ఆమోదం లభించగా.. 827 పనులు ప్రారంభం అయ్యాయి.

- ఓవైపు చురుగ్గా ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు
- మరోవైపు గడప గడప పనులకు శ్రీకారం
- ఇప్పటికే రూ.32.34 కోట్ల విలువైన పనులు మంజూరు
- సమస్యల పరిష్కారమే అజెండాగా ముందుకెళ్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు తీరును తెలుసుకునేందుకు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు కలిసి ప్రజల వద్దకు వెళ్తున్నారు. ఈ క్రమంలో పథకాల అమలే కాకుండా సమస్యలను కూడా తెలుసుకుంటున్నారు. వాటి పరిష్కారం కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయానికి రూ.20లక్షలు చొప్పున విడుదల చేశారు. దానిలో భాగంగా క్షేత్రస్థాయి నుంచి వచ్చిన ప్రతిపాదిత పనులకు కలెక్టర్ వెంటనే మంజూరు చేస్తున్నారు. మంత్రులు, స్పీకర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బంది ప్రాధాన్యతా ప్రకారం పనులు గుర్తిస్తున్నారు. వాటిని మంజూరు చేసి పనులు ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం అన్ని విధాలా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే రూ.32.34 కోట్ల విలువైన 907 పనులు మంజూరు చేసింది. అందులో 827 పనులు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా తాగునీటి వసతి, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలు, కొత్త విద్యుత్ లైన్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, కల్వర్టులు, కమ్యూనిటీ భవనాలు, ప్రహరీ నిర్మాణాలకు ప్రాధాన్యత క్రమంలో నిధులు మంజూరు చేశారు.

పల్లె మారుతోంది..

పల్లెల్లో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. ఇప్పటికే కొన్ని నిర్మాణాలతో గ్రామాలు సరికొత్త రూపాన్ని సంతరించుకున్నాయి. ముఖ్యంగా నాడు–నేడుతో పాఠశాలలు, ప్రభుత్వాసుపత్రులు అభివృద్ధికి నోచుకున్నాయి. ప్రజల ముంగిట సేవలందించేందుకు ఏర్పాటైన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు, బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్లు, డిజిటల్ లైబ్రరీలకు కొత్త భవనాలు సమకూరుతున్నాయి. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయాలతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. జిల్లాలో 2843 ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టగా సగం వరకు ఇప్పటికే పూర్తయ్యాయి.

పనులపై ప్రత్యేక దృష్టి



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గడప గడపకూ మన ప్రభుత్వం పనులపై ప్రత్యేక దృష్టి సారించాం. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన ప్రతిపాదనలకు వెంటనే నిధులు మంజూరు చేస్తున్నాం. ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడుతున్నాం. ఇప్పటికే గ్రామాల్లో పనులు ప్రారంభమయ్యాయి. సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్ తదితర భవన నిర్మాణాలను సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే చాలా భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయి. – శ్రీకేష్ బి.లాఠకర్, జిల్లా కలెక్టర్



గ్రామ సచివాలయాల భవనాలు: 656
పూర్తయినవి: 331
ప్రగతిలో ఉన్నవి : 320



రైతు భరోసా కేంద్రాల భవనాలు : 653
పూర్తయినవి : 216
ప్రగతిలో ఉన్నవి : 425



బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్లు : 194
మంజూరైన నిధులు: రూ. 22.83 కోట్లు



వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలు : 183
మంజూరైన నిధులు : రూ. 29.83 కోట్లు



వైఎస్సార్ హెల్త్ క్లినికలు : 538
పూర్తయినవి : 120
ప్రగతిలో ఉన్నవి : 403



అంగన్‌వాడీ భవనాలు : 603
పూర్తయినవి : 400
ప్రగతిలో ఉన్నవి : 203



మత్స్య అవతారంలో బ్రహ్మ జనార్దనుడు

బారువలోని బ్రహ్మజనార్దనస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారు గురువారం మత్స్య అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు భువనేశ్వర్ పాణిగ్రాహి ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. – సోంపేట

ఎంపీహెచ్ఏ కౌన్సెలింగ్ వాయిదా



హెల్త్ అసిస్టెంట్లకు భరోసా ఇస్తున్న డీఎంహెచ్ఓ మీనాక్షి

అరసవల్లి: జిల్లాలో వైఎస్సార్ విలేజీ హెల్త్ క్లినిక్స్‌లో 317 ఎంపీహెచ్ఏ (మేల్) ఉద్యోగ స్థానాలకు వర్క్ ఆర్డర్ల కింద కౌన్సెలింగ్ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మీనాక్షి ప్రకటించారు. గురువారం ఉదయం సిబ్బందికి కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టేందుకు నిర్ణయించగా.. పలువురు ఉద్యోగులు తమ సీనియార్టీ సర్వీసు రికార్డుల్లో తప్పులు నమోదయ్యాయని వాపోయారు. కచ్చితంగా సర్వీస్‌ను ప్రాతిపదికగా తీసుకుని వర్క్ ఆర్డర్లు ఇవ్వనున్న నేపథ్యంలో ఎవ్వరికైనా తమ సర్వీసులపై అనుమానాలుంటే వెంటనే తమ కార్యాలయంలోనే సరిచేసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. దీంతో హెల్త్ అసిస్టెంట్లు సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు తమ సర్వీసుల విషయంలో అన్యాయం జరిగిందని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు ఐ.నారాయణరావు ఆధ్వర్యంలో పలు సంఘాల నేతలు డీఎంహెచ్ఓను కలిసి ఉద్యోగుల సమస్యలను విన్నవించారు. మరికొందరు సమస్యను పరిష్కరించకుంటే కౌన్సెలింగ్‌కు హాజరవ్వమంటూ గొంతెత్తారు. ఈ పరిస్థితులపై డీఎంహెచ్ఓ స్పందించి..ఉద్యోగుల సర్వీసుల తప్పులను కచ్చితంగా సరిచేసిన తర్వాతే వర్క్ ఆర్డర్లు కేటాయించే కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహిస్తామని ప్రకటించారు.

అర్హులందరికీ జగనన్న తోడు రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్

రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ అన్నారు. శ్రీకాకుళం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న తోడు రుణాలు అర్హులందరికీ అందేలా చర్యలు చేపట్టాలన్నారు. నవంబర్‌లో పథకం అమలు ఉంటుందన్నారు. చిరు వ్యాపారులకు రూ.10 వేల రుణం బ్యాంకుల ద్వారా మంజూరు చేస్తామని, వడ్డీ మాత్రం ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం వి.సుజాత, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మూల కృష్ణవేణి, మేనేజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. –శ్రీకాకుళం రూరల్

బతుకు చిత్రం..

సముద్రాన్నే నమ్ముకున్న జీవితాలు వారివి. గంగమ్మ కరుణిస్తేనే వారి రోజు ఆనందంగా గడుస్తుంది. రోజూ తెల్లవారుజామునే వేటసాగించేందుకు బయల్దేరే మత్స్యకారులు ఉదయం 11 గంటలకే ఒడ్డుకు చేరుకుంటారు. వల బరువెక్కితే వారి అదృష్టం పండినట్టే. ఇదీ వారి దినచర్య. గార మండలం బందరువానిపేట తీరంలో వేట ముగించుకుని ఒడ్డుకు చేరుకుంటున్న మత్స్యకారులు ఇలా సాక్షి కెమెరాకు చిక్కారు.



రక్షణ మంత్రం



మొక్కల సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పలు సంరక్షణ చర్యలు చేపడుతోంది. పశువుల నుంచి రక్షణ కోసం పచ్చటి క్లాత్‌ను మొక్కల చుట్టూ ఏర్పాటు చేయిస్తోంది. గార మండలం మంగళవారంపేటకు వెళ్లే దారిలో సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా మొక్కలకు ఇలా పచ్చటి క్లాత్‌ను చుట్టి రక్షణ ఏర్పాట్లు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

ఇంటి అందాలకు మ్యూరల్ కళ

- వాల్ మ్యూరల్ వర్క్‌పై జిల్లా వాసులు ఆసక్తి
- అటు గృహాలు.. ఇటు భారీ నిర్మాణాల్లో కళాత్మక రూపాలు
- కళాకారులకు దొరుకుతున్న ఉపాధి

టెక్కలి: గృహమే కదా స్వర్గ సీమ అన్నాడో కవి. ఆ గృహాన్ని స్వర్గంగా మార్చేందుకు మేమున్నామంటున్నారు వాల్ మ్యూరల్ కళాకారులు. ఇంటిని సర్వాంగ సుందరంగా తమ హస్తకళతో కళకళలాడేలా చేయడమే తమ బాధ్యతని చెబుతున్నారు. గృహ యజమానుల అభిరుచులకు అనుగుణంగా మనసుదోచేలా గోడలపై చిత్రరాజాల్ని తీర్చిదిద్దుతున్నారు. అయితే ఇది కాస్త ఖరీదైన వ్యవహారమే అయినప్పటికీ గృహశోభకు ప్రాధాన్యమిచ్చే వారు దీనిపై మొగ్గు చూపుతున్నారు.

ఒకప్పుడు కుడ్య చిత్రాలు రాజ్యమేలాయి. వాటి స్థానంలో నేటి ఆధునిక యుగంలో సరికొత్తగా వాల్ మ్యూరల్ పెయింటింగ్స్, ఎంబోజింగ్, కాన్వాస్ తదితర చిత్రాలు స్థానం సంపాదించుకున్నాయి. ప్రస్తుతం ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చులో సగ భాగాన్ని ఈ వాల్ మ్యూరల్ పెయింటింగ్స్‌కు ఖర్చు చేస్తున్నారు. ఇంటి యజమానుల అభిరుచులకు అనుగుణంగా గోడలపై అందమైన ఆర్ట్‌తో తీర్చిదిద్దుతూ జీవనోపాధి సాగిస్తున్నారు వాల్ మ్యూరల్ కళాకారులు.



టెక్కలిలో ఓ రెస్టారెంట్ గోడపై ఎంబోజింగ్ వర్క్

కాదేదీ అనర్హం..

గోడైన.. మేడైనా.. గేటైనా.. సన్‌షేడైనా కాదేదీ వాల్ మ్యూరల్ వర్క్‌కు అనర్హం అన్నట్టు తీర్చిదిద్దుతున్నారు. గృహ యజమాని అభిరుచులకు అనుగుణంగా వారు ఆరాధించే దైవం నుంచి వారి జాతక రాశుల వరకు ఎలాంటి డిజైనైనా తయారు చేసి గోడల్ని తళుక్కుమనేలా చేస్తున్నారు. కొందరైతే ఏనుగులు, విఘ్నేశ్వరుడు వంటి సెంటిమెంట్ రూపాలను తయారు చేయించుకుంటున్నారు. వీటితో గృహశోభ పెరగడంతో పాటు కళాకారులకు ఉపాధి దొరుకుతోంది.

ఏం ఉపయోగిస్తారు..

- సిమెంట్, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, ఖరీదైన పెయింట్స్‌ను వాల్ మ్యూరల్ కోసం వినియోగిస్తున్నారు.
- కొందరైతే ఏకంగా రామాయణ, మహాభారతాల్లోని కొన్ని ఘట్టాల్ని కూడా విశాలమైన భవనాల గోడలపై ఏర్పాటు చేయించుకుంటున్నారు.
- కళాకారులు గదిని బట్టి వివిధ డిజైన్లను రెడీ చేస్తున్నారు. బెడ్ రూమ్‌కైతే ఒకలా.. హాల్‌కు వేరేలా.. దేవుడి గదికి మరోలా.. డిజైన్లను రూపొందిస్తున్నారు.
- పెయింటింగ్ చేయాల్సిన ప్రదేశం, కొలతలు, డిజైన్ బట్టి ధర ఉంటుందని చెబుతున్నారు కళాకారులు.

హస్తకళలను బ్రతికించాలి..




ఒకప్పుడు హస్త కళలకు ఎంతో ప్రాధాన్యం ఉండేది. కాలంతో పాటు హస్తకళలు కనుమరుగవుతున్నాయి. ఇప్పుడు వాల్ మ్యూరల్ పెయింటింగ్స్‌లో భాగంగా ఎంబోజింగ్, వాల్ పెయింట్స్, 3డీ పెయింటింగ్స్‌కు చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. ఎంబోజింగ్ చిత్రాలకు పూర్తిగా సిమెంట్‌ను ఉపయోగిస్తున్నాం. దీనివల్ల ఆయా చిత్రాలు ఎక్కువ రోజులు ఉంటాయి. అంతే కాకుండా ఇంటి యజమానుల అభిరుచులకు అనుగుణంగా గోడలపై ఇటువంటి చిత్రాలు వేయడం వలన వారు మానసిక ఆనందాన్ని పొందుతున్నారు.

– జి.మీనాకుమార్, వాల్ మ్యూరల్ కళాకారుడు, టెక్కలి.



టెక్కలిలో ఓ ఇంటి బయట గోడలపై వేసిన పంచభూతాల ఎంబోజింగ్ వర్క్



ఓ ఇంటి బయట గోడలపై వేసిన బుద్ధుడు



ఎంబోజింగ్ వర్క్‌లో ఎలిఫెంట్

క్లుప్తంగా

జాతీయ మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడిగా పోలీసు



మైలపల్లి పోలీసుకు నియామక పత్రం అందిస్తున్న మంత్రి అప్పలరాజు

అరసవల్లి: జాతీయ మత్స్యకార సంఘం (నాఫ్) జిల్లా అధ్యక్షుడిగా మైలపల్లి పోలీసు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం నాఫ్ ఏపీ రాష్ట్ర మత్స్యకార సంఘ అధ్యక్షుడు మోస అప్పలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం మండలం పెదగణగళ్లవానిపేటకు చెందిన పోలీసు జిల్లాలో దశాబ్దకాలం నుంచి మత్స్యకారుల సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు విన్నవిస్తున్నారు. ఓ వైపు ఎస్టీ సాధన సమితి, మరోవైపు బీసీ సంఘంలో ఆర్గనైజింగ్ సెక్రటరీగా కూడా సేవలందించారు. పోలీసుకు జాతీయ సంఘం తరపున కీలక పదవి వరించడంపై ఆయా వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. కొత్త అధ్యక్షుడు పోలీసు తదితరులు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మత్స్యకారులందరికీ సంక్షేమం అందించేలా కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షిస్తూ జిల్లా అధ్యక్ష పదవి పత్రాన్ని పోలీసుకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార సంఘ అధ్యక్షుడు మోస అప్పలరాజు, జిల్లా మత్స్యకార సహకార సంఘ అధ్యక్షుడు కోనాడ నరిసింగరావు తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీలకు కేజీబీవీ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ఎస్ఓ, పీఈటీ

కోటబొమ్మాళి: రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీలకు కోటబొమ్మాళి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి చెందిన 9, 10వ తరగతి విద్యార్థినులు కె.జ్యోత్స్న, డి.హేమలత, పి.దివ్య, కె.సమీర, పి.ఇందు, పి.ప్రవల్లిక, సీనియర్ విభాగంలో ఇంటర్మీడియెట్ విద్యార్థిని యు.పావని ఎంపికైనట్లు ఎస్ఓ పి.వెంకటరత్నం, పీఈటీ ఆర్.రమణమ్మ తెలిపారు. వీరిని గురువారం అభినందించారు. ఇటీవల టెక్కలిలో జరిగిన జిల్లాస్థాయి ఎంపికల్లో వీరంతా ప్రతిభ కనబరచడంతో ఈ నెల 29, 30 తేదీల్లో విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు.

తాపీమేస్త్రి అదృశ్యం



పొందర శ్రీనివాసరావు (ఫైల్)

కాశీబుగ్గ: పలాస మండలం గొప్పిలి గ్రామానికి చెందిన పొందర శ్రీనివాసరావు(44) ఈ నెల 19 నుంచి కనిపించడం లేదని అతని భార్య పొందర మమత గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పలాస మండలం లొత్తూరు గిరిజన ప్రాంతంలోని వరహాల గెడ్డ రిజర్వాయర్ వద్ద తన భర్త ద్విచక్ర వాహనాన్ని కొందరు గుర్తించారని, అక్కడికి వెళ్లి వెతికినా ఆచూకీ దొరకలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. వివరాలు తెలిస్తే 81420 35576 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	50,380–00
బంగారం(22సి. 10గ్రా.)	46,460–00
వెండి (కిలో)	60,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 445.00
విజయనగరం	రూ. 449.00
శ్రీకాకుళం	రూ. 449.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹165	₹ 185

బుడితి.. నలుదిశలా ఖ్యాతి



నవరత్నాలు లోగోలతో తయారు చేసిన ఫ్లవర్ వాజ్

- నాణ్యమైన కంచు, ఇత్తడి వస్తువులకు కేరాఫ్ అడ్రస్‌గా బుడితి
- చెంబు నుంచి భారీ దేవతా విగ్రహాల వరకు తయారీ
- రాష్ట్ర సచివాలయంలోనూ కొలువుదీరిన వస్తువులు
- 7వ తరగతి పాఠ్యపుస్తకంలో బుడితి ప్రస్తావన



యంత్రంతో మెరుగుపడుతున్న కార్మికుడు

సారవకోట: నాణ్యమైన కంచు, ఇత్తడి వస్తువులంటే టక్కున గుర్తుకు వచ్చే పేరు సారవకోట మండలం బుడితి. మన రాష్ట్రంలోనే కాకుండా ఒడిశా, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ వంటి ప్రాంతాల్లోనే ఇక్కడి ఉత్పత్తులకు గిరాకీ ఎక్కువ. ముఖ్యంగా పొరుగు రాష్ట్రాల దేవాలయాలకు ఇక్కడి నుంచే దేవతా విగ్రహాలు తయారు చేసి పంపిస్తుంటారు. శతాబ్దిన్నర క్రితమే ఇక్కడ ఇత్తడి పరిశ్రమ ప్రారంభం కాగా గ్రామంలో 30 శాతం జనాభా ఈ వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నారు.

లేపాక్షి ద్వారా ఆర్డర్లు..

ఇక్కడ తయారైన వస్తువులు లేపాక్షి సంస్థ కొనుగోలు చేస్తుంది. దేశవ్యాప్తంగా జరుగుతున్న వస్తు ప్రదర్శనలకు తీసుకెళ్తుంటుంది. అయితే ఆర్డర్ చేసే సమయంలో అడ్వాన్స్‌గా తక్కువ మొత్తం చెల్లిస్తుండటంతో ఇక్కడి కార్మికులు వస్తువులు తయారు చేయడానికి తగిన పెట్టుబడి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య పరిష్కారమైతే ఆసరాగా ఉంటుందని కార్మికులు చెబుతున్నారు.

ఆర్డర్ల వెల్లువ..

తాత ముత్తాల నుంచి ఇక్కడ ఇత్తడి వస్తువులు తయారు చేస్తున్నారు. కేవలం దేవతా విగ్రహాలే కాకుండా ఇత్తడి బిందెలు, మకర తోరణాలు, గంటలు భారీగా అమ్ముడుపోతుంటాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఆర్డర్లు ఇచ్చి వస్తువులను వారి అభిరుచికి అనుగుణంగా తయారు చేయించుకుని వెళ్తుంటారు. స్థానిక విశ్వబ్రహ్మణులు అప్పట్లో బంగారం పనులు చేస్తుండేవారు. అనంతరం కంచు, ఇత్తడి వస్తువుల తయారీపై దృష్టి సారించి పరిశ్రమను అభివృద్ధి చేశారు. ముడిసరుకులను కోలకతా, చెన్నై, ముంబై వంటి ప్రాంతాల నుంచి తెప్పించుకుని వస్తువులను తయారు చేస్తున్నారు.



బుడితి నుంచి రాష్ట్ర సచివాలయానికి..

బుడితి గ్రామంలో తయారైన వస్తువులు రాష్ట్ర సచివాలయంలో కొలువుదీరాయి. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నాడు 108 కలశాలను గ్రామానికి చెందిన కింతాడ అప్పారావు, కుమారుడు బుజ్జి తయారు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలకు లోగోలతో కూడిన ఫ్లవర్ వాజ్‌లు కలెక్టర్ సూచనతో తయారు చేసి పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రచురించిన 7వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్య పుస్తకంలో బుడితి స్థానం సంపాదించుకుంది. గ్రామానికి చెందిన అద్దాల సూర్యకళ కంచు, ఇత్తడి పరిశ్రమలో ఏ విధంగా రాణిస్తున్నారో తెలియజేస్తూ ప్రత్యేక కథనం ప్రచురించారు.

ఇంకో పని తెలీదు..



తాతముత్తాతల నుంచి ఈ పనిపైనే ఆధారపడి జీవిస్తున్నాం. చిన్న కుటీర పరిశ్రమగా చేసుకుని నలుగురు కార్మికులతో కలిసి పని చేస్తున్నాం. ఇదే పనిని వృత్తిగా చేసుకుందామని ప్రస్తుత యువతరం ముందుకు రావడం లేదు.

– కింతాడ బుజ్జి, కంచు, ఇత్తడి కార్మికుడు, బుడితి

నాబార్డు సహాయంతో..



నాబార్డు వారు గతంలో వస్తువుల తయారీపై శిక్షణ ఇచ్చారు. వారిచ్చిన రుణం తీసుకుని కంచు, ఇత్తడి పరిశ్రమను అభివృద్ధి చేశాం. లేపాక్షి ప్రతినిధులు ఇచ్చిన ఆర్డర్ల మేరకు వస్తువులు సరఫరా చేస్తున్నాం. ప్రస్తుతం ఆర్థిక పరిస్థితి బాగానే ఉంది.

– అద్దాల సూర్యకళ, బుడితి

టెక్కలి బస్ కాంప్లెక్స్‌లో ఈవ్‌టీజింగ్!

- రెండు రోజుల క్రితం విద్యార్థినులకు వేధింపులు
- ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థుల మధ్య తగాదాలు
- పోలీసుల చొరవతో సద్దుమణిగిన వివాదం



టెక్కలి బస్ కాంప్లెక్స్

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలి బస్ కాంప్లెక్స్‌లో విద్యార్థినులకు కొందరు ఈవ్‌టీజింగ్ చేస్తున్నారు. కొద్దిరోజులుగా ఇటువంటి ఘటనలు జరుగుతున్నప్పటికీ కట్టడి చర్యలు లేకపోవడంతో ఆకతాయిలు మరింత రెచ్చిపోతున్నారు. రెండు రోజుల క్రితం ప్రభుత్వ కళాశాలకు చెందిన విద్యార్థినులను కొంత మంది ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు వేధించడంతో తగాదాలు చోటు చేసుకున్నాయి. విద్యార్థులంతా టెక్కలి పోలీసుల ఎదుట పంచాయితీ పెట్టడంతో సమస్య ప్రస్తుతానికి సద్దుమణిగింది. అయితే ప్రతిరోజు సాయంత్రం వేళల్లో కాంప్లెక్స్ ఆవరణలో ఇటువంటి ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. టెక్కలి చుట్టు ప్రక్కల గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిరోజూ విద్యార్థినులు డివిజన్ కేంద్రంలోని విద్యా సంస్థలకు రాకపోకలు సాగిస్తుంటారు. సాయంత్రం కాంప్లెక్స్‌కు చేరుకునే సమయానికి కొంత మంది ఆకతాయిలు విద్యార్థినులను వేధిస్తున్నారు. వీటితో పాటు మరి కొన్ని ప్రైవేట్ వాహనాలు కాంప్లెక్స్ ఆవరణలో తిష్ట వేయడంతో ఆయా వాహనాల్లోకి చేరి, కాంప్లెక్స్‌కు వచ్చే పోయే విద్యార్థినులు, మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో కాంపెక్స్‌కు వెళ్లాలంటేనే విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ఆకతాయిలను కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

పొట్టేళ్ల పెంపకం లాభదాయకం



మాట్లాడుతున్న డీపీఎం సన్యాసినాయుడు

నరసన్నపేట: మహిళల్లో జీవనోపాధి మెరుగుకు, కుటుంబానికి అదనపు ఆదాయం పెంపుదలకు పొట్టేళ్ల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, స్వయం సహాయక సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ లైవ్ స్టాక్ యూనిట్ డీపీఎం ఎం.సన్యాసినాయుడు కోరారు. నరసన్నపేటలోని వెలుగు కార్యాలయంలో సీఎఫ్‌లు, సీసీలతో సమావేశం నిర్వహించి ఈ పొట్టేళ్ల యూనిట్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత డబ్బుతో మహిళల్లో జీవనోపాధి పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. దీనిలో పొట్టేళ్ల పెంపకం ఒకటని, ఒక్కో యూనిట్ ధర రూ. 50 వేలని, 90 కేజీల బరువు కలిగిన 7 పొట్టేళ్ల పిల్లలను సరఫరా చేస్తామని వివరించారు. సమావేశంలో ఏపీ కొండలరావు సీసీ, సీఎఫ్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వరి తెగుళ్లపై అప్రమత్తత అవసరం



వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

మందస: వరిని ఆశించే సుడిదోమపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విద్యాలయం(ఆమదాలవలస) ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్తలు పి.వెంకటరావు, జి.సూర్యనారాయణ, చిట్టిబాబు సూచించారు. మందస మండలం బిన్నళమదనాపురం, బాలిగాం, వెంకట వరదరాజపురం తదితర గ్రామాల్లో గురువారం పర్యటించారు. వరి పైరును ఆశిస్తున్న సుడిదోమ, అగ్గితెగులు, పాముపొడ, ఆకుముడత తెగుళ్లకు సంబంధించి వ్యవసాయ క్షేత్రంలో విద్యార్థులకు, రైతులకు సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం బిన్నళమదనాపురంలో రైతులు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ డొక్కరి దానయ్య మాట్లాడుతూ వరి తెగుళ్ల నివారణకు, రైతులకు సూచనలిచ్చేందుకు శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏడీఓ లింగాల వెంకటమధు, వ్యవసాయాధికారి జి.నాగరాజు మాట్లాడుతూ ఈ-క్రాపింగ్, సోషల్ ఆడిట్ జాబితాలు ఈ నెల 27 నుంచి ఆర్బీకేల్లో ప్రదర్శిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మార్పు భవాని, శనాపతి దివ్య, బాలిగాం పీఏసీఎస్ అధ్యక్షుడు సార్ర ఢిల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మార్పు కృష్ణమూర్తి, సవర బాలకృష్ణ, వ్యవసాయ విస్తరణాధికారి బల్లు జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్: పట్టణంలోని బుచ్చిపేట వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ వ్యక్తికి గాయాలైనట్లు ట్రాఫిక్ ఎస్ఐ పి.వి.రమణ తెలిపారు. బుధవారం రాత్రి మడ్డివీధికి చెందిన పూలబాటి లింగరాజుదేవ్ (32) పాలు ప్యాకెట్ కొందామని కొత్త రోడ్డు వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్రవాహనదారుడు ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయాడు. ఈ ఘటనలో కుడికాలుకు తీవ్రగాయం కావడంతో రిమ్స్‌కు తరలించారు. గురువారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని..

శ్రీకాకుళం క్రైమ్: పట్టణంలోని రెల్లివీధి వద్ద నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని ద్విచక్రవాహనదారుడు ఢీకొనడంతో తీవ్ర గాయాలైనట్లు ట్రాఫిక్ ఎస్ఐ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆమదాలవలసకు చెందిన జలగడుగుల శ్రీనివాసరావు (49) తమ బంధువుల ఇంటికి వెళ్దామని పెద్ద రెల్లివీధికి బుధవారం రాత్రి నడుచుకుంటూ వెళ్తుండగా.. ఏడురోడ్ల కూడలి నుంచి వస్తున్న ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ఘటనలో బాధితుని తల, కళ్లు, ముక్కుకు గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్సులో రిమ్స్‌కు తరలించారు. బాధితుడు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధురాలికి..

నందిగాం: మండలంలోని లట్టిగాం సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలాస మండలం సూదికొండకు చెందిన పంచికర్ల మంగమ్మ(50) గాయపడింది. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగమ వృత్తిలో భాగంగా పలాసలో బస్సు ఎక్కి లట్టిగాం వద్ద దిగి పెద్దలవునిపల్లి నడిచి వెళ్తుండగా పలాస నుంచి టెక్కలి వైపు వస్తున్న ద్విచక్ర వాహనం అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో మంగమ్మ తీవ్రంగా గాయపడటంతో జాతీయ రహదారి అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. నందిగాం ఎస్సై అమిర్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహేతర సంబంధమే హత్యకు కారణం



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ (వెనుక నిందితులు)

రాజాం సిటీ: వివాహేతర సంబంధం ఓ నిండు ప్రాణం బలిగొంది. పదేళ్లుగా కొనసాగుతున్న వివాహేతర సంబంధం వదులుకోవాలని చూసినా వినిపించుకోకపోవడంతో పాటు పదిమందిలో తన భర్త అవమానాలకు గురికావడంతో భార్యాభర్తలు పన్నిన పథకంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. సంతకవిటి మండలం మద్దూరుశంకరపేట గ్రామంలో హత్యకు గురైన అల్లబోయిన గోవిందరావు హత్య కేసు మిస్టరీని 24 గంటల్లో పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించి సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఎంఆర్ అగ్రహారానికి చెందిన గోవిందరావు, శంకరపేట గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించేవాడు. ఈ విషయం తెలిసిన ఆమె భర్త పలుమార్లు పెద్దల వద్ద పంచాయితీ పెట్టినప్పటికీ గోవిందరావు వినిపించుకోలేదు. విశాఖపట్నంలో పనిచేస్తూ గ్రామానికి వచ్చిన ప్రతిసారి ఆమెను ఇబ్బందులకు గురిచేసేవాడు. ఇదిలా ఉండగా గోవిందరావు ఎప్పటికప్పుడు ఆమె భర్తను అవహేళనచేస్తూ అవమానకరంగా ప్రవర్తించేవాడు. దీనిని భరించలేకపోయిన భార్యాభర్తలు గోవిందరావును హతమార్చేందుకు పథకం పన్నారు. ఈ మేరకు ఐదు రోజుల క్రితం గ్రామానికి వచ్చిన గోవిందరావును హత్య చేసేందుకు జంతువుల వేటకు ఉపయోగించే విధంగా జీఐ వైరుకు విద్యుత్‌షాక్ వచ్చేలా ఏర్పాటు చేశారు. తమ ఇంటికి వస్తున్న దారిలో జీఐ వైరు కట్టి దానికి విద్యుత్ సరఫరా అయ్యేలా చేశారు. ఇలా ప్రతి రోజూ రాత్రి ఏర్పాటుచేసి ఉదయం తీసేసేవారు. చివరికి ఈ నెల 25న రాత్రి శంకరరావు తన భార్యతో ఫోన్ చేయించి గోవిందరావును ఇంటికి రప్పించాడు. ఇంటికి వచ్చిన గోవిందరావు జీఐ వైరు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయమై అందిన సమాచారం మేరకు డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం సహాయంతో దర్యాప్తు చేసి నిందితులుగా భార్యభర్తలను నిర్ధారించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ వెల్లడించారు. సమావేశంలో ఆయనతోపాటు సంతకవిటి ఎస్సై ఆర్.జనార్దనరావు, లోకేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

గోగు సాగుకు పూర్వ వైభవం!

- ప్లాస్టిక్ నిషేధం అమలుతో జూట్ ఉత్పత్తులకు గిరాకీ
- ఆశల పల్లకిలో రైతులు



జనపనార తీస్తున్న మహిళలు

ఊపిరిపోసిన ప్రభుత్వ ప్రకటన..

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి సారించింది. ముఖ్యంగా ప్లాస్టిక్ సంచులు, పాలిథిన్ కవర్ల వాడకంపై నిషేధం అమలవుతోంది. శ్రీకాకుళంలోనూ నవంబర్ 1 నుంచి ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలుకానుంది. ఈ నేపథ్యంలో మళ్లీ జనుముతో కూడిన ఉత్పత్తులకు గిరాకీ పెరిగే అవకాశముందని రైతులు భావిస్తున్నారు. ఇప్పటికప్పుడు డిమాండ్ లేకపోయినా భవిష్యత్తులో కచ్చితంగా జూట్ ఉత్పత్తులకు ఆదరణ తప్పక ఉంటుందని చెబుతున్నారు.

కోటబొమ్మాళి: ఒకప్పుడు ఎక్కడ చూసినా గోగుసాగే కనిపించేది. జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో జనుము పండించేవారు. గోనెసంచులకు ముడిసరుకు కావడం, స్థానికంగా జూట్‌మిల్లులు ఉండటంతో రైతులు కూడా సాగుకు ఆసక్తి చూపేవారు. సాగు, నారతీత కాస్త ప్రయాసతో కూడినదైనప్పటికీ అధిక విస్తీర్ణంలోనే జనుము సాగయ్యేది. అయితే ప్రపంచీకరణ, ఆధునిక జీవనశైలి ప్రభావం అన్నిరంగాల మాదిరిగానే గోగు సాగుపైనా పడింది. జనం ప్లాస్టిక్ సంచులు, పాలిథిన్ కవర్లకు అలవాటుపడ్డారు. ఫలితంగా గోనెసంచులకు గిరాకీ తగ్గింది. సాగు కూడా అంతంతమాత్రంగానే ఉంటోంది.

నార తీత పనుల్లో రైతులు..

జిల్లాలో 700 ఎకరాల్లో గోగు సాగవుతోంది. ఆమదాలవలస, సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట, జలుమూరు, సారవకోట, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, హిరమండలం, నరసన్నపేట, శ్రీకాకుళం మండలాల్లో అధిక విస్తీర్ణంలో జనుము పండిస్తున్నారు. కోటబొమ్మాళి మండలంలోని గంగుపేట, కస్తూరిపాడు, దుప్పలపాడు, రేగులపాడు, కొప్పలపేట, జర్జంగి, కొబ్బరిచెట్లపేట, పొడుగుపాడు, బిర్లంగి, విశ్వనాథపురం తదితర గ్రామాల్లో విస్తారంగా జనుము సాగులో ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో జనపనారును నానబెట్టేందుకు అనుకూలంగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. పంట చివరిదశకు చేరడంతో రైతులంతా జనుమును తీసి సమీప చెరువుల్లో వారంరోజులు నానబెట్టి నారును తీస్తున్నారు. ఇలా తీసిన నారును శుభ్రపరిచి జిల్లాలోని సుమారు 15 జూట్ మిల్లులకు అమ్ముతుంటారు. అక్కడ గోనె సంచులు తయారు చేస్తుంటారు. పలు రకాల వస్తువులు కూడా తయారు చేస్తారు. నారు తీయగా మిగిలిన జనుము కర్రలను స్థానికంగా వంటచెరుకుగా ఉపయోగిస్తుంటారు.

గోగు తీతకు యంత్రాలు

ఇప్పటి వరకు గోగు సాగుకు నిర్వహణ, కూలీల ఛార్జీల ఎక్కువయ్యేది. అందుకే సాగుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు. ప్రస్తుతం గోగు తీతకు అధునాతన యంత్రాలు అందుబాటులో వచ్చాయి. కోల్‌కతాలో ఉన్న ఆ యంత్రాలు త్వరలో మన జిల్లాకు వచ్చే అవకాశముంది. వీటి ద్వారా గణనీయంగా ఖర్చు తగ్గుతుంది. ప్లాస్టిక్ నిషేధం కూడా అమలుకానుండటంతో గోగు సాగు మళ్లీ పెరిగే అవకాశముంది.

– బి.వి.తిరుమలరావు, వ్యవసాయ శాఖ ఏడీ, టెక్కలి

అదే ఆశతో ఉన్నాం..



జనుము పంట ప్రస్తుతం గిట్టుబాటు లేకపోయినా ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధిస్తే గోగుతో తయారైన సంచులు, ఉత్పత్తులకు గిరాకీ ఉంటుందని భావిస్తున్నాం. అదే ఆశతో సాగు చేస్తున్నాం. ప్రస్తుతం ఎకరా భూమిలో గోగు పండించాం. గోగునారు సిద్ధం చేసి నిల్వ ఉంచి గిట్టుబాటు ధర లభిస్తే జూట్ మిల్లుకు అమ్ముతాం.

– దుప్పల మోహన, గోగు రైతు, కస్తూరిపాడు, కోటబొమ్మాళి మండలం

ప్రోత్సహించాలి..



ప్లాస్టిక్ నిషేధం పకడ్బందీగా అమలు చేస్తే తప్పకుండా గోగునారుకు గిరాకీ వస్తుంది. ప్రభుత్వం కూడా గోగుసాగును ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడే మరింత మంది గోగు సాగు చేసేందుకు ముందుకు వస్తారు. ప్రస్తుతం గోగుపంటను చెరువుల్లో నానబెట్టి నారు తీసి సిద్ధం చేస్తున్నాం.

– కణితి చలపతిరావు, గోగు రైతు, దుప్పలపాడు, కోటబొమ్మాళి మండలం

క్లుప్తంగా

సమగ్రంగా ఈ-పంట నమోదు



ఆనందపురంలో పంట నమోదును పరిశీలిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

జి.సిగడాం: అగ్రికల్చర్ అసిస్టెంట్లు చేపట్టిన ఈ-క్రాప్ నమోదు సమగ్రంగా ఉండాలని రణస్థలం వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురం, వాండ్రంగి, సంతవురిటి గ్రామాల్లో ఇటీవల చేపట్టిన ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను గురువారం పరిశీలించారు. రైతులు పండించే ప్రతి పంటకు తప్పనిసరిగా పంట నమోదుతోపాటు ఈకేవైసీ చేయించామన్నారు. డివిజన్ పరిధిలో పూర్తిస్థాయిలో పంటల నమోదు చేయించామన్నారు. ఈ-పంట నమోదుతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారిణి వై.శారద, సర్పంచ్ చిత్తిరి మోహన్, వీఆర్వో సంతోష్‌కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు అలుగోలు లక్ష్మీనారాయణ, ముంతా హేమంత్‌కుమార్, కె.కోటేశ్వరరావు ఉన్నారు.

బాబా ఆలయాల్లో అన్నదానం



ఆనందపురంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

జి.సిగడాం: కార్తీకమాసం మొదటి గురువారం సందర్భంగా ఆనందపురం, పెంట, ఎందువ, గెద్దకంచరాం, దేవరవలస గ్రామాల్లోని షిర్డీ సాయిబాబా ఆలయాల ప్రాంగణంలో భారీ అన్నదానం నిర్వహించారు. సుమారు పది వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. అలాగే ఉదయం ఐదు గంటల నుంచే భక్తులకు బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఈ-క్రాప్ నమోదు జాబితాల ప్రదర్శన

రణస్థలం: రైతులు నమోదు చేసుకున్న ఈ-క్రాప్ నమోదు జాబితాలను మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాల వద్ద శుక్రవారం నుంచి ప్రదర్శిస్తామని మండల వ్యవసాయశాఖాధికారి డి.విజయ భాస్కరరావు తెలిపారు. చేర్పులు, మార్పులకు మూడు రోజులు సమయం ఇస్తామన్నారు. రైతులు తమ పరిధిలోని కేంద్రాలకు వెళ్లి వివరాలను సరిచూసుకోవాలని సూచించారు.

గోవిందపురంలో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

లావేరు: ఫ్యామిలీ డాక్టరు విధానంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని గోవిందపురం పంచాయతీ సర్పంచ్ పిల్లా రాము అన్నారు. గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యులు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.లక్ష్మీనారాయణ, సచివాలయం ఏఎన్ఎం ఎస్.రమణమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుళాయి పనులకు భూమి పూజ



పనులకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

లావేరు: జలజీవన్ మిషన్ ద్వారా చినకొత్తకోట గ్రామంలో ఇంటింటికీ మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, కొత్తకోట పంచాయితీ సర్పంచ్ శాంతాటి భాస్కరరావు అన్నారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా నిధులు మంజూరు కావడంతో పనులకు గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు వేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుమ్మడి దుర్గారావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

సారవకోట: ఉపాధిహామీ పథకం ద్వారా రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను సంరక్షించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి.బుచ్చిరాజు సూచించారు. మాకివలస నుంచి మర్రివలస వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు.

సమస్యల పరిష్కారం దిశగా అడుగులు



ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- జేఆర్‌పురంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రణస్థలం: ప్రజలకు సంక్షేమ పథకాలను చేరువ చేయడంతోపాటు గడప గడపలో ఉన్న సమస్యలు పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. జె.ఆర్.పురం-2 గ్రామ సచివాలయ పరిధిలోని సంతోషిమాత, కన్యకాపరమేశ్వర గుడి వీధుల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. 267 గడపలకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన మూడున్నరేళ్లలో అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఇంకా ఏమైన సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కాలువలు నిర్మించాలని, సీసీ రోడ్లు వేయాలని, జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారం జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే స్థానికంగా ఉన్న పీవీఆర్ రామ్మోహన్ ఆస్పత్రి వ్యర్థాలు, వాడుకనీరు వీధుల్లోకి వదిలేయడంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ ఆస్పత్రికి వెళ్లి వ్యర్థాలు, వాడుకనీరు వీధుల్లోకి వెళ్లకుండా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలని, లేదంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రి వ్యర్థాలు బయటకు విడిచిపెట్టి ప్రజల ఆరోగ్యంతో ఆటలాడడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, మండల బూత్ కన్వీనర్ చిల్లా వెంకటరెడ్డి, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, మండల నాయకులు పెదరామినాయుడు, మైలపల్లి కామరాజు, గొర్లె అప్పలనర్సునాయుడు, చినరామినాయుడు, పిల్లా ఆనందరావు పాత్రుడు, గ్రామ నాయకులు పచ్చిగుళ్ల సాయిరాం, దన్నాన సీతారాం, పిన్నింటి సత్యంనాయుడు, ఇ.తిరుపతిరాజు, టేకి బ్రహ్మాజీ, రాయిపురెడ్డి శ్రీనివాసరావు, అధికారులు, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. జగనన్న హరిత వనం కార్యక్రమంలో భాగంగా నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న గాంధీ మందిరం ఆవరణలో మున్సిపాలిటీ హార్టికల్చర్ అధికారి చిన్నారావు ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటి ట్రీ గార్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ ప్రతీ కాలనీలో స్థానికులతో కలిసి మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు జామి భీమశంకర్, నటుకుల మోహన్, బాడాన దేవభూషణం తదితరులు మాట్లాడుతూ పర్యావరణ హితం కోరే ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో మొక్కలు నాటడంతో పాటు సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు మహిబుల్లాఖాన్, పందిరి అప్పారావు, మెట్ట అనంతంభట్లు, గుత్తు చిన్నారావు, ఆలుగుబిల్లి నాగభూషణం, నక్క శంకరరావు, యవ్వారి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

నీలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో షిర్డీ సాయినాథుడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పెద్ద బరాటం వీధిలో వేంచేసిన నీలమ్మతల్లి అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెంట కిరణ్‌శర్మ నేతృత్వంలో అమ్మవారికి పసుపు నీళ్లతో అష్టోత్తర, శతనామాలతో పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయం ధర్మకర్త బరాటం సాయిరాజ్, భక్తులు పాల్గొన్నారు.

షిర్డీ సాయినాథునికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక జెడ్పీ ఎదురుగా ఉన్న ఏపీహెచ్‌బీ కాలనీలోని షిర్డీ సాయి సేవా సంఘం ఆధ్వర్యంలో సాయినాథునికి ప్రత్యేక పూజలు గురువారం జరిగాయి. ఆలయ అర్చకులు పెంట శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉదయం అభిషేకాలు, మూడు రకాల హారతులతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు



పోలీసుల సమక్షంలో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

బూర్జ: ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్.రమణారావు హెచ్చరించారు. సింగన్నపాలెం గ్రామ పరిధిలోని గ్రామ కంఠాన్ని లచ్చయ్యపేట గ్రామస్తులు ఇటీవల ఆక్రమించుకున్నారు. అయితే అదే స్థలంలో రెవెన్యూ సిబ్బంది జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. దీంతో రెవెన్యూ సిబ్బంది ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ తొలగించకపోవడంతో తహసీల్దార్ ఎస్.రమణారావు, రెవెన్యూ సిబ్బంది, పోలీసుల సహాయంతో ఆక్రమణదారులకు గురువారం 6-ఏ నోటీసులు ఇచ్చి తొలగించారు ఈ సందర్భంగా లచ్చయ్యపేట గ్రామ సర్పంచ్ ఎస్.ఉదయకుమార్ మాట్లాడుతూ.. రెండు గ్రామాలకు సరిహద్దులో గ్రామ కంఠ స్థలం ఉండడంతో ఆక్రమణలకు గురైందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

పొందూరులో సమగ్ర భూసర్వే

పొందూరు: పొందూరులోని 196 సర్వే నంబర్‌లో మేరకు పంచాయతీ, రెవెన్యూ, సర్వేశాఖ అధికారులు గురువారం సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ సర్వే నంబర్‌లో అత్యంత విలువైన 15.62 ఎకరాల భూమి ఉంది. ఇదే సర్వే నంబర్‌లో సీహెచ్‌సీ, బాలికల వసతిగృహాలు, కాలనీ ఉంది. మిగిలిన స్థలాలను పలువురు ఆక్రమించుకుని ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడంతో పాటు తప్పుడు పత్రాలతో ఆక్రమణకు పాల్పడుతున్నట్లు ఇటీవల పలువురు గ్రామస్తులతో పాటు సర్పంచ్ రేగిడి లక్ష్మి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక ఇవ్వాలని అధికారులు ఆదేశించారు. దీంతో ఈవో జనార్దన రావు, మండల సర్వేయర్ డీడీ పాత్రో, వీఆర్వోలు రేవతిరావు, కె.వేణు ఆధ్వర్యంలో అధికారులు 196 సర్వే నంబరులో హద్దులను గుర్తించారు. సంబంధిత నివేదికలను ఉన్నతాధికారులకు అప్పగిస్తామని తెలిపారు.

పట్టభద్రుల ఓట్లు నమోదుపై అవగాహన

జి.సిగడాం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన ఓటర్లతో శరవేగంతో ఓట్లు నమోదు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సీతంపేట, మెట్టవలస, సేతుభీమవరం, జాడ, డి.ఆర్.వలస, పెంట గ్రామాల్లో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు డొల వెంకటరమణ, బాలి అప్పలసూరి తదితరులు గురువారం పర్యటించి పట్టభద్రులకు అవగాహన కల్పించారు. 2019 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఓటరుగా చేరాలని సూచించారు. నాయకులు తొత్తడి రామారావు, దకర కృష్ణ, పెద్ది శ్రీనివాసరావు, పున్నాన అక్కలనాయుడు, మక్క శ్రీనివాసరావు, మల్లిబాబు, నారాయణరావు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల వినియోగంపై వినతి

కొత్తూరు: గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులు ఇతర ఖర్చులకు వినియోగించకుండా చూడాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో బి.చిన్నమ్ముడుకు మండల సర్పంచ్‌లు గురువారం వినతి పత్రం అందజేశారు.

తక్షణ సాయం అందజేత

నరసన్నపేట: స్థానిక కలివరపుపేట వీధికి చెందిన దేవళ్ల ఈశ్వరరావు ఇటీవల మృతి చెందారు. ఈయన కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకంలో తక్షణ సాయంగా పది వేల రూపాయలు మంజూరైంది. ఈ మొత్తాన్ని ఈశ్వరరావు భార్య శ్రావణికి నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్ గురువారం సాయంత్రం అందజేశారు. ఉప సర్పంచ్ కృష్ణబాబు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

పాతపట్నం: గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలతో పాటు ప్రభుత్వ భవనాల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పాలకొండ క్వాలిటీ కంట్రోల్ డీఈఈ సంజీవరావు అన్నారు. పెద్దలోగిడి గ్రామంలో నిర్మిస్తున్న సచివాలయం, ఆర్‌బీకే, బల్క్‌మిల్క్ కేంద్రాల భవనాల పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. జేఈ అమృతరావు, పాతపట్నం పీఆర్ డీఈఈ శివప్రసాద్, జేఈ ప్రసాదరావు, సర్పంచ్ దకర చిన్నారావు, సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

హిరమండలం: చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో కె.రాంబాబు అన్నారు. స్థానిక రామలీల డిగ్రీ కళాశాలలో జరుగుతున్న తర్లా ట్రైనింగ్ కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ అందించిన శిక్షణ, మెటీరియల్ ఎంతో విలువైనదన్నారు. సంస్థ రాష్ట్ర సభ్యుడు ఎస్.హరిబాబు ఉపాధ్యాయులకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ జి.గొల్ల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



బూర్జ: ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించిన నాయకులు

ఎల్.ఎన్.పేట: ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు కోరారు. కరకవలస గ్రామంలో నిర్వహించిన ఆధార్ సేవలను ఈఓపీఆర్డీ జి.శ్యామలాదేవి గురువారం సందర్శించారు. గ్రామాల్లో సాంకేతిక పరమైన సమస్యలు ఉన్నందున ఆధార్ నమోదు ప్రక్రియ వేగవంతం కావటం లేదని.. ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. సర్పంచ్ బలగ లక్ష్మి, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఢిల్లేశ్వరరావు, గ్రామ వలంటీరు బి. దాలిరాజు పాల్గొన్నారు.

పాతపట్నం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆధార్ కార్డులను తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ అన్నారు. కొరసవాడ, సింగుపురం, ఆర్.ఎల్.పురం గ్రామ సచివాలయాల్లోని మొబైల్ ఆధార్ క్యాంప్‌లను పరిశీలించారు. 29 తేదీ వరకు సేవలను అందజేసాతమన్నారు.

జలుమూరు: గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు మెరుగ్గా సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల సేవలు సద్వినియోగం చేసుకోవాలని చల్లవానిపేట పీఏసీఎస్ అధ్యక్షుడు పాగోటి రాజప్పల నాయుడు అన్నారు. గురువారం చల్లవానిపేటలో ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సవర చిన్నారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.విజయ్, మురళీ పాల్గొన్నారు.


సారవకోట: గొర్రిబంద సచివాలయంలో జరుగుతున్న ఆధార్ అప్‌డేట్‌ను ఎంపీడీవో విశ్వేశ్వరరావు పరిశీలించారు. నాలుగు సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ చేస్తున్నామని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గొర్రిబందలో జలజీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన ఇంటింటికీ కుళాయిల ఏర్పాటును పరిశీలించారు.

కొత్తూరు: నివగాం గ్రామ సచివాలయంలోని ఆధార్ సెంటర్‌ను ఎంపీడీవో బి.చిన్నమ్ముడు సందర్శించారు. ఆధార్ కార్డు అప్‌డేట్‌ను వేగవంతం చేయాలని డీఏకు సూచించారు.

బూర్జ: ఓవీపేట గ్రామ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు ప్రారంభించారు. ఈ నెల 31 వరకు ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని.. ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, మండల వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



సారవకోట: ఆధార్ అప్‌డేట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో విశ్వేశ్వరరావు



సమస్యలు తెలుసుకుంటున్న రామ్‌మనోహర్‌నాయుడు

నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు

- ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు
- రామచంద్రాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

గార: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు అన్నారు. మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ జొన్నలపాడు, జొన్నలపాడు కాలనీల్లో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి, ఎంపీటీసీ రుప్ప శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడూతూ దేశంలోనే మన రాష్ట్రంలో పేదలకు అత్యధికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయని పేర్కొన్నారు. పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ సీఎం జగన్ దయతో అన్ని పథకాలు అందుతున్నాయని, తామంతా సీఎం జగన్‌కు, మంత్రి ధర్మాన ప్రసాదరావుకు అండగా ఉంటామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురాం, ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు, కన్వీనర్ పీస శ్రీహరిరావు, వైస్ ఎంపీపీ బరాటం రామశేషు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, పీస గోపి, అంబటి లింగమూర్తి, గొలివి కొండలరావు, శీర సత్యం, గొలివి గోవిందరావు, అరవల రామకృష్ణ, మార్పు పృథ్వీరాజ్, యాళ్ల నారాయణమూర్తి, కొయ్యాన నాగభూషణం, సుంకాన సురేష్, జల్లు గౌరిపతినాయుడు, వమరవల్లి ఉదయభాస్కరరావు, గంగు రామారావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అనర్థం



మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: బాల్య వివాహాలు సమాజానికి అనర్థమని ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మహిళా శిశుసంక్షేమ, విద్యాశాఖ, చైల్డ్ లైన్ సర్వీసెస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు వల్ల అనర్థాలు, బాలల హక్కులపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రామం నుంచి బాల్య వివాహాలపై చైల్డ్‌లైన్ 1098 కాల్ సెంటర్‌కు ఎక్కువగా ఫోన్ కాల్స్ వస్తుండటంతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన వయస్సులో మాత్రమే వివాహాలు చేయాలని సూచించారు. చిన్న వయసులోనే పెళ్లి చేసుకోవడం వల్ల విలువైన భవిష్యత్తు కోల్పోవటం, ఆరోగ్య సమస్యలు తలెత్తటం, మాతాశిశు మరణాలు సంభవిస్తాయని వివరించారు. బాలికలకు కనీసం 21 ఏళ్లు దాటాక వివాహం చేయాలని, విద్యలో ప్రోత్సహించాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సత్యనారాయణ, ఎంఈవో కె.పున్నయ్య, ఏఎస్సై సింహాచలం, స్థానిక సర్పంచ్ పైడి భాస్కరరావు, హెచ్ఎం కృష్ణకుమారి, బెజ్జిపురం యూత్‌క్లబ్ చైల్డ్‌లైన్ ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

లావేరు: మహిళలు ఆర్థికంగా బలపడాలని.. అందుకు వారికి ఇస్తున్న స్వయం ఉపాధి శిక్షణలు దోహదపడతాయని కేవీకే సమన్వయకర్త కె.భాగ్యలక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.నీలవేణి అన్నారు. నాబార్డు సహకారంతో బెజ్జిపురం యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు ఈనెల 11వ తేదీ నుంచి రావివలస గ్రామంలో పుట్టగొడుగుల తయారీపై ఇచ్చిన శిక్షణ గురువారంతో ముగిసింది. శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మహిళలంతా సంఘటితంగా ముందడుగూ వేస్తూ మంచి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీసీబీ మేనేజరు వీవీఎస్ రఘుమణి, అసిస్టెంట్ మేనేజరు హరిత, హెచ్ఎం సత్యన్నారాయణ, ఎస్‌బీఐ రూసెట్ సంచాలకులు కె.శ్రీనివాసరావు, వైసీపీ డైరెక్టరు ఎం.ప్రసాదరావు, కోశాధికారి జి.అప్పలనాయుడు, డీసీసీబీ సూపర్‌వైజరు పోలినాయుడు పాల్గొన్నారు.

మంచి లక్షణాలు అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న త్రినాథరావు

రణస్థలం: విద్యార్థులు చదువుతో పాటు మంచి లక్షణాలు అలవర్చుకోవాలని ఎంఈవో ఎ.త్రినాథ రావు అన్నారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇండియా లిటరసీ ప్రాజెక్టు సహకారంతో స్కూల్ రెడీనెస్ అండ్ బాలవికాస్ ప్రోగ్రాంలో భాగంగా రణస్థలం, లావేరు మండలాల్లోని 24 హైస్కూళ్లు, రెండు కళాశాలలకు చెందిన 40 మంది విద్యార్థులకు బాలల హక్కులు, విధులపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు లెర్నింగ్ కో ఆర్డినేటర్ టి.కరుణాకరరావు మాట్లాడుతూ.. బాల హక్కుల సంఘాలు ఎలా ఏర్పాటు చేసుకోవాలి, ఎలా నడుపుకోవాలో అనే అంశాలను చర్చించారు. కార్యక్రమంలో బాల వికాస్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి.మాధవి, చైల్డ్ లైన్ టీం సభ్యులు డి.మౌనిక, డి.బి.రాజు, కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎ.రమణమూర్తి ఉన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న వెంకటరమణ

జి.సిగడాం: గ్రామాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ కోరారు. పెంట గ్రామంలో సర్పంచ్ పున్నాన సోనియా అధ్యక్షతన గురువారం ఉపాధి హామీ పనుల కార్యాచరణ ప్రణాళికల కోసం గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన పనులు గుర్తించాలన్నారు. సమావేశంలో గ్రామ కార్యదర్శి పాట్నారు సురేష్‌కుమార్, ఏపీవో చోళ్ల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు మక్క శ్రీలత, టీఏలు లక్ష్మణరావు, గణపతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పున్నాన అక్కలనాయుడు, మక్క శ్రీనివాసరావు, బత్తుల గోపి, డొల వెంకటరమణ, బాలి అప్పలసూరి, సచివాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

శివారుకు సాగునీరు అందించే చర్యలు



ముద్దాడ సమీపంలో కాలువలో పిచ్చి మొక్కలు, వ్యర్థాలు తొలగిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలో ప్రధాన సాగునీటి వనరైన నారాయణపురం కుడి కాలువ ద్వారా శివారు భూములకు సాగునీరు అందించే చర్యలను గురువారం జలవనరులశాఖ అధికారులు చేపట్టారు. ముద్దాడ పంచాయతీ పరిధిలో కాలువలో పూడికలు, పూడుకుపోయిన వ్యర్థాలను జేసీబీతో తొలగించే చర్యలు చేపట్టారు. ఫరీదుపేట నుంచి శివారు వరకు కాలువలో ముద్దాడ, కొత్తపేట, కొంగరాం ప్రాంతానికి చెందిన రైతులు తూటిక తివ్వ, పిచ్చి మొక్కలు తొలగించే చర్యలు చేపట్టారు. జలవనరుల శాఖ ఏఈ జీవీ రమణ పనులు పర్యవేక్షించగా, వైఎస్సార్ సీపీ నాయకుడు బెండు రామారావు, బొడ్డేపల్లి సుధాకర్ సహకరించారు. అధికారులు స్పందించి శివారు భూములకు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వాడవాడలా వేడుకగా..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తోన్న ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటి వద్ద ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. అన్ని జిల్లాల్లో గురువారం ఈ కార్యక్రమం వేడుకగా సాగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలు తమ దృష్టికి వస్తే అక్కడికక్కడే పరిష్కరించారు. తమ సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌కి తమ ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని ప్రజాప్రతినిధులను ప్రజలు దీవించారు. – సాక్షి నెట్‌వర్క్


ఏలూరు జిల్లా ధర్మారావుపేటలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు


తిరుపతి జిల్లా నెల్లిమానుకండ్రిగలో లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం


విజయనగరం జిల్లా బొబ్బిలిలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెంకట చిన అప్పలనాయుడు


గుంటూరు తూర్పు నియోజకవర్గంలో లబ్ధిదారుకు సంక్షేమ కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

విక్టర్ ప్రసాద్ వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: మహాత్మా గాంధీపై రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున స్పష్టం చేశారు. అతని వ్యాఖ్యలతో తమ ప్రభుత్వానికి, వైఎస్సార్‌సీపీకి ఎటువంటి సంబంధం లేదన్నారు. సచివాలయంలోని మీడియా పాయింట్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'విక్టర్ ప్రసాద్ మా పార్టీ వారు కాదు. ఆయన మా పార్టీలో పెద్ద పదవులు నిర్వహించలేదు. ఎస్సీల హక్కులను కాపాడుతూనే ఇతర కులాల వారి హక్కులకు ఇబ్బంది కలిగించకుండా చూడాల్సిన బాధ్యత రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ఆయనపై ఉంది. కానీ, గాంధీజీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. దేశం గర్వించదగ్గ నాయకులు గాంధీజీ, అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్, పూలే. వీరిని గౌరవించడం, మహానుభావులుగా పూజించడం మన సంస్కృతి, మన విధానమని ప్రతి సందర్భంలోనూ సీఎం వైఎస్ జగన్ చెబుతారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్రంలో గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిన నాయకుడు సీఎం వైఎస్ జగన్' అని తెలిపారు. మంత్రి ఇంకా ఏమన్నారంటే..

లోకేశ్.. మీ అయ్యను అడుగు

- బీసీలకు మా ప్రభుత్వం వచ్చాక చేస్తున్న మేలు, వారి అభ్యున్నతికి తీసుకుంటున్న చర్యల గురించి చర్చించేందుకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి నేతృత్వంలో బీసీల సమావేశం నిర్వహిస్తే.. దానిపై టీడీపీ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు.
- వైఎస్సార్‌సీపీ వచ్చాక బీసీలకు చాలా మేలు జరిగిందని ఆ సమావేశంలో ముక్తకంఠంతో తీర్మానించారు. బీసీలంతా వైఎస్సార్‌సీపీకి అండగా నిలుస్తుండటంతో టీడీపీ రథ చక్రాలు ఊడిపోతున్నాయి. దీంతో ఆ పార్టీ ట్వీట్ల వీరుడు లోకేశ్.. మా పార్టీ పెద్దల గురించి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడు. లోకేశ్.. బీసీల గురించి మాట్లాడేటప్పుడు, వారికి ఏం చేశాడో ఒకసారి మీ అయ్యను అడుగు. లోకేశ్ ఒక చెల్లని కాణి. ఇతని వ్యాఖ్యలు పెత్తందారీ మనస్తత్వానికి, అహంకారానికి అద్దం పడుతున్నాయి.

సామాజిక న్యాయం అంటే మీకు తెలుసా?

- టీడీపీ హయాంలో సామాజిక న్యాయం అంటే.. సుజనా చౌదరి లాంటి వారిని కేంద్ర మంత్రిని చేయడం, అతనికి ఆస్తులు సమకూర్చడం. టీడీపీ ప్రజా ప్రతినిధులు కాల్ మనీ పేరుతో మహిళల్ని వేధిస్తే వారి మీద ఎక్కడ చర్యలు తీసుకోవాల్సి వస్తుందోనని అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను వాడుకోవడం.
- ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా అని నాడు సీఎం స్థాయిలో చంద్రబాబు మాట్లాడటం.. తన మంత్రులతో దళితులు మురికిగా ఉంటారని మాట్లాడించడం సామాజిక న్యాయమా?
- సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి నిరంతరం పాటుపడుతున్నారు. పరిపాలనలో బీసీలకు అన్నింటా పెద్ద పీట వేశారు. సామాజిక విప్లవానికి తెరతీసి చరిత్ర సృష్టించారు.

• తెలంగాణ

బీజేపీలో చేరితే రూ.100 కోట్లు ఇస్తామన్నారు

- పోలీసులకు ఫిర్యాదులో ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఆరోపణ
- మిగతా ఎమ్మెల్యేలకు రూ.50 కోట్ల చొప్పున ఇస్తామన్నారు
- ముగ్గురిపై ఎఫ్‌ఐఆర్ నమోదు

సాక్షి, హైదరాబాద్: టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు ఎర ఘటనకు సంబంధించి తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి బుధవారం రాత్రి మొయినాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు.. నందకుమార్ సహా ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్‌ఐఆర్) ప్రతిని రాత్రి 12.30 గంటలకు కోర్టుకు పంపారు. ఈ కేసులో అవినీతి నిరోధక చట్టంలోకి సెక్షన్లనూ చేర్చారు. ఈ నేపథ్యంలో కేసు దర్యాప్తును ఏసీబీకి బదిలీ చేయనున్నట్టు సమాచారం. ఎఫ్‌ఐఆర్ (నంబర్ 455/2022)లోని వివరాల మేరకు.. బీజేపీకి చెందిన ఢిల్లీలోని ఫరీదాబాద్ వాసి రాంచంద్రభారతి అలియాస్ సతీశ్‌శర్మ, హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి నందకుమార్ ఇద్దరూ రోహిత్‌రెడ్డిని కలిసి బేరసారాలు చేశారు. రానున్న ఎన్నికల్లో టీఆర్‌ఎస్ తరఫున పోటీ చేయవద్దని, ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరాలని కోరారు. ఇందుకోసం రూ.100 కోట్లు ఇస్తామని చెప్పారు. దీనితోపాటు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సివిల్ కాంట్రాక్టులు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పదవులు సహా ఇతర లాభాలు చేస్తామంటూ హామీ ఇచ్చారు. తమ మాట వినకుంటే క్రిమినల్ కేసులతోపాటు సీబీఐ, ఈడీ దాడులు తప్పవని బెదిరించారు. టీఆర్‌ఎస్ నేతృత్వంలో నడుస్తున్న తెలంగాణ ప్రభుత్వాన్ని పడగొడతామని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో బుధవారం మరోసారి రోహిత్‌రెడ్డిని సంప్రదించిన నందు, రాంచంద్రభారతి.. ఆ రోజు మధ్యాహ్నం అజీజ్ నగర్‌లోని ఫామ్‌హౌస్‌కు వస్తున్నామని, అక్కడే బేరసారాలు పూర్తిచేద్దామని చెప్పారు. ఇదే సమయంలో రూ.50 కోట్ల చొప్పున ఆశ చూపి మరికొందరు ఎమ్మెల్యేలను బీజేపీలో చేరేందుకు సిద్ధం చేయాలని కూడా కోరారు. రోహిత్‌రెడ్డితో పాటు ఈ డీల్‌కు అంగీకరించిన ఎమ్మెల్యేలు తెలంగాణ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలని కోరారు. బుధవారం మధ్యాహ్నం తిరుపతికి చెందిన సింహయాజిస్వామితో కలిసి తాము ఫామ్‌హౌస్‌కు వస్తున్నామని చెప్పారు. ఈ పరిణామాల నేపథ్యంలో బాధ్యులపై కేసు నమోదు చేసి... అనైతిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని రోహిత్‌రెడ్డి తన ఫిర్యాదులో కోరారు. ఈ ఫిర్యాదు ఆధారంగా మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కంకర లీజుపై 'ఈనాడు'వి వంకర రాతలు

- ఆ పత్రికపై చట్టపరంగా చర్యలు
- రాష్ట్ర గనులు, భూగర్భశాఖ సంచాలకులు వి.జి వెంకటరెడ్డి

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్) : రాష్ట్రంలో మైనింగ్ శాఖపై 'ఈనాడు' పత్రిక పనికట్టుకుని వరుసగా తప్పుడు కథనాలతో, ప్రజల్లో అపోహలను కల్పించేలా వార్తలను ప్రచురిస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భశాఖ సంచాలకులు (డీఎంజీ) వి.జి. వెంకటరెడ్డి మండిపడ్డారు. 'కంకర లీజుకు వంకర బుద్ధి' పేరుతో ఈనాడు తప్పుడు కథనాన్ని ప్రచురించిందని.. అభూతకల్పనలు, అవాస్తవాలతో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలనే లక్ష్యంతోనే వరుసగా అసత్య కథనాలను ప్రచురిస్తోందని గురువారం ఒక ప్రకటనలో ఆయన విమర్శించారు. కనీసం వాస్తవాలను తెలుసుకునేందుకు అధికారులను వివరణ అడగాలనే పాత్రికేయ సంప్రదాయాలకు కూడా ఆ పత్రిక తిలోదకాలు ఇవ్వడం బాధాకరమన్నారు. ఆయన ఇంకా ఏం తెలిపారంటే..

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో రోడ్ మెటల్ అనుమతుల కోసం ఈ-వేలం నిర్వహిస్తున్నారని, దీనిలో అధికార పార్టీ నేతలు చక్రం తిప్పుతున్నారన్నది పూర్తిగా నిరాధారం. ఉమ్మడి కృష్ణాజిల్లాలోనే కాదు, రాష్ట్రంలోని మరే ప్రాంతంలోనూ మైనర్ మినరల్స్‌కు ఈనెల 27తో ఈ-వేలం గడువు ముగిసేలా గనులశాఖ ఎక్కడా నోటిఫికేషన్ జారీచేయలేదు. ఏపీ ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌ను పరిశీలిస్తే తెలిసిపోతుంది. పచ్చి అబద్ధాలతో ఈనాడు పత్రిక బురదజల్లే కథనాన్ని ప్రచురించింది.
- రాష్ట్రంలో ఈ-వేలం విధానం ద్వారా ఔత్సాహికులు మైనింగ్ రంగంలోకి రావాలనే మంచి ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సీఎం వైఎస్ జగన్ ఈ నూతన విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి మంచి విధానాన్ని తీసుకురాలేదు. మైనింగ్ లీజుల కోసం సిండికేట్ కావడం, తక్కువకు కోట్ చేయడం వంటి అక్రమాలకు చెక్ పెడుతూ పూర్తి పారదర్శకతను అమలుచేస్తున్నారు.
- ఆసక్తి ఉంటే ఈనాడు పత్రిక యాజమాన్యం సైతం ఈ-వేలంలో పాల్గొనవచ్చు. కుట్రపూరితంగా గనులశాఖపై అసత్య కథనాలను ప్రచురిస్తున్న ఆ పత్రికపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

సీబీఐ లేదా సిట్‌తో దర్యాప్తు జరిపించండి

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర అధికారులు పక్షపాతం, అన్యాయంగా విచారణ సాగిస్తున్నారు. కావాలనే బీజేపీపై నిందమోపుతూ అప్రతిష్టకు చేస్తున్నారు. ఈ కేసులో నిష్పక్షపాత, స్వేచ్ఛ విచారణ కోసం ఈ పిటిషన్ దాఖలు చేస్తున్నాం. 2018లో మునుగోడు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి 2022, ఆగస్టు 8న ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. నవంబర్ 3న ఇక్కడ ఉప ఎన్నిక జరుగనుండగా, రాజగోపాల్‌రెడ్డి బీజేపీ తరఫున బరిలోకి దిగారు. ఈ నేపథ్యంలో బీజేపీ నిర్వహిస్తున్న ప్రచారానికి ప్రజా స్పందన అధికంగా వస్తోంది. దీన్ని అడ్డుకోవడం కోసం టీఆర్‌ఎస్ పార్టీ విశ్వప్రయత్నాలు చేస్తూ వస్తోంది. అయినా ఓటర్లు మాత్రం బీజేపీవైపే నిలుస్తున్నారు. అలాగే రాష్ట్రంలో టీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదిగింది. టీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలు, అవినీతిపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దెత్తున పోరాటాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నలుగురు టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను బీజేపీలోకి చేర్చుకోవడం కోసం డబ్బు, కాంట్రాక్టులు ఎరవేసిందని బుధవారం కొన్ని న్యూస్ చానళ్లు ప్రచారం చేశాయి. టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మొయినాబాద్ ఫామ్‌హౌజ్‌లో ఈ తతంగం జరుగుతోందని పేర్కొన్నాయి. ఈ క్రమంలో పోలీసు అధికారులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే పలు చానళ్లు దీన్ని ప్రత్యక్ష ప్రసారం చేశాయి. ప్రాథమిక దర్యాప్తు జరిపిన సైబరాబాద్ సీపీ ఆ నలుగురు టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను ఎస్కార్ట్ వాహనాలతో ప్రగతిభవన్‌కు తరలించారు. అనంతరం పోలీసులు మీడియాతో మాట్లాడుతూ.. ఒక్కొక్క ఎమ్మెల్యేకు రూ.100 కోట్లు ఇస్తామని ముగ్గురు వ్యక్తులు వచ్చారని చెప్పారు. రోహిత్‌రెడ్డి సమాచారం ఇవ్వడంతోనే తాము వచ్చి రామచంద్ర భారతి, నందకుమార్, సింహయాజిస్వామిలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు వెల్లడించారు'అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

ఇదంతా రాజకీయ కుట్ర మాత్రమే..


'ఈ ముగ్గురు రోహిత్‌రెడ్డిని సెప్టెంబర్ 26న కలిశారని, బీజేపీలోకి వస్తే రూ.100 కోట్లు ఇస్తామని చెప్పినట్లు టీఆర్‌ఎస్ ఆరోపించింది. రోహిత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఇదంతా టీఆర్‌ఎస్ నడిపిన రాజకీయ కుట్ర మాత్రమే. బీజేపీ పరువుతీయడానికి, కార్యకర్తలను నిరుత్సాహపరిచి తద్వారా మునుగోడు ఉప ఎన్నికలో లబ్ధి పొందాలని ఈ కుట్రకు పాల్పడింది. ఈ కేసు వెనుక టీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్, ఇతర ముఖ్య నేతలు ఉండి నడిపిస్తున్నారు. పోలీసులు స్వేచ్ఛగా విచారణ చేసే అవకాశం లేనందున.. సీబీఐ లేదా ప్రత్యేక దర్యాప్తు సంస్థ(సిట్)తో విచారణ జరిపించాలని కోరుతున్నాం. లేకుంటే మునుగోడు ఎన్నికలో బీజేపీకి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంది. విచారణ నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా జరగాలని విజ్ఞప్తి చేస్తున్నాం'అని వెల్లడించారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ


మాలధారణ చేయిస్తున్న గురుస్వామి

కొత్తూరు: ఏకకాలంలో 250 మందికి మాలధారణ జరగడంతో గురువారం కొత్తూరు అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో అయ్యప్ప నామస్మరణ మారుమోగింది. పారాపురం, మెట్టూరు, కొత్తూరు, ఇరపాడుతోలతో పరిసర గ్రామాలకు చెందిన వందలాది భక్తులు, కుటుంబ సభ్యులు తరలిరావడంతో దేవాలయ ఆవరణ ఆధ్యాత్మిక సంతరించుకుంది. గురుస్వామి పిన్నింటి ప్రసాదరావు ఆధ్వర్యంలో భక్తులంతా దీక్ష స్వీకరించారు. కార్యక్రమంలో గురుస్వాములు అనకాపల్లి రామారావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


సమావేశంలో మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ భాగ్యలక్ష్మి

లావేరు: పత్తి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నీల వేణి అన్నారు. లావేరు మండలం పెదరావుపల్లిలో గురువారం కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పత్తి పంట సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెల్ల దోమ, తామరపురుగు ఆశిస్తే నివారణకు ఇమిడక్లోప్రిడ్ 0.25 మిల్లీలీటర్లు లేదా డైనోడెఫ్యూరాన్ 0.4 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ జి.తిరుమలరావు, సిబ్బంది నాగేశ్వరరావు, వీఏఏ సుధ పాల్గొన్నారు.

టీడీపీ నేతల అడ్డగింత

కాశీబుగ్గ: కాశీబుగ్గ పెట్రోల్ బంకు వద్ద టీడీపీ నాయకురాలు గౌతు శిరీష, ఎంపీ రామ్మోహన్ నాయుడులను గురువారం రాత్రి 7 గంటలకు పోలీసులు అడ్డుకున్నారు. శుక్రవారం విశాఖ రిషికొండ వద్ద టీడీపీ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి కార్యకర్తలతో వెళ్తుండగా శాంతిభద్రతల దృష్ట్యా కాశీబుగ్గ సీఐ శంకరరావు, మహిళా పోలీసులు నాయకుల వాహనాలను నిలిపివేశారు. రాత్రి 9.45 గంటల తర్వాత విడిచిపెట్టారు.

బడి బస్సు భద్రమేనా..?

- పలు ప్రైవేట్ విద్యా సంస్థల బస్సుల్లో కానరాని నిబంధనలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

టెక్కలి:


ప్రైవేట్ విద్యా సంస్థలు నడిపిస్తున్న బస్సుల్లో చాలావరకు నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని విద్యా సంస్థల బస్సులు ఫిట్‌గా లేకపోయినప్పటికీ అందమైన రంగులతో లోపాన్ని కవర్ చేస్తున్నారన్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులకు ఉండాల్సిన కనీస నిబంధనలపై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన ఉండాలని రవాణా శాఖాధికారులు సూచిస్తున్నారు.


ప్రైవేట్ విద్యా సంస్థకు చెందిన బస్సు

ఈ నిబంధనలు తప్పనిసరి..

- విద్యా సంస్థకు చెందిన బస్సుకు ఎడమ వైపు, ముందు భాగంలో పాఠశాల/కళాశాల పేరు, ఫోన్ నెంబర్‌తో సహా పూర్తి చిరునామా స్పష్టంగా కనిపించేలా రాయించాలి.
- బస్సు డ్రైవర్ వయస్సు 60 లోపు ఉండాలి. డ్రైవర్ ఆరోగ్యపట్టిక (హెల్త్ కార్డు)ను నిర్వహించాలి. రక్తపోటు (బి.పి.), షుగర్, కంటిచూపు వంటి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలను ప్రతి మూడు నెలలకొకసారి తమ సొంత ఖర్చుపై విద్యా సంస్థల యాజమాన్యం చేయించాలి. ఆయా రికార్డులను జాగ్రత్త పరచాలి.
- విద్యా సంస్థలో బస్సు డ్రైవరు నియమించేముందు లైసెన్సు వాస్తవాలను తెలుసుకొనేందుకు సంబంధిత రవాణా శాఖా కార్యాలయాన్ని సంప్రదించాలి.
- కనీసం 5 సంవత్సరాల సీనియారిటీ కలిగిన డ్రైవర్లను మాత్రమే నియమించాలి. డ్రైవర్ నియామకం విషయం పేరెంట్స్ కమిటీకి తెలియజేయాలి.
- బస్సుకు సంబంధించిన బాహ్య పరికరాలు, విండ్ స్క్రీన్, వైపర్స్, లైటింగ్స్, మెకానికల్ కండిషన్, పనితీరును తెలుసుకునేందుకు నెలకొకసారి ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ బస్సును తనిఖీ చేయాలి. సమాచారాన్ని రికార్డుల్లో నమోదు చేయాలి.
- ఆయా బస్సులో ఫిర్యాదుల పుస్తకం అందుబాటులో ఉంచాలి. ప్రతి రోజూ ఆ పుస్తకాన్ని పరిశీలించి అందులో ఉన్న ఫిర్యాదుల మేరకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలి.
- ప్రతి బస్సుకు అత్యవసర ద్వారం ఏర్పాటు చేయాలి. దానిపై 'అత్యవసర ద్వారం' అని స్పష్టంగా కనిపించేలా రాయాలి.
- ప్రతి బస్సులో అత్యవసరమైన మందులతో కూడిన ప్రథమ చికిత్స పెట్టెను ఏర్పాటు చేయాలి. నెలకోసారి ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ సభ్యులు పెట్టెను తనిఖీ చేయాలి.
- బస్సుకు నాలుగు వైపులా అద్దాలకు జాలి అమర్చాలి. దీనివల్ల విద్యార్థులు చేతులను బయటకు పెట్టకుండా ఆపవచ్చు.
- బస్సులో కచ్చితంగా నీటిసదుపాయం ఉండాలి.
- విద్యా సంస్థ ఆవరణలోనే బస్సులు పార్కింగ్ చేయాలి. అంతేకాకుండా విద్యార్థులంతా విద్యా సంస్థ ఆవరణలోనే బస్సులు ఎక్కేలా చూడాలి.
- ప్రతి బస్సులో అటెండర్ ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లో డ్రైవర్ లేని సమయంలో అటెండర్‌తో బస్సును నడపకూడదు.
- బస్సు డ్రైవర్‌తో పాటు అటెండర్ కచ్చితంగా యూనిఫాం కలిగి ఉండాలి.
- ప్రతి రోజూ బస్సులో ప్రయాణించే విద్యార్థుల వివరాలు అంటే...వారి పేర్లు, తరగతి, ఇంటి చిరునామా, దిగాల్సిన ప్రదేశం తదితర అంశాలతో పట్టిక ఏర్పాటు చేయాలి. విద్యార్థులు ఎక్కాల్సిన, దిగాల్సిన ప్రదేశం పేరును సూచిస్తూ ప్రిన్సిపాల్ రూపొందించే రూట్ ప్లాన్‌ను ఏర్పాటు చేయాలి.
- బస్సు నుంచి విద్యార్థులు ఎక్కడం, దిగడం డ్రైవర్‌కు స్పష్టంగా గమనించేందుకు కన్వెక్స్ గ్లాస్ వ్యూ అద్దాలు ఉండాలి. బస్సులో పెద్ద పారదర్శక అద్దం (మిరర్)ను అమర్చాలి.
- బస్సులో విద్యార్థులతో పాటు ఒక ఉపాధ్యాయుడు ప్రయాణం చేయాలి.
- బస్సు ఇంజన్ కంపార్ట్‌మెంట్‌లో అగ్నిమాపక యంత్రం (ఫైర్ ఎక్స్‌టింగ్విషర్), పాడి అందుబాటులో ఉంచాలి. బస్సులో సీట్ల కింద బ్యాగులు ఉంచుకునేందుకు అరలు ఏర్పాటు ఉండాలి.
- వాహనానికి నాలుగు వైపులా పైభాగం మూలాల్లో బయటివైపు యాంబర్ (గాఢ పసుపు పచ్చని) రంగుగల ఫ్లాషింగ్ లైట్లు అమర్చాలి. బస్సులో నుంచి విద్యార్థులు దిగేటప్పుడు, ఎక్కేటప్పుడు ఈ లైట్లను వెలిగించాల్సి ఉంటుంది.
- విద్యా సంస్థకు చెందిన బస్సు విద్యార్థుల కోసం వినియోగిస్తున్నారు అనే విషయమై 400 ఎం.ఎం. సైజు బోర్డును సరిగ్గా అమర్చాలి. ఆ బోర్డు మీద 250 ఎం.ఎం.లకు తగ్గని ఎత్తులో ఇద్దరు పాఠశాల విద్యార్థులు (ఒక అమ్మాయి ఒక అబ్బాయి) బొమ్మలను నల్లరంగులో ఉంచాలి. ఆ చిత్రం కింద 'స్కూల్ బస్', 'కళాశాల బస్' అని, నల్లరంగులో కనీసం 100 ఎం.ఎం.ల సైజు అక్షరాలలో రాయాలి.
- రవాణా శాఖాధికారులు సూచన మేరకు బస్సు పర్మిట్, కాల పరిమితిని కచ్చితంగా రాయాలి.

నిబంధనలు తెలుసుకోవాలి..



ప్రైవేట్ విద్యా సంస్థల్లో పిల్లల్ని చదివిస్తున్న తల్లిదండ్రులంతా ఆయా బస్సులకు రవాణా శాఖా నిబంధనలు ఉన్నాయా లేదా అనే విషయాన్ని కచ్చితంగా తెలుసుకోవాలి. కొన్ని సందర్భాల్లో ఎటువంటి నిబంధనలు లేకుండా బస్సులు రాకపోకలు సాగిస్తే యజమాన్యం నిలదీయవచ్చు. రవాణా శాఖాధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.

– డి.సంజీవరావు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, టెక్కలి.

కొరాపుట్ మ్యూజియంలో ఆంధ్రా అధికారులు

కొరాపుట్: జిల్లా కేంద్రంలోని ఆదివాసీ మ్యూజియాన్ని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అధికారులు గురువారం సందర్శించారు. ఆ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం లంబసింగిలో ప్రభుత్వం రూ.30 కోట్ల వ్యయంతో ఆదివాసీ మ్యూజియం ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో స్థానిక మ్యూజియం పనితీరుపై అధ్యయనం చేసేందుకు గిరిజన సంక్షేమశాఖ చీఫ్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాస్, అధికారుల బృందం కొరాపుట్‌లో పర్యటించారు.

మ్యూజియం నిర్వాహకుడు జగబంధు సామల్ వద్ద వివరాలను అడిగి తెలుసుకున్నారు. సుమారు వందేళ్ల క్రితం నాటి కోయా, గదబ, బోండా, భొత్రా, గోండో, కుయి జాతుల ఆచార, సాంప్రదాయ వినియోగ వస్తువులు, ఆయుధాలు గురించి వివరించారు. 1992లో ఏర్పాటైన కొరాపుట్ మ్యూజియంలో అనేక విషయాలు ఆంధ్రా అధికారులు తెలుసుకున్నారు. ఈ బృందం జగదల్‌పూర్, భువనేశ్వర్ లోని మ్యూజియం లను కూడా సందర్శించనున్నట్లు ప్రొఫెసర్లు ఎస్.శ్రీనివాస్, నాగరాజు తెలిపారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌లకు రూ.50 వేల విరాళం


హెచ్‌ఎం శ్రీనివాస్‌కు రూ.50వేల చెక్‌ను అందజేస్తున్న వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. కుప్పిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 'పాఠశాల విద్య–ఉన్నత ప్రమాణాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. పాఠశాలలో 7, 10వ తరగతి విద్యార్థుల మెరిట్ స్కాలర్‌షిప్‌ల కోసం తన తల్లిదండ్రులు కన్నమ్మ, రామస్వామినాయుడు జ్ఞాపకార్థం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుప్పిలి ప్రభుత్వ పాఠశాలలో చదిన వైస్‌చాన్సలర్ స్థాయికి చేరుకున్నానంటే విద్యే కారణమని చెప్పారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం అన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు, అమ్మఒడి, వైఎస్సార్ గోరుముద్ద, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వంటి అనేక పథకాలు అమలు చేస్తోందని వివరించారు. ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీలు మెరుగైన విద్య అందించేలా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈడీఓ తిరుమల చైతన్య, హెచ్‌ఎం ఎ.వి.శ్రీనివాస్, సర్పంచ్ బల్లాడ హిందుమతి, డాక్టర్ బల్లాడ ప్రతిభారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అక్రమార్కులపై చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

- సామాజిక తనిఖీ ప్రజావేదికలో డ్వామా పీడీ చిట్టిరాజు
- రికవరీ రూ.53,259గా గుర్తింపు

జలుమూరు: ఉపాధి హామీ పథకంలో జరిగిన పనుల్లో క్షేత్రస్థాయి, సాంకేతిక సిబ్బంది ఎటువంటి అక్రమాలు చేసినా శాఖాపరంగా చర్యలు తప్పవని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు స్పష్టం చేశారు. గురువారం జలుమూరు మండల ఉపాధి కార్యాలయ ఆవరణలో 2020–21, 2021–22 సంవత్సరాలలో జరిగిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ముందుగా జోనంకి, దరివాడ, అల్లాడ, అల్లాడపేట పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై చర్చించారు. బొడ్డపాడు, మాకివలస, తిమడాం, అక్కురాడ, వెంకటాపురం, హుస్సేనుపురం, రాణ పంచాయతీలలో మొక్కలు నాటకుండానే బిల్లులు చేయడంపై డీఆర్పీలు ఇచ్చిన నివేదికపై పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటితో పాటు మరికొన్ని పంచాయతీలలో మస్టర్లలో అవకతవకలు గుర్తించారు. మస్టర్లలో కొట్టివేతలు ఉంటే బిల్లు ఎలా జనరేట్ చేస్తున్నారని ఆపరేటర్‌ను ప్రశ్నించారు. అక్కురాడులో సుమారు రూ.నాలుగు లక్షల పనులకు సంబంధించి మస్టర్లలో ఒకే వేలి ముద్రలు ఉండటంపై ఫీల్డ్ అసిస్టెంట్‌ను వివరణ కోరారు. మొక్కలు లేని చోట వారం రోజుల్లో మళ్లీ నాటాలని స్పష్టం చేశారు. ఒక రేషన్ కార్డుతో రెండు జాబ్ కార్డులు, పనికి రానివారికి సైతం బిల్లులు చెల్లించడం నేరమన్నారు. మొత్తం 1602 పనులకు గాను రూ.73.52 లక్షలు ఖర్చు కాగా రూ.53,259 రికవరీగా అధికారులు గుర్తించారు..

సామాజిక బృందం చేతివాటం..?

ఉపాధి పనులలో జరిగిన అవినీతిని గుర్తించి వారి నుంచి రికవరీ చేసేందుకు సామాజిక తనిఖీ బృందం నిర్వహించిన తనిఖీల్లో చేతివాటం జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారం రోజులుగా మండలంలో పలు పంచాయతీలలో ఈ బృందం సోషల్ ఆడిట్ చేసి గ్రామసభలు నిర్వహించి అక్రమాలు గుర్తించడం వీరి పని. ఇందుకు విరుద్ధంగా ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి పెద్ద మొత్తం తీసుకున్నారని ఆయా సర్పంచ్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు సమావేశంలో గుసగుసలాడటం కనిపించింది. ఈ విషయమై స్టేట్ రిసోర్సుపర్సన్ కె.వెంకయ్య వద్ద ప్రస్తావించగా వారం రోజులుగా ఏం జరిగిందో తనకు తెలియదని, నేను రెండు రోజుల కిందటే విధులకు వచ్చానన్నారు. ఏపీఓ నారాయణరావు మాట్లాడుతూ ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దు అని ఫీల్డ్ అసిస్టెంట్లకు చెప్పామన్నారు. సమావేశంలో జిల్లా విజిలెన్స్ అధికారి లవరాజు, ప్రిసైడింగ్ అధికారి మురళీకృష్ణ, అడిషనల్ పీడీ ఎం.జయరామ్, ఏపీడీ యుగంధర్, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి టి.సురేష్, ఎంపీపీ వాన గోపి, నాయకులు మెండ రాంబాబు, ఎంపీడీఓ జి.వి.రవికుమార్, ఈసీలు అప్పలస్వామి, పట్ట సోమేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
ఫ్యాషన్
శ్రీకాకుళం
శుక్రవారం ॥ 28-10-2022







తిరిగొచ్చిన స్టైల్

నాటి మహారాణీ చీరకట్టు హుందాతనం
తారామణిని చుట్టేసిన అందం
నేడు అదే కళ తిరిగొచ్చి మన ఇంటి
యువరాణులను ఆకట్టుకుంటున్నది.
వేడుకలలో వైవిధ్యంగా వెలిగిపోతున్నది.








రెట్రో స్టైల్ పాతదే అయినా మనల్ని ఎప్పుడూ కొత్తగా ఆకట్టుకుంటుంది. అందుకే డిజైనర్లు యాభై ఏళ్ల క్రితం నాటి స్టైల్‌కి కొత్త హంగులు అద్దుతుంటారు. కట్టూ బొట్టు, ఆభరణాల అలంకరణలోనూ అదే ప్రత్యేకతను చాటుతున్నారు. రాబోయే వేడుకలకు అలనాటి కళ సిద్ధం అంటూ పట్టు, డిజైనర్ శారీస్‌ను కొంగొత్తగా రూపుకడుతున్నారు ఫ్యాషన్ డిజైనర్లు.

వంటిల్లు

తేలిగ్గా వుండండి!

రోజూ రుచిగా తినాలి. కానీ...
అద్దం నిండి పోతోంది.
ఏం చేయాలి?
మితిమీరిన బరువు వద్దు.
వ్యాయామం మరీ ఎక్కువ చేయలేం!
మరేం చేయాలి?
బరువు తగ్గాలంటే...
ఏం తినాలో చాలా మంది చెప్తారు.
ఎలా వండాలో మేము చెప్తున్నాం.

బాజ్రా మూంగ్ గ్రీన్ పీ కిచిడీ



కావలసినవి: జొన్నలు – పావు కప్పు (ఐదు గంటల సేపు నానబెట్టాలి), పెసలు – పావు కప్పు (ఐదు గంటల సేపు నానబెట్టాలి), పచ్చి బఠాణి – అర కప్పు, నూనె– రెండు టీ స్పూన్‌లు, జీలకర్ర– టీ స్పూన్, ఇంగువ – చిటికెడు, ఉల్లిపాయ ముక్కలు– అర కప్పు, టొమాటో ముక్కలు– ఒక కప్పు, వెల్లుల్లి పేస్ట్– టీ స్పూన్, అల్లం పేస్ట్ – టీ స్పూన్, పచ్చి మిర్చి పేస్ట్ – అర టీ స్పూన్ , పసుపు – అర టీ స్పూన్, కారం పొడి– టీ స్పూన్, ఉప్పు– రుచికి తగినంత.

తయారీ: ● జొన్నలు, పెసలు, పచ్చి బఠాణీలను శుభ్రంగా కడిగి ఒక కప్పు నీరు పోసి, చిటికెడు ఉప్పు వేసి ప్రెషర్ కుకర్‌లో ఐదు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి ● స్టవ్ మీద బాణలి పెట్టి నూనె వేడి చేసి జీలకర్ర వేసి, అవి చిటపటలాడిన తర్వాత ఇంగువ, ఉల్లిపాయ ముక్కలు వేసి ఒక మోస్తరు మంట మీద వేయించాలి. ఉల్లిపాయ ముక్కలు మెత్తగా మగ్గిన తర్వాత టొమాటో ముక్కలు, వెల్లుల్లి, అల్లం, పచ్చి మిర్చి పేస్ట్‌లు, పసుపు, కారం, ఉప్పు వేసి కలిపి మూత పెట్టి మీడియం మంట మీద మధ్యలో కలుపుతూ ఉడికించాలి. ఈ మిశ్రమాన్ని కచ్చాపచ్చాగా మెదపాలి. ఇందులో ముందుగా కుకర్‌లో ఉడికించి పక్కన పెట్టిన జొన్నలు, పెసలు, బఠాణీల మిశ్రమాన్ని వేసి పావు కప్పు నీటిని పోసి బాగా కలిపి రెండు నిమిషాల సేపు ఉడికించి దించేయాలి.


గ్రీన్ పీస్ అక్కీ రోటీ



కావలసినవి: బియ్యప్పిండి– కప్పు, పచ్చి బఠాణీ– కప్పు, ఉల్లిపాయ – 1(తరగాలి), కొత్తి మీర తరుగు– 3 టీ స్పూన్‌లు, పచ్చిమిర్చి– 3 (తరగాలి), జీలకర్ర– టీ స్పూన్, కరివేపాకు – 2 రెమ్మలు, ఉప్పు – తగినంత, నూనె– టీ స్పూన్.

తయారీ: ● బఠాణీలను కడిగి ఉడికించి, నీటిని మరో పాత్రలోకి వంపి పక్కన ఉంచాలి. బఠాణీలను మిక్సీలో కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి. అందులో ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర, కరివేపాకు, బియ్యప్పిండి, జీలకర్ర, మిర్చి తరుగు, ఉప్పు వేసి బాగా కలపాలి. మిశ్రమం మరీ గట్టిగా అనిపిస్తే బఠాణీలు ఉడికించిన నీటిని తగినంత తీసుకుంటూ గారెల పిండిలా కలపాలి. ● అరిటాకు లేదా పాలిథిన్ పేపర్‌కు నూనె రాసి పై మిశ్రమాన్ని పెద్ద ఉల్లిపాయంత తీసుకుని సమంగా అరిశెలాగ వత్తాలి. మధ్యలో ఐదారు చోట్ల చిల్లు పెట్టాలి. పెనం మీద కొద్దిగా నూనె వేసి ఈ రోటీని పేపర్ మీద నుంచి జాగ్రత్తగా పెనం మీదకు జార్చాలి. మీడియం మంట మీద రెండు వైపులా కాల్చాలి.

కాబూలీ చనా బిర్యానీ



కావలసినవి: బియ్యం – రెండున్నర కప్పులు, తరిగిన కొత్తిమీర – పావు కప్పు, కుంకుమ పువ్వు– పావు టీ స్పూన్, వెన్న తీసిన పాలు – పావు కప్పు, ఉప్పు– రుచికి తగినంత; **గ్రేవీ కోసం...** ఉడికించిన తెల్ల శనగలు – ముప్పావు కప్పు, నూనె– రెండు టీ స్పూన్‌లు, అల్లం పేస్ట్– టీ స్పూన్, వెల్లుల్లి పేస్ట్ – టీ స్పూన్, కారం పొడి – టీ స్పూన్, పసుపు– అర టీ స్పూన్, టొమాటో ముక్కలు– ముప్పావు కప్పు, పచ్చి మిర్చి తరుగు – ఒకటిన్నర టీ స్పూన్ , ఉప్పు– రుచికి తగినంత, మీగడ లేని పెరుగు – పావు కప్పు (చిలకాలి)

తయారీ: స్టవ్ మీద మందపాటి బాణలి పెట్టి నూనె వేడి చేసి అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేసి చిన్న మంట మీద మగ్గనివ్వాలి. ఇప్పుడు కారం పొడి, పసుపు, ఉప్పు, కొద్దిగా నీరు పోసి అర నిమిషం పాటు ఉడికించి, టొమాటో ముక్కలు, పచ్చిమిర్చి తరుగు, శనగలు వేసి కలుపుతూ మీడియం మంట మీద ఉడికించి, దించే ముందు పెరుగు వేసి కలపాలి. ఈ గ్రేవీని పక్కన ఉంచాలి.

బిర్యానీ తయారీ: కుంకుమ పువ్వును వేడి పాలలో వేసి నాననివ్వాలి. అన్నం వండి అందులో కొత్తిమీర, ఉప్పు, కుంకుమపువ్వు పాలు వేసి జాగ్రత్తగా (అన్నం ముద్ద కాకుండా) కలపాలి. ఇప్పుడు అన్నం మిశ్రమం సగం తీసుకుని వెడల్పు (ఒవెన్‌లో పట్టేటట్లు)పాత్రలో పరిచినట్లు అమర్చాలి. అన్నం మీద కాబూలీ చనా గ్రేవీ సమంగా వేయాలి. మిగిలిన సగం అన్నం మిశ్రమాన్ని గ్రేవీ పైన సర్దాలి. పాత్ర అంచులకు అల్యూమినియం ఫాయిల్ తో సీల్ చేసి ఒవెన్‌లో 200 డిగ్రీల ఉష్ణోగ్రతలో 20 నిమిషాల పాటు ఉంచాలి. కాబూలీ చనా బిర్యానీ రెడీ.

యువర్స్



మీకో విషయం తెలుసా!

● సర్ఫింగ్ అనేది నిన్నామొన్నటి ఆట కాదు. ప్రాచీన పాలనిజన్‌లో 12వ శతాబ్దంలోనే ఈ ఆట ఉనికిలో ఉన్నట్లు గుహ చిత్రాలు తెలియజేస్తున్నాయి. చెక్కపలకల సహాయంతో సర్ఫింగ్ చేసేవారట.
● అమెరికన్ సైకాలజిస్ట్ నిలెస్ కెలాగ్ ఆయన భార్య తమ ముద్దుల బిడ్డ డోనాల్డ్‌ను, ఒక బేబి చింపాంజీతో కలిపి పెంచారు. చింపుకు హ్యూమన్ బిహేవియర్ నేర్పించాలనేది ఈ దంపతులు ఉద్దేశం. అయితే తొమ్మిది నెలల తరువాత సీన్ రివర్స్ అయింది. డోనాల్డ్ చింపును ఇమిటేట్ చేయడం ప్రారంభించాడు. ● తన నవలలతో పాఠకులను భయపెట్టే ప్రఖ్యాత హారర్ రచయిత స్టీఫెన్ కింగ్‌కు రాత్రిపూట లైట్లు బంద్ చేసి పడుకోవడం అంటే తెగ భయమట!

● సక్సెస్ స్టోరీ

6 సెన్స్

రాబోయే సమస్యకు తిరుగులేని పరిష్కారం

అంతా అయిపోయాక 'అయ్యో!' అనుకుంటాయి కొన్ని సంస్థలు. 'అయ్యో!'లకు ఆస్కారం ఇవ్వకుండా సమస్యకు పరిష్కారం చూపుతుంది సిక్స్ సెన్స్. ఇది ఏ.ఐ ఆధారిత డిఫెక్ట్ ఎనాలటిక్స్ ప్లాట్‌ఫామ్. ఇద్దరు స్నేహితులు ఆకాంక్ష జగ్వానీ, అప్నీ అగర్వాల్‌లు ప్రారంభించిన ఈ స్టార్టప్ విజయపథంలో దూసుకుపోతోంది. సాంకేతిక లోపాలను, కారణాలను ముందుగానే తెలియజేయడం ద్వారా ఈ టెక్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఎన్నో పరిశ్రమలకు ఉపయోగపడుతుంది.



ఆకాంక్ష　　అప్నీ అగర్వాల్

తమ ప్రాజెక్ట్‌పై నమ్మకం కలిగించేలా, పెట్టుబడి పెట్టేలా చేయడం స్టార్టప్ ఫౌండర్‌లకు సవాలు. ఇక పురుషాధిక్య రంగాలుగా ముద్రపడిన వాటిలో మహిళా స్టార్టప్ ఫౌండర్‌లకు ఇది మరింత పెద్ద సవాలు.

కానీ ఈ అతిపెద్ద సవాలును ఎలాంటి అవరోధాలు లేకుండానే అధిగమించారు ఆకాంక్ష జగ్వానీ, అప్నీ అగర్వాల్. సింగపూర్ కేంద్రంగా వీరు శ్రీకారం చుట్టిన స్టార్టప్ 'సిక్స్‌సెన్స్' (ఎస్ఎస్)కు లీడింగ్ వెంచర్ క్యాపిటల్స్ నుంచి నైతిక,ఆర్థిక మద్దతు లభించింది. ఇద్దరు ఉద్యోగులతో మొదలైన ఈ స్టార్టప్ విజయపథంలో దూసుకుపోతుంది.

'సిక్స్‌సెన్స్' అనేది ఏ.ఐ ఆధారిత డిఫెక్ట్ ఎనాలటిక్స్ ప్లాట్‌ఫామ్. సాంకేతికలోపాలను గుర్తించడంలో ఉపయోగపడే క్లాసిఫికేషన్ సాఫ్ట్‌వేర్ ఇది. ఏ.ఐ సాంకేతికతను ఉపయోగించి 'ఎస్ ఎస్' టెక్ ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా వందలాది ప్రాడక్ట్స్‌ను స్కాన్ చేస్తోంది. ఎక్కువ నష్టం జరగక ముందే మాన్యుఫాక్చరింగ్ ఎక్విప్‌మెంట్‌లో లోపాలను గుర్తిస్తోంది. ఆపరేషనల్ మిస్టేక్స్‌లో అధిక ఆర్థిక నష్టం జరగకుండా చూస్తోంది.

లోపాలను గుర్తించడం మాత్రమే కాదు, అవి ఎందుకు తలెత్తుతున్నాయో ఇంజనీర్‌లకు ఈ ప్లాట్‌ఫామ్ వివరిస్తుంది.

'ఎస్ ఎస్' కో–ఫౌండర్, సీటివో అప్నీ అగర్వాల్ అలహాబాద్‌లోని 'మోతిలాల్ నెహ్రూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'లో కంప్యూటర్ సైన్స్ చదువుకుంది. డాటా సైన్స్‌లో మంచి పట్టు ఉంది. చదువు పూర్తయిన తరువాత ఒక ప్రముఖ సంస్థలో పనిచేసి 'బ్రిలియెంట్' అనిపించుకుంది అగర్వాల్. ఈ సంస్థలో పనిచేయడం ద్వారా లాంచింగ్ ప్రాడక్ట్స్ నుంచి మెనేజింగ్ కంపెనీ కల్చర్ వరకు ఎన్నో విషయాలను ప్రాక్టికల్‌గా తెలుసుకుంది. ఆ సమయంలో తాను ప్రధానంగా గమనించిన విషయం ఏమిటంటే, టెక్నాలజీ పరంగా సంస్థలు ఏ మేరకు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నాయని.

డిజిటల్ ప్రపంచంలోకి అడుగు పెట్టాల్సిన అనివార్యత ఉన్నప్పటికీ ఎన్నో పరిశ్రమలు దానికి దూరంగా ఉండడాన్ని అగర్వాల్ గమనించింది. పరిశ్రమలకు ఆధునిక సాంకేతికతను పరిచయం చేసే బాధ్యతను తానే తీసుకుంటే ఎలా ఉంటుంది అని ఆలోచించింది. దీనికి ఎంతో అధ్యయనం అవసరం. కొత్త విషయాలు నేర్చుకోవడం అవసరం. తాను అందుకు రెడీ అయింది.

అయితే ఏ అంశంపై ప్రధానంగా దృష్టి పెట్టాలనే విషయంలో అగర్వాల్‌లో స్పష్టత లోపించింది. దీంతో తన స్నేహితురాలు ఆకాంక్షను కలుసుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, ఆగ్‌మెంటెడ్ రియాలిటీ...ఇలా ఎన్నో విషయాల గురించి మాట్లాడుకున్న తరువాత తమ ప్రధాన టార్గెట్ 'మాన్యుఫాక్చర్ ఇండస్ట్రీ' అని తేల్చుకున్నారు. డిజిటల్ ట్రాన్స్‌ఫర్‌మేషన్‌కు మాన్యుఫాక్చరింగ్ రంగం అన్ని రకాలుగా అనుకూలమైనది అనే అంచనాకు వచ్చారు. అది పరీక్ష సమయం. మానసికంగా ఎంత బలంగా ఉన్నాసరే, ఏమవుతుందో ఏమో! అనే సందేహం చెవిలో జోరీగలా డిస్టర్బ్ చేస్తున్న సమయం. ఆ జోరీగను దగ్గర రాకుండా చేసి 'ఎస్. మేము తప్పకుండా విజయం సాధిస్తాం' అని ఒకటికి రెండుసార్లు గట్టిగా అనుకున్నారు ఇద్దరు మిత్రులు.

ఒక ఫైన్‌మార్నింగ్ ఉద్యోగానికి రాజీనామా చేసి ఎంటర్‌ప్రెన్యూర్ ఫస్ట్ టాలెంట్ ఇన్‌వెస్టర్ ప్రోగ్రామ్‌లో పాల్గొనడానికి సింగపూర్ విమానం ఎక్కింది అప్నీ అగర్వాల్. అలా సింగపూర్ కేంద్రంగా 'సిక్స్ సెన్స్' స్టార్టప్ పట్టాలకెక్కింది. సింగపూర్‌ను కేంద్రంగా ఎంచుకోవడానికి కారణం అక్కడ మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమలు ఎక్కువగా ఉండడమే.

'మ్యాథ్స్ ప్రాబ్లం నుంచి టెక్నికల్ ప్రాబ్లం వరకు రకరకాల సమస్యలను పరిష్కరించం అంటే నాకు చిన్నప్పటి నుంచి ఇష్టం. అందులో చెప్పలేనంత సంతోషం దొరుకుతుంది. ఆ సంతోషమే నన్ను ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యేలా చేసింది' అంటుంది అప్నీ అగర్వాల్.

'ఎస్ ఎస్' కో–ఫౌండర్, సీయివో ఆకాంక్ష జగ్వానీ(ముంబై) మెకానికల్ ఇంజనీరింగ్ చదువుకుంది. ఆమెకి ప్రముఖ సంస్థలో పనిచేయడం కంటే ఒక సంస్థను ప్రారంభించి దాన్ని ప్రముఖ సంస్థల జాబితాలో కనిపించేలా చేయాలనేది కాలేజీ రోజుల నాటి కల.

'ఎస్ ఎస్' ద్వారా తన కోరిక నెరవేరింది. విజయపథంలో దూసుకుపోతున్న 'సిక్స్ సెన్స్' తాజాగా వెంచర్ క్యాపిటల్ సంస్థ 'టిన్ మెన్' నిధులతో మరింత విస్తరించే పనిలో ఉంది. ఆల్ ది బెస్ట్.

● గేమింగ్ నేడే విడుదల

హల్‌చల్‌కు ఛలో!



ఫస్ట్ పర్సన్ షూటర్ గేమ్ 'కాల్ ఆఫ్ డ్యూటీ: మోడ్రన్ వార్‌ఫేర్–2' నేడు విడుదల అవుతుంది. 2019లో వచ్చిన మోడ్రన్ వార్‌ఫేర్‌కు సీక్వెల్‌గా వస్తున్న గేమ్ ఇది. గ్లోబల్ టెర్రరిజంపై నడిచే ఈ కథలో ప్లేయర్స్ కోసం గన్ హ్యాండ్లింగ్, షూటింగ్‌లలో కొత్త ఫీచర్స్ ప్రవేశపెట్టారు. నాకౌట్, మిస్టీరియస్ రైడ్ మోడ్‌లాంటి కొత్త రకం గేమ్ మోడ్స్ ఉంటాయి. అడ్వాన్స్‌డ్ ఏఐ మోడ్ సిస్టమ్ మరో ప్రత్యేకత. గత గేమ్‌లోని కెప్టెన్ జాన్‌ప్రైస్‌లాంటి పాత్రలు మళ్లీ పలకరించనున్నాయి.

మోడ్స్: సింగిల్ ప్లేయర్, మల్టీ ప్లేయర్
జానర్: ఫస్ట్–పర్సన్ షూటర్;
ప్లాట్‌ఫామ్: ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్, విండో పీసి



ఐరిష్ గుడ్‌బై అంటే?

అందరూ ఒక దగ్గర కలుసుకున్నప్పుడు లేదా పార్టీ చేసుకుంటున్నప్పుడు వారిలో ఎవరైనా వెళ్లే ముందు 'వెళుతున్నాను' అని చెప్పడం సహజ విషయం. అలా కాకుండా చెప్పా పెట్టకుండా వెళ్లిపోతే దీన్ని 'ఐరిష్ గుడ్‌బై' అంటారు. బోస్టన్, మసాచుసెట్స్ (యూఎస్) ప్రాంతాల నుంచి 'ఐరిష్ గుడ్‌బై' అనే మాట పుట్టిందని ఒక అభిప్రాయం ఉంది. ఈ ప్రాంతాలలో ఐరిష్–అమెరికన్ జనాభా ఎక్కువ. మందు తలకెక్కిన తరువాత కొందరు ఐరిష్ కుర్రాళ్లు ఎవరికీ చెప్పకుండా పార్టీ నుంచి వెళ్లి పోయేవారట! సింగర్–సాంగ్ రైటర్ మారియ టేలర్ 'ఐరిష్ గుడ్‌బై' పేరుతో పాట కూడా రాశారు.

● టెక్..టాక్

యూట్యూబ్‌లో కొత్తగా...

ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ కొన్ని కొత్త ఫీచర్స్, కొత్త డిజైన్...స్థూలంగా చెప్పాలంటే చిన్నపాటి మేకోవర్‌తో ముందుకు వస్తుంది. యూట్యూబ్ కమ్యూనిటీ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా కొత్త టూల్స్ ప్రవేశపెట్టినట్లు కంపెనీ తెలియజేసింది. కొత్త 'అంబియెంట్ మోడ్'తో వీడియోలకు మ్యాచ్ అయ్యేలా బ్యాక్‌గ్రౌండ్ కలర్‌ను అడ్జెస్ట్ చేసుకోవచ్చు. ప్రిసైజ్ సీకింగ్ ఫీచర్‌తో వీడియోలో తమకు ఆసక్తికరమైన భాగాన్ని వేగంగా గుర్తించడానికి వీక్షకులకు అవకాశం ఉంటుంది.

● ఆర్ట్ అండ్ కల్చర్

రక్తకన్నీరు

ఇండోనేసియా కార్టూనిస్ట్ జీటెట్ కుస్తాన గీసిన కార్టూన్ ఇది. భూగ్రహం ఎదుర్కొంటున్న పర్యావరణ సంక్షోభాన్ని రక్తకన్నీరు రూపంలో ఇలా కళ్లకు కట్టాడు. పర్యావరణ అంశాలనే ప్రధాన ఎజెండాగా కార్టూన్‌లు గీస్తున్నాడు కుస్తాన. ఫ్రీలాన్స్ కార్టూనిస్ట్ అయిన కుస్తాన 'నాకు నేనే బాస్. నాకు నేనే సబార్డినేట్' అని చెప్పుకుంటాడు. ప్రతిరోజు ఏదో ఒక సమయంలో తన ఐడియాలను రికార్డ్ చేస్తుంటాడు. 'కార్టూన్ అనేది విశ్వభాష' అని చెప్పే ఈ కార్టూనిస్ట్ మన దేశంతో సహా ఎన్నో దేశాల్లో తన కార్టూన్ ప్రదర్శనలు ఇచ్చాడు.



స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
213	81
59,757	17,737

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	10,872	▽	99
డోజోన్స్	32,232	▲	392
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,074	▲	18
డాక్స్	13,211	▲	15
షాంఘై	2,983	▽	17
నికాయ్	27,345	▽	87

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	50,779
బంగారం (99.5 స్వచ్ఛత)	50,576
వెండి (కిలో)	57,640

కేకేఆర్ చేతికి నెస్ డిజిటల్

డీల్ అంచనా విలువ రూ. 4,100 కోట్లు



న్యూఢిల్లీ: పూర్తిస్థాయి లైఫ్ సైకిల్ డిజిటల్ సర్వీసుల ట్రాన్స్‌ఫార్మేషన్ కంపెనీ నెస్ డిజిటల్ ఇంజినీరింగ్‌ను కొనుగోలు చేయనున్నట్లు పీఈ దిగ్గజం కేకేఆర్ తాజాగా పేర్కొంది. 100 శాతం వాటాను సొంతం చేసుకునేందుకు రోహటిన్ గ్రూప్‌తో తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. డీల్ అంచనా విలువను 50 కోట్ల డాలర్లు(రూ. 4,100 కోట్లు)గా సంబంధిత వర్గాలు అంచనా వేస్తున్నాయి. న్యూజెర్సీ కేంద్రంగా పనిచేస్తున్న సంస్థ డిజిటల్ సాఫ్ట్‌వేర్ ప్రాడక్టులు, ప్లాట్‌ఫామ్స్‌ను అభివృద్ధి చేయడంలో ప్రత్యేకతను కలిగి ఉంది. తూర్పు ఐరోపా, అమెరికా, ఇండియాలో కంపెనీ తరపున 4,000 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

రూపాయి 48 పైసలు అప్



ముంబై: ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో గురువారం డాలర్ మారకంలో రూపాయి విలువ 48 పైసలు లాభపడి, 82.33 వద్ద ముగిసింది. ఆరు కరెన్సీలతో ట్రేడయ్యే డాలర్ ఇండెక్స్ తన గరిష్ట స్థాయిల నుంచి కొంత బలహీనపడ్డం (114 స్థాయి నుంచి 111 స్థాయికి) రూపాయికి బలాన్ని ఇచ్చింది. ఈక్విటీ మార్కెట్ల లాభాల బాట కూడా దేశీయ కరెన్సీ సెంటిమెంట్‌ను బలపరిచిందని ఫారెక్స్ ట్రేడర్స్ పేర్కొన్నారు. మంగళవారం రూపాయి విలువ 82.81 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 82.14–82.52 శ్రేణిలో ట్రేడింగ్ జరిగింది. రూపాయి ఈ నెల 19వ తేదీ చరిత్రాత్మక కనిష్టం 83 వద్ద ముగియగా, 20వ తేదీ ఇంట్రాడే ట్రేడింగ్‌లో చరిత్రాత్మక కనిష్ట స్థాయి 83.05ను కూడా తాకింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-10-2022	
విశాఖ	500–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500–00
విజయవాడ	500–00
రిటైల్ ధర (డజను)	72.00
27-10-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	490–00
వరంగల్	492–00
రిటైల్ ధర	5.50

3న ద్రవ్యోల్బణంపై ఆర్‌బీఐ ఎంపీసీ భేటీ

కేంద్రానికి నివేదికపై కసరత్తు



ముంబై: గవర్నర్ శక్తికాంత్‌దాస్ నేతృత్వంలోని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆరుగురు సభ్యుల ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) నవంబర్ 3వ తేదీన ద్రవ్యోల్బణం సవాళ్లపై ప్రత్యేకంగా సమావేశం కానుంది. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు– రెపో (ప్రస్తుతం 5.9 శాతం) నిర్ణయానికి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం 6 శాతంలోపు ఉండాల్సి ఉండగా, ఈ ఏడాది జనవరి నుంచి ఆపైనే ధరల స్పీడ్ కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి పరిస్థితి ఎందుకు ఏర్పడిందన్న అంశంపై కేంద్రానికి ఆర్‌బీఐ ఒక నివేదిక సమర్పించనుంది. ఈ నివేదిక రూపకల్పనపైనే నవంబర్ 3న జరిగిన ఆర్‌బీఐ ఎంపీసీ చర్చించనుందని అత్యున్నత స్థాయి వర్గాలు వెల్లడించాయి.

సెక్షన్ 45జెడ్ ఎన్ కింద...

సెంట్రల్ బ్యాంక్ తన లక్ష్యాన్ని విఫలం కావడానికి సంబంధించిన ఆర్‌బీఐ చట్టం 45జెడ్ ఎన్ సెక్షన్ కింద ఈ సమావేశం జరగనుందని ఒక అధికారిక ప్రకటన తెలిపింది. తన చర్యల గురించి ఆర్‌బీఐ కేంద్రానికి వివరణ ఇవ్వడం 2016లో ఎంపీసీ ఏర్పాటయిన తర్వాత ఇదే తొలిసారి కావడం గమనార్హం. మే తర్వాత సెంట్రల్ బ్యాంక్ ద్రవ్యోల్బణం కట్టడి లక్ష్యంగా రెపో రేటును నాలుగు దఫాలుగా 4 నుంచి 5.9 శాతానికి పెంచింది. ఆర్‌బీఐ తదుపరి ద్వైమాసిక సమావేశం డిసెంబర్ 5 నుంచి 7వ తేదీ మధ్య జరగనున్న నేపథ్యంలో వచ్చేనెల 3న జరిగే 'ద్రవ్యోల్బణంపై' కీలక భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది.

టీడీఎస్ ఫైలింగ్‌కు నవంబర్ వరకు గడువు



న్యూఢిల్లీ: త్రైమాసికం వారీగా ఫామ్ 26క్యూ రూపంలో దాఖలు చేసే టీడీఎస్ స్టేట్‌మెంట్‌కు సంబంధించి ఆదాయపన్ను శాఖ కొంత ఉపశమనం కల్పించింది. జూన్ త్రైమాసికానికి సంబంధించి టీడీఎస్ స్టేట్‌మెంట్‌ను నవంబర్ 30 వరకు దాఖలు చేయవచ్చని అదనపు గడువు ఇచ్చింది. వేతనం కాకుండా ఇతర టీడీఎస్‌లకు సంబంధించి త్రైమాసికం వారీగా టీడీఎస్ రిటర్నులను ఫామ్ 26క్యూ రూపంలో దాఖలు చేస్తుంటారు. ''సవరించిన, అప్‌డేట్ చేసిన టీడీఎస్ స్టేట్‌మెంట్ దాఖలులో నెలకొన్న ఇబ్బందుల నేపథ్యంలో జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి సంబంధించి ఫామ్ 26క్యూ దాఖలు గడువును అక్టోబర్ 31 నుంచి నవంబర్ 30కి పొడిగించామ'ని సీబీడీటీ పేర్కొంది.

సెన్సెక్స్ 213 పాయింట్లు ప్లస్

- 17,700 పైకి నిఫ్టీ
- ఆదుకున్న ఆఖరి గంట కొనుగోళ్లు
- ఇంట్రాడేలో ఒడిదుడుకుల ట్రేడింగ్
- ప్రపంచ మార్కెట్ల బలహీన సంకేతాలు
- ఎఫ్అండ్ఓ కాంట్రాక్టుల ముగింపు నేపథ్యం
- ఐటీ షేర్లకు మాత్రమే నష్టాలు



ముంబై: ఎఫ్అండ్ఓ డెరివేటివ్స్ కాంట్రాక్టుల ముగింపు రోజైన గురువారం దేశీయ స్టాక్ సూచీలు లాభంతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలను విస్మరిస్తూ సెన్సెక్స్ 213 పాయింట్లు పెరిగి 59,757 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 81 పాయింట్లు బలపడి 17,737 వద్ద నిలిచింది. ఉదయం లాభాలతో ట్రేడింగ్‌ను ప్రారంభించిన సూచీలు తొలి సెషన్‌లో సానుకూలంగా కదిలాయి. యూరప్ మార్కెట్ల నష్టాల ప్రారంభంతో మిడ్‌సెషన్‌లో ఆరంభ లాభాల్ని కోల్పోయాయి. చివరి గంటలో మెటల్, రియల్టీ, ఇంధన, విద్యుత్ షేర్లు రాణించడంతో సూచీలు లాభాలతో గట్టెక్కాయి. డాలర్ రూపాయి బలపడటంతో ఐటీ షేర్లు మాత్రమే నష్టాలను చవిచూశాయి. బీఎస్‌ఈలో మిడ్‌క్యాప్ సూచీ పావు శాతం, స్మాల్‌క్యాప్ సూచీ అరశాతం చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1580 కోట్ల షేర్లను అమ్మారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2818 కోట్ల షేర్లను కొన్నారు. యూరోపియన్ యూనియన్ బ్యాంక్ ద్రవ్య పాలసీ ప్రకటనకు ముందు అంతర్జాతీయ మార్కెట్లలో అప్రమత్తత చోటు చేసుకుంది. సెన్సెక్స్ 213 పాయింట్ల లాభంతో బీఎస్‌ఈలో రూ.1.46 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.277.13 లక్షల కోట్లకు చేరింది.

ఇంట్రాడే ట్రేడింగ్ ఇలా

బలిప్రతిపద సెలవురోజు తర్వాత ఉదయం సెన్సెక్స్ 248 పాయింట్ల లాభంతో 59,792 వద్ద, నిఫ్టీ 115 పాయింట్లు పెరిగి 17,771 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ఇంట్రాడే సెన్సెక్స్ 59,497 కనిష్టాన్ని, 59,960 గరిష్టాన్ని అందుకుంది. నిఫ్టీ 17,655 – 17,784 శ్రేణిలో ట్రేడైంది.

''ప్రపంచ మార్కెట్లలోని ప్రతికూలతలతో పాటు క్రూడాయిల్ రికవరీ అంశాలు దేశీయ మార్కెట్‌పై ఒత్తిడిని పెంచాయి. టెక్ కంపెనీల క్వార్టర్ ఫలితాలు నిరాశపరచడంతో యూఎస్ మార్కెట్లలో అమ్మకాలు తలెత్తాయి. గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్‌లుగా నిఫ్టీకి 17800 వద్ద నిరోధం ఎదురవుతుంది. 17625 వద్ద తక్షణ మద్దతు లభిస్తుంది. అంతర్జాతీయ ఆర్థిక మందగమన సంకేతాల నేపథ్యంలో కేంద్ర బ్యాంకులు సులభతర ద్రవ్య విధాన వైఖరికి మొగ్గుచూపొచ్చనే అంచనాలు కలిసొచ్చాయి'' అని రిలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ హెడ్ అజిత్ మిశ్రా తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- బాద్‌షా మసాలాలో మెజారిటీ వాటా (51 శాతం) కొనుగోలు ఒప్పందంతో డాబర్ ఇండియా షేరు మూడుశాతానికి పైగా లాభపడి రూ.549 వద్ద ముగిసింది.
- క్యూ2 త్రైమాసిక ఫలితాలు నిరాశపరచడంతో బీఎస్‌ఈలో గ్లాండ్ ఫార్మా షేరు 15% నష్టపోయి రూ.1890 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 15.50 శాతం క్షీణించి రూ.1878 వద్ద ఏడాది కనిష్టాన్ని తాకింది.
- ఏడేళ్ల తర్వాత తొలిసారి సన్‌ఫార్మా షేరు రూ.1000 స్థాయిని అధిగమించింది. మార్కెట్ ముగిసే సరికి రెండుశాతం లాభపడి రూ.1,012 వద్ద స్థిరపడింది.

యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ వడ్డీ బాదుడు

- 0.75 శాతం పెంపు
- మాంద్యం భయాలకన్నా... ద్రవ్యోల్బణం కట్టడికే మొగ్గు



ఫ్రాంక్‌ఫర్ట్: మాంద్యం భయాలకన్నా, ద్రవ్యోల్బణం కట్టడికే యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ ప్రాధాన్యత ఇచ్చింది. వడ్డీరేటును 0.75% పెంచుతూ 25 మంది సభ్యుల గవర్నింగ్ కౌన్సిల్ గురువారం ఇక్కడ కీలక నిర్ణయం తీసుకుంది. యూరో కరెన్సీ చరిత్రలోనే ఒకేసారి ఈ స్థాయి రేటు పెంపు ఇదే తొలిసారి. ఈ ఏడాది మూడవ రేటు పెంపు నిర్ణయమిది. 19 దేశాల యూరోజోన్ ఆర్థిక వ్యవస్థపై పొంచి ఉన్న మాంద్యం ముప్పు నేపథ్యంలో సెంట్రల్ బ్యాంక్ తీసుకున్న నిర్ణయానికి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ద్రవ్యోల్బణం కట్టడే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈసీబీ ప్రెసిడెంట్ క్రిస్టినా లగార్డ్ పేర్కొన్నారు. అమెరికాసహా పలు దేశాల సెంట్రల్ బ్యాంకులు ద్రవ్యోల్బణం స్పీడ్ కట్టడికి వడ్డీరేట్లను పెంచుతున్న సంగతి తెలిసిందే. యూరోజోన్‌లో 2% లక్ష్యానికి మించి, ప్రస్తుతం ద్రవ్యోల్బణం 9.9%కి ఎగసింది.

టాటా కెమ్ లాభం హైజంప్

క్యూ2లో రూ. 628 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) రెండో త్రైమాసికంలో ప్రయివేట్ రంగ దిగ్గజం టాటా కెమికల్స్ ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం మూడు రెట్లు జంప్‌చేసి రూ. 628 కోట్లను తాకింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 221 కోట్లు ఆర్జించింది. నికర ఆదాయం సైతం 40 శాతం ఎగసి రూ. 4,299 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 3,079 కోట్ల టర్నోవర్ మాత్రమే ప్రకటించింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 2,805 కోట్ల నుంచి రూ. 3,623 కోట్లకు పెరిగాయి. టాటా గ్రూప్ కంపెనీ సస్యరక్షణ, స్పెషాలిటీ కెమికల్స్ తదితరాలను తయారు చేసే సంగతి తెలిసిందే. సోడా యాష్ ధరలు బలపడటంతో యూఎస్, యూకే, కెన్యా నుంచి లాభదాయకత భారీగా మెరుగుపడినట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో టాటా కెమికల్స్ షేరు 0.7 శాతం బలపడి రూ. 1,188 వద్ద ముగిసింది.

పీఎన్‌బీ హౌసింగ్ భేష్..!

క్యూ2లో రూ. 263 కోట్లు



న్యూఢిల్లీ: ఎన్‌బీఎఫ్‌సీ.. పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం దాదాపు 12 శాతం పుంజుకుని రూ. 263 కోట్లకు చేరింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 235 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,586 కోట్ల నుంచి రూ. 1,683 కోట్లకు ఎగసింది. కీలకమైన వడ్డీ ఆదాయం 6.5 శాతం వృద్ధితో రూ. 1,597 కోట్లను అధిగమించింది. నికర వడ్డీ మార్జిన్లు 3.01 శాతం నుంచి 4.14 శాతానికి మెరుగుపడ్డాయి. ఈ కాలంలో స్థూల మొండిబకాయిలు 0.3 శాతం తగ్గి 6.05 శాతానికి చేరగా, నికర ఎన్‌పీఏలు 4.26 శాతం నుంచి 3.59 శాతానికి దిగొచ్చాయి.

ఫలితాల నేపథ్యంలో పీఎన్‌బీ హౌసింగ్ షేరు 4.6 శాతం జంప్‌చేసి రూ. 451 వద్ద ముగిసింది.

వీగార్డ్ లాభంలో క్షీణత

క్యూ2లో రూ. 44 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) రెండో త్రైమాసికంలో ఎలక్ట్రికల్ గూడ్స్ కంపెనీ వీగార్డ్ ఇండస్ట్రీస్ నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 27% క్షీణించి రూ.44 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 59 కోట్లకుపైగా ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 9% పుంజుకుని రూ. 986 కోట్లను దాటింది. అయితే మొత్తం వ్యయాలు 12%పైగా పెరిగి రూ. 930 కోట్లను తాకాయి. కాపర్ ధరలు బలహీనపడటంతో ఖరీదైన వైర్ల అమ్మకాలలో తగిన ధరలు లభించకపోవడం, ముడివ్యయాలు పెరగడం వంటి అంశాలు మార్జిన్లను దెబ్బతీసినట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో వీగార్డ్ షేరు 2 శాతం నష్టంతో రూ. 254 వద్ద ముగిసింది.

సినిమా

చెన్నైలో వారసుడు



● విజయ్, ఖుష్బూ, రష్మిక

విజయ్ హీరోగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో రూపొందుతున్న తమిళ సినిమా 'వారిసు' (తెలుగులో 'వారసుడు'). ఇందులో రష్మికా మందన్నా హీరోయిన్. 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం చెన్నైలో జరుగుతోంది. కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా కొత్త వర్కింగ్ స్టిల్స్‌ను రిలీజ్ చేశారు. శరత్‌కుమార్, ప్రభు, ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్, జయసుధ, శ్యామ్, యోగిబాబు, సంగీత, ఖుష్బూ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు తమన్ సంగీతదర్శకుడు. హర్షిత్ రెడ్డి, హన్షిత సహ–నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ సినిమా వచ్చే సంక్రాంతికి రిలీజ్ కానుంది.


యశోద ఎవరో తెలుసు కదా?



● సమంత

'మీకు ఎప్పుడైనా రెండు గుండె చప్పుళ్లు వినిపించాయా? బిడ్డను కడుపులో మోస్తున్న తల్లికి మాత్రమే అది వినిపిస్తుంది' అనే సమంత డైలాగ్‌తో 'యశోద' సినిమా ట్రైలర్ విడుదలైంది. సమంత టైటిల్ రోల్‌లో హరి–హరీష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'యశోద'. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ సినిమా నవంబర్ 11న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను విజయ్ దేవరకొండ, తమిళంలో సూర్య, హిందీలో వరుణ్ ధావన్, కన్నడంలో రక్షిత్ శెట్టి, మలయాళంలో దుల్కర్ సల్మాన్ విడుదల చేశారు. 'షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్, కరణ్ జోహార్, శిల్పా శెట్టి, సన్నీ లియోన్.. వీళ్లంతా సరోగసీ పేరెంట్స్', 'యశోద ఎవరో తెలుసు కదా? ఆ కృష్ణ పరమాత్ముణ్ణి పెంచిన తల్లి' వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ సందర్భంగా శివలెంక కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ– ''ఇదొక సీట్ ఎడ్జ్ థ్రిల్లర్. అన్ని భాషల్లో మా ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన లభిస్తోంది. సమంత నటన, కాన్సెప్ట్, మణిశర్మ నేపథ్య సంగీతం గురించి మాట్లాడుతున్నారు'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, కెమెరా: ఎం. సుకుమార్, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: రవికుమార్ జీపీ, రాజా సెంథిల్, లైన్ ప్రొడ్యూసర్: విద్య శివలెంక, సహనిర్మాత: చింతా గోపాలకృష్ణారెడ్డి.

వీర పోరాటం



● బాలకృష్ణ

బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'వీరసింహారెడ్డి'. ఇందులో శ్రుతీ హాసన్ హీరోయిన్. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం కోసం ప్రస్తుతం బాలకృష్ణ, విలన్లపై భారీ పోరాట సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''కథలో కీలక సమయంలో రానున్న ఈ యాక్షన్ ఎపిసోడ్‌ని ఫైట్ మాస్టర్ వెంకట్ పర్యవేక్షిస్తున్నారు. 2023 సంక్రాంతికి చిత్రాన్ని విడుదల చేస్తున్నాం'' అన్నారు. దునియా విజయ్, వరలక్ష్మీ శరత్‌కుమార్, చంద్రికా రవి (స్పెషల్ నంబర్) తదితరులు ఇతర కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: రిషి పంజాబీ, సీఈఓ: చిరంజీవి (చెర్రీ), ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: చందు రావిపాటి, లైన్ ప్రొడ్యూసర్: బాలసుబ్రమణ్యం కేవీవీ.

అందుకే వస్తా ఉండా...



● సుధీర్‌బాబు

సుధీర్‌బాబు ముప్పైమూడేళ్లు వెనక్కి వెళ్లనున్నారు. సుధీర్‌బాబు హీరోగా జ్ఞానశేఖర్ ద్వారక దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుంది. ఈ సినిమా కోసమే సుధీర్ అన్నేళ్లు వెనక్కి వెళ్లనున్నారు. సౌత్ బొంబాయికి చెందిన అరుణ్ గౌలి నుంచి చిత్తూరు జిల్లా కుప్పంకు చెందిన సుబ్రమణ్యంకు వచ్చిన ఇన్‌ల్యాండ్ లెటర్‌తో ఈ సినిమాను ప్రకటించారు. ''పిలిసినంక రాకుంటే ఎట్ల సెప్పండ.. అందుకే వస్తా ఉండా!'' అని చిత్తూరు యాసతో కూడిన భాషతో ట్వీట్ చేశారు సుధీర్‌బాబు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ పతాకంపై సుమంత్ జి. నాయుడు ఈ సినిమాను నిర్మించనున్నారు. ''ఓ దైవిక అంశంతో కూడిన పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్ ఇది. 1989లో కుప్పంలో జరిగే కథ'' అని చిత్ర యూనిట్ వెల్లడించింది.

నేటి తరానికి ఆయన సినిమాలు కావాలి - దర్శకుడు శేఖర్ కమ్ముల



● కల్పన, సోహైల్, శేఖర్ కమ్ముల, ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి, సి. కల్యాణ్

'బిగ్ బాస్' ఫేమ్ సోహైల్, మృణాళిని జంటగా డా. రాజేంద్ర ప్రసాద్, మీనా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఆర్గానిక్ మామ.. హైబ్రిడ్ అల్లుడు'. ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో కె. అచ్చిరెడ్డి సమర్పణలో కోనేరు కల్పన నిర్మించిన ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ సినిమాకు దర్శకత్వం వహించడంతో పాటు కథ, స్క్రీన్ ప్లే, సంగీతం కూడా ఎస్వీ కృష్ణారెడ్డినే అందించడం విశేషం. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరై, ట్రైలర్‌ను లాంచ్ చేసిన దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ– ''కథ, స్క్రీన్‌ప్లే, సంగీతం, దర్శకత్వం ఎస్వీ కృష్ణారెడ్డి అనే ఈ టైటిల్ కార్డు చూసి చాలా రోజులయింది. అది చూస్తుంటేనే చాలా సంతోషం అనిపిస్తోంది. ట్రైలర్ చూశాక కృష్ణారెడ్డిగారు కమ్ బ్యాక్ అని గట్టిగా చెప్పవచ్చు. కృష్ణారెడ్డిగారి సినిమాలంటే ఒక రిలీఫ్. ఆయన మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. బిజీ లైఫ్స్ గడుపుతున్న నేటి తరానికి ఆయన సినిమాలు అవసరమని నా భావన'' అన్నారు. ''ఈ సినిమా విషయంలో నా ప్రమేయం ఏమీ లేదు. అంతా నా భార్య కల్పననే చూసుకున్నారు. దర్శక–నిర్మాతలకు ఈ సినిమా పెద్ద సక్సెస్ ఇవ్వాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు నిర్మాత సి. కల్యాణ్. ''ఆర్గానిక్ మామ.. హైబ్రిడ్ అల్లుడు' సినిమా ప్రేక్షకుల ముందుకు రావటానికి రెడీ అవుతోంది అంటే దానికి నేను కూడా ఒక కారణం తప్ప.. నేనే కారణం కాదు. నేను 40 దాకా సినిమాలు చేశాను. నిర్మాత కల్పనగారి అంకితభావం, ప్రణాళిక చూసి షాక్ అయ్యాను. వారి ప్రొడక్షన్ హౌస్‌లో, నా కెరీర్‌లో ఇది బెస్ట్ అని చెబుతున్నాను. అచ్చిరెడ్డి ఇచ్చిన ధైర్యంతోనే దర్శకుడిని అయ్యాను.. ఇప్పుడు ఈ సినిమాకు మాటలు కూడా రాశాను. రాజేంద్ర ప్రసాద్ గారు నటనలో ఒక అద్భుతం. మీనాగారు సూపర్ నటి. సోహైల్‌ను కలిసిన తర్వాత 'యమలీల' చేసిన నేను మరో లీల చేయలేనా? అనిపించింది'' అన్నారు ఎస్వీ కృష్ణారెడ్డి. ''దర్శకుడు కృష్ణారెడ్డి మార్క్‌తో ప్రస్తుత జనరేషన్‌కు పర్‌ఫెక్ట్‌గా సరిపోయే సినిమా ఇది'' అన్నారు నిర్మాత కె. అచ్చిరెడ్డి. ''నా చిన్నప్పటి నుంచి కృష్ణారెడ్డిగారి సినిమాలు చూస్తూ పెరిగిన నేను ఆయన దర్శకత్వంలో నటించాను అనే నిజాన్ని ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను. నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన కల్పనగారికి ధన్యవాదాలు'' అన్నారు సోహైల్. ''కృష్ణారెడ్డిగారి హ్యాండ్ పడింది అంటే ఇక సోహైల్ స్టార్ అయినట్టే. మా గురువు కృష్ణారెడ్డిగారికి ఈ సినిమా పూర్వ వైభవం తీసుకురావాలని కోరుకుంటున్నా'' అన్నారు నటుడు అలీ.

బయోపిక్ కాదు.. రియల్ పిక్



● రామ్‌గోపాల్ వర్మ

దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ కొత్త సినిమాని అనౌన్స్ చేశారు. 'వ్యూహం' పేరుతో పార్ట్ 1, 'శపథం' పేరుతో పార్ట్ 2ని తీయనున్నట్లు ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. ''త్వరలో 'వ్యూహం' అనే రాజకీయ సినిమా తీయబోతున్నాను. ఇది బయోపిక్ కాదు.. బయోపిక్ కన్నా లోతైన రియల్ పిక్. బయోపిక్‌లో అయినా అబద్ధాలు ఉండొచ్చు కానీ, రియల్ పిక్‌లో నూటికి నూరుపాళ్ల నిజాలే ఉంటాయి. అహంకారానికి, ఆశయానికి మధ్య జరిగిన పోరాటం నుండి ఉద్భవించిన 'వ్యూహం' కథ రాజకీయ కుట్రల విషంతో నిండి ఉంటుంది. ఈ చిత్రం 'వ్యూహం, శపథం' పేర్లతో రెండు భాగాలుగా రాబోతోంది. నాతో 'వంగవీటి' సినిమా తీసిన దాసరి కిరణ్ 'వ్యూహం' నిర్మిస్తారు'' అన్నారు రామ్‌గోపాల్ వర్మ.


కొత్త రుద్రవీణ



● మధుసూదన్ రెడ్డి, శ్రీరామ్, శుభశ్రీ, లక్ష్మణ్

శ్రీరామ్, ఎల్సా, శుభశ్రీ హీరో హీరోయిన్లుగా మధుసూదన్ రెడ్డి దర్శకత్వంలో రాగుల గౌరమ్మ సమర్పణలో రాగుల లక్ష్మణ్, రాగుల శ్రీను నిర్మించిన చిత్రం 'రుద్రవీణ'. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో శ్రీరామ్ మాట్లాడుతూ – ''దర్శకుడు నన్ను ఓ మాస్ హీరోలా ఊహించుకొని నా పాత్రను చాలా చక్కగా మలిచారు. 'రుద్రవీణ' టైటిల్‌ను మా సినిమాకు పెట్టుకోవడానికి అవకాశం కల్పించిన చిరంజీవిగారికి ధన్యవాదాలు'' అన్నారు. ''నిర్మాతలు లక్ష్మణ్, శ్రీనుగార్లు నన్ను సొంత బ్రదర్‌లా ట్రీట్ చేశారు. వారికి ఈ కథ నచ్చడంతో అనుకున్న బడ్జెట్ ఎక్కువైనా సినిమాను నిర్మించి ప్రేక్షకుల ముందుకు తెస్తున్నారు'' అన్నారు మధుసూదన్ రెడ్డి. ''శ్రీరామ్, ఎల్సా, శుభశ్రీలు బాగా చేశారు. విలన్‌గా రఘు కుంచె నటన అద్భుతం. మనం ఎప్పుడూ చూడని ఓ కొత్త కథను ఈ సినిమాలో చూస్తారు'' అన్నారు రాగుల లక్ష్మణ్. ''మా అమ్మగారి నిర్మాణంలో ఈ సినిమా తీశాం'' అన్నారు రాగుల శ్రీను. ''రుద్రవీణ' కథ విని చాలా ఎగ్జయిట్ అయ్యాను. ఇందులో విలన్ క్యారెక్టర్ చేశాను. నా లుక్‌ను బాగా డిజైన్ చేశారు'' అన్నారు రఘు కుంచె. జగదీష్, గెటప్ శ్రీను, హీరోయిన్ శుభశ్రీ, శ్రీని, ఇన్నా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మార్కులు కాదు.. జీవితం ముఖ్యం



● సునీల్‌కుమార్

మనోజ్ నందం, ఫణి చక్రవర్తి, కృష్ణ తేజ, సోనీ రెడ్డి, మనీషా, మౌనిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'వెల్కమ్ టు తీహార్ కాలేజ్'. పి. సునీల్ కుమార్‌రెడ్డి దర్శకత్వంలో ఎల్ఎన్ రావు, యెక్కలి రవీంద్రబాబు నిర్మించిన ఈ చిత్రం నేడు థియేటర్స్‌లో రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో పి. సునీల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ – ''నేటి విద్యా వ్యవస్థలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నంబర్స్ (ర్యాంకులు) చట్రంలో చిక్కుకుని ఒత్తిడికి లోనవుతున్నారు. పరీక్ష ఫలితాలు వచ్చినప్పుడు కొందరు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం చూస్తున్నాం. ఫెయిల్యూర్స్‌ను కూడా విద్యార్థులు ఎదుర్కొనే ధైర్యం వారికి చదువే ఇవ్వాలి. అలాంటి సిస్టమ్ ఉండాలి. మార్కులు కాదు.. జీవితం ముఖ్యం అని ఈ సినిమాలో చెబుతున్నాం. ప్రస్తుతం చదలవాడ శ్రీనివాసరావుగారితో ఓ సినిమా, ట్రాన్స్‌జెండర్స్ జీవితాల ఆధారంగా మరో సినిమా చేయనున్నాను'' అని అన్నారు.



వేడ్‌కు 'పాజిటివ్'... అయినా నేడు బరిలోకి!

ఆస్ట్రేలియా టి20 క్రికెట్ జట్టులో మరో ప్లేయర్ కరోనా వైరస్ బారిన పడ్డాడు. ఇప్పటికే లెగ్ స్పిన్నర్ ఆడమ్ జంపా ఈ వైరస్ నుంచి కోలుకుంటుండగా... తాజాగా ఆసీస్ వికెట్ కీపర్ మాథ్యూ వేడ్ కరోనా పాజిటివ్‌గా తేలాడు. అతనికి స్వల్ప లక్షణాలు ఉన్నాయి. వేడ్ 'పాజిటివ్'గా ఉన్నా నేడు మెల్‌బోర్న్‌లో ఇంగ్లండ్‌తో జరిగే ప్రపంచకప్ కీలకమ్యాచ్‌లో బరిలోకి దిగనున్నట్లు సమాచారం. కోవిడ్ బారిన పడ్డ క్రికెటర్లు కూడా ఈ మెగా టోర్నీలో మ్యాచ్‌లు ఆడవచ్చని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) నిబంధనలు సవరించింది.

నాడు తండ్రి... నేడు కొడుకు

భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో 16 పరుగులు చేసిన నెదర్లాండ్స్ ప్లేయర్ బాస్ డి లీడ్ అరుదైన ఘనత సాధించాడు. బాస్ తండ్రి టిమ్ డి లీడ్ కూడా భారత్‌పై ప్రపంచకప్ మ్యాచ్ ఆడారు. 2003 వన్డే వరల్డ్ కప్‌లో పార్ల్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో నెదర్లాండ్స్ జట్టులో ఆయన ఉన్నారు. ఈ మ్యాచ్‌లో భారత్ నెగ్గినా... సచిన్, గంగూలీ, హర్భజన్, జహీర్ వికెట్లు తీసిన టిమ్ డి లీడ్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.



'డచ్'పై తీన్‌మార్

- భారత్ వరుసగా రెండో విజయం
- 56 పరుగులతో నెదర్లాండ్స్ ఓటమి
- సూర్య, కోహ్లి, రోహిత్ అర్ధ సెంచరీలు
- గ్రూప్‌లో అగ్రస్థానానికి టీమిండియా
- ఆదివారం దక్షిణాఫ్రికాతో తర్వాతి పోరు

వరల్డ్‌కప్‌లో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ భారత్ గురి తప్పలేదు. 'ఆరెంజ్' టీమ్‌పై తమదైన రేంజ్ ప్రదర్శన కనబర్చి అటు విజయంతోపాటు ఇటు రన్‌రేట్‌ను కూడా అమాంతం మెరుగుపర్చుకున్న టీమిండియా గ్రూప్–2లో అగ్ర స్థానానికి చేరింది. నెదర్లాండ్స్ సాధారణ బౌలింగ్‌ను ముగ్గురు బ్యాటర్లు అలవోకగా ఎదుర్కొని అర్ధ సెంచరీలు సాధించడంతోనే జట్టు మెరుగైన స్థితిలో నిలిచింది. ముఖ్యంగా సూర్యకుమార్ మెరుపులు ఇన్నింగ్స్‌లో హైలైట్‌గా నిలిచాయి. ఆ తర్వాత లక్ష్య ఛేదనలో 'డచ్' బృందం తేలిపోయింది. ఆ జట్టు కనీస స్థాయి ఆటను కూడా చూపించలేకపోవడంతో సంచలనానికి అవకాశం లేకపోయింది. సిడ్నీలో ఈ సమష్టి విజయంతో భారత్ మరింత ఉత్సాహంతో ఆదివారం పెర్త్‌లో దక్షిణాఫ్రికాతో సమరానికి సిద్ధం కానుంది.

సిడ్నీ: పాకిస్తాన్‌పై చిరస్మరణీయ గెలుపు తర్వాత మరో మ్యాచ్‌లో ఏకపక్ష విజయంతో భారత్ టి20 ప్రపంచకప్‌లో దూసుకుపోయింది. గురువారం జరిగిన గ్రూప్–2 పోరులో భారత్ 56 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్ యాదవ్ (25 బంతుల్లో 51 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), విరాట్ కోహ్లి (44 బంతుల్లో 62 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), రోహిత్ శర్మ (39 బంతుల్లో 53; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో చెలరేగారు. కోహ్లి రెండో వికెట్‌కు రోహిత్‌తో 73 పరుగులు (56 బంతుల్లో), మూడో వికెట్‌కు సూర్యకుమార్‌తో అభేద్యంగా 95 పరుగులు (48 బంతుల్లో) జోడించాడు. అనంతరం నెదర్లాండ్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 123 పరుగులు మాత్రమే చేయగలిగింది. టిమ్ ప్రింగిల్ (20) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో భువనేశ్వర్, అక్షర్, అశ్విన్, అర్ష్‌దీప్ తలా 2 వికెట్లు పడగొట్టారు.


సూర్య కుమార్

రాణించిన కెప్టెన్...



తొలి మ్యాచ్‌తో పోలిస్తే నెమ్మదిగా ఉన్న పిచ్‌పై రోహిత్ శర్మ ఆరంభంలో పూర్తి నియంత్రణతో ఆడలేకపోయాడు. అయితే అతి జాగ్రత్తకు పోకుండా ఏదోలా బౌండరీలు బాదేందుకే అతను ప్రయత్నించాడు. పవర్‌ప్లేలో భారత్ 32 పరుగులే చేయగలిగింది. మీకెరెన్ ఓవర్లో లెగ్‌సైడ్‌లో సిక్స్ బాదిన రోహిత్‌కు ఆ తర్వాత కాస్త అదృష్టం కూడా కలిసొచ్చింది. 13 పరుగుల వద్ద క్లాసెన్ బౌలింగ్‌లో రోహిత్ ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను ప్రింగిల్ వదిలేశాడు. 27 పరుగుల వద్ద బీక్ బౌలింగ్‌లో అంపైర్ ఎల్బీగా ప్రకటించినా, రివ్యూలో బంతి ముందుగా బ్యాట్‌కు తగిలినట్లు తేలింది. ఆ తర్వాత డి లీడ్ ఓవర్లో వరుసగా 4, 6 కొట్టిన అతను, ప్రింగిల్ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు బాది 35 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే తర్వాతి ఓవర్లో మరో భారీ షాట్‌కు ప్రయత్నించి రోహిత్ వెనుదిరిగాడు.

భువీ సూపర్ స్పెల్...

ఛేదనలో ఏ దశలోనూ నెదర్లాండ్స్ ఇన్నింగ్స్ సరైన దిశలో సాగలేదు. తక్కువ వ్యవధిలోనే వికెట్లు కోల్పోతూ వచ్చిన జట్టు కోలుకోలేకపోయింది. తన తొలి రెండు ఓవర్లలో ఒక్క పరుగూ ఇవ్వకుండా ఒక వికెట్ తీసిన భువనేశ్వర్ పూర్తిగా కట్టిపడేశాడు. కాస్త ధాటిగా ఆడే ప్రయత్నం చేసిన ఒ డౌడ్ (10 బంతుల్లో 16; 3 ఫోర్లు)ను అక్షర్ తన రెండో బంతికే పెవిలియన్ పంపించాడు. పవర్‌ప్లేలో స్కోరు 27 పరుగులు కాగా, అశ్విన్ ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీయడంతో స్కోరు 63/5 వద్ద నిలిచింది. అనంతరం 14 పరుగుల వ్యవధిలో నెదర్లాండ్స్ తర్వాతి 4 వికెట్లు చేజార్చుకుంది. ఓటమి ఖాయమైన తర్వాత అర్ష్‌దీప్ వేసిన ఆఖరి ఓవర్ చివరి 3 బంతులను వరుసగా ఫోర్లు కొట్టి మీకెరన్ డచ్ అభిమానులకు కాస్త ఆనందం పంచాడు.



ఆసాంతం దూకుడు...

ఇద్దరు సీనియర్లతో పోలిస్తే సూర్యకుమార్ మాత్రం ఎక్కడా తగ్గలేదు. వచ్చీ రాగానే బౌండరీలతో విరుచుకుపడ్డాడు. తాను ఎదుర్కొన్న తొలి 12 బంతుల్లోనే అతను 5 ఫోర్లు బాదాడు. మీకెరెన్, డి లీడ్ ఓవర్లలో అతను రెండేసి ఫోర్లు కొట్టాడు. ఇన్నింగ్స్ చివరి బంతికి బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ దిశగా చూడచక్కటి సిక్సర్ కొట్టడంతో 25 బంతుల్లోనే సూర్య అర్ధ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. చివరి 5 ఓవర్లలో భారత్ 65 పరుగులు రాబట్టింది.

చివర్లో జోరుగా...

కోహ్లి కూడా ఆరంభంలో ఎలాంటి సాహసాలకు పోలేదు. నిలదొక్కుకున్న తర్వాతే ధాటిగా పరుగులు రాబట్టేందుకు ప్రయత్నించాడు. తనదైన శైలిలో సింగిల్స్ తీయడంపైనే ఎక్కువగా దృష్టి పెట్టాడు. అతని ఇన్నింగ్స్‌లో 24 పరుగులే బౌండరీల ద్వారా రాగా, వికెట్ల మధ్య పరుగెత్తడం ద్వారానే 38 పరుగులు వచ్చాయి. క్లాసెన్ బౌలింగ్‌లో అతను కొట్టిన 'ఇన్‌సైడ్ అవుట్' సిక్స్ హైలైట్‌గా నిలిచింది. 37 బంతుల్లో కోహ్లి హాఫ్ సెంచరీ పూర్తయింది. తాను ఆడిన తొలి 30 బంతుల్లో 32 పరుగులే చేసిన విరాట్, తర్వాతి 14 బంతుల్లో 30 పరుగులు రాబట్టడం విశేషం.

రివ్యూ చేయకుండా...



ప్రపంచకప్‌లో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ కేఎల్ రాహుల్ (9) నిరాశపర్చాడు. ఇబ్బందిగా ఆడుతున్న అతడిని మీకెరెన్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. అంపైర్ ఎల్బీగా ప్రకటించిన అనంతరం అతను కెప్టెన్‌తో చర్చించాడు. రోహిత్ రివ్యూ తీసుకోమని సలహా ఇచ్చినా... రాహుల్ పట్టించుకోకుండా వెళ్లిపోయాడు. అయితే రీప్లేలో బంతి లెగ్‌సైడ్ దిశగా వెళుతున్నట్లు కనిపించింది. రివ్యూ కోరితే రాహుల్ పరిస్థితి భిన్నంగా ఉండేదేమో.

34 టి20 ప్రపంచకప్‌లలో రోహిత్ సిక్సర్ల సంఖ్య. భారత ఆటగాళ్లలో యువరాజ్ సింగ్ (33)ను దాటి అగ్ర స్థానంలో నిలిచాడు. ఓవరాల్‌గా క్రిస్ గేల్ (63) ముందున్నాడు.

20 అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో అత్యధిక మెయిడెన్ ఓవర్లు వేసిన భారత బౌలర్‌గా భువనేశ్వర్ (20 ఓవర్లు) నిలిచాడు. ప్రవీణ్ కుమార్, బుమ్రా (19 ఓవర్ల చొప్పున) పేరిట ఉన్న రికార్డును భువనేశ్వర్ సవరించాడు.

57 మూడు ఫార్మాట్‌లలో కలిపి ఈ ఏడాది భారత్ ఆడిన మ్యాచ్‌ల సంఖ్య. 2007లో భారత్ అత్యధికంగా 55 మ్యాచ్‌లు ఆడింది.

867 ఈ ఏడాది అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో సూర్యకుమార్ (25 మ్యాచ్‌ల్లో 867) టాప్ ర్యాంక్‌లోకి వచ్చాడు. పాకిస్తాన్ వికెట్ కీపర్ మొహమ్మద్ రిజ్వాన్ (20 మ్యాచ్‌ల్లో 839 పరుగులు) రెండో స్థానంలో ఉన్నాడు.


కోహ్లి

టి20 ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

గ్రూప్-1						
జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
న్యూజిలాండ్	2	1	0	1	3	4.450
శ్రీలంక	2	1	1	0	2	0.450
ఇంగ్లండ్	2	1	1	0	2	0.239
ఐర్లాండ్	2	1	1	0	2	-1.169
ఆస్ట్రేలియా	2	1	1	0	2	-1.555
అఫ్గానిస్తాన్	2	0	1	1	1	-0.620
గ్రూప్-2						
జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
భారత్	2	2	0	0	4	1.425
దక్షిణాఫ్రికా	2	1	0	1	3	5.200
జింబాబ్వే	2	1	0	1	3	0.050
బంగ్లాదేశ్	2	1	1	0	2	-2.375
పాకిస్తాన్	2	0	2	0	0	-0.050
నెదర్లాండ్స్	2	0	2	0	0	-1.625

నోట్: మ్యా-మ్యాచ్‌లు, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, పా-పాయింట్లు, నె.ర-నెట్ రన్‌రేట్

టి20 ప్రపంచకప్‌లో నేడు

అఫ్గానిస్తాన్ X ఐర్లాండ్ (ఉ.గం. 9:30 నుంచి)
ఆస్ట్రేలియా X ఇంగ్లండ్ (మ.గం. 1:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రాహుల్ (ఎల్బీ) (బి) మీకెరెన్ 9; రోహిత్ (సి) అకెర్‌మన్ (బి) క్లాసెన్ 53; కోహ్లి (నాటౌట్) 62; సూర్యకుమార్ (నాటౌట్) 51; ఎక్స్‌ట్రాలు 4; మొత్తం (20 ఓవర్లలో 2 వికెట్లకు) 179. వికెట్ల పతనం: 1-11, 2-84.
బౌలింగ్: క్లాసెన్ 4-0-33-1, ప్రింగిల్ 4-0-30-0, మీకెరెన్ 4-0-32-1, బాస్ డి లీడ్ 3-0-33-0, వాన్ బీక్ 4-0-45-0, షారిజ్ 1-0-5-0.

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: విక్రమ్‌జిత్ (బి) భువనేశ్వర్ 1; మ్యాక్స్ ఒ డౌడ్ (బి) అక్షర్ 16; బాస్ డి లీడ్ (సి) పాండ్యా (బి) అక్షర్ 16; అకెర్‌మన్ (సి) అక్షర్ (బి) అశ్విన్ 17; కూపర్ (సి) (సబ్) దీపక్ హుడా (బి) అశ్విన్ 9; ఎడ్వర్డ్స్ (సి) (సబ్) దీపక్ హుడా (బి) భువనేశ్వర్ 5; ప్రింగిల్ (సి) కోహ్లి (బి) షమీ 20; వాన్ బీక్ (సి) కార్తీక్ (బి) అర్ష్‌దీప్ 3; షారిజ్ (నాటౌట్) 16; క్లాసెన్ (ఎల్బీ) (బి) అర్ష్‌దీప్ 0; మీకెరెన్ (నాటౌట్) 14; ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 123. వికెట్ల పతనం: 1-11, 2-20, 3-47, 4-62, 5-63, 6-87, 7-89, 8-101, 9-101. **బౌలింగ్:** భువనేశ్వర్ 3-2-9-2, అర్ష్‌దీప్ 4-0-37-2, షమీ 4-0-27-1, అక్షర్ 4-0-18-2, హార్దిక్ 1-0-9-0, అశ్విన్ 4-0-21-2.

పురుష క్రికెటర్లు = మహిళా క్రికెటర్లు

- మ్యాచ్ ఫీజులు సమానం చేసిన బీసీసీఐ
- ఒక్క వన్డే మ్యాచ్‌కు ఇకపై రూ. 6 లక్షలు
- బోర్డు నిర్ణయంపై సర్వత్రా హర్షం

ముంబై: భారత మహిళల క్రికెట్‌కు కొత్త ఊపు తెచ్చే చారిత్రక నిర్ణయాన్ని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తీసుకుంది. మ్యాచ్ ఫీజుల విషయంలో టీమిండియా పురుష క్రికెటర్లు, మహిళా క్రికెటర్ల మధ్య ఎప్పటి నుంచో ఉన్న అంతరాన్ని తొలగించింది. ఇకపై భారత మహిళల జట్టు కాంట్రాక్ట్ క్రికెటర్లకు కూడా పురుషుల జట్టుతో సమానంగా మ్యాచ్ ఫీజు లభిస్తుంది. ఇక నుంచి మహిళా క్రికెటర్లకు టెస్టు మ్యాచ్‌కు రూ. 15 లక్షలు, వన్డేలకు రూ. 6 లక్షలు, టి20 మ్యాచ్‌కు రూ. 3 లక్షల చొప్పున చెల్లిస్తారు. ఇప్పటి వరకు మహిళా క్రికెటర్లకు వన్డే, టి20లకు రూ.1 లక్ష లభిస్తుండగా, టెస్టు మ్యాచ్‌కు రూ. 2 లక్షల 50 వేలు ఇస్తూ వచ్చారు. ఇటీవల జరిగిన బోర్డు అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. భారత క్రికెట్‌లో ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందని, వివక్షను దూరం చేసే దిశగా తొలి అడుగు అని బీసీసీఐ కార్యదర్శి జై షా పేర్కొనగా... తాజా నిర్ణయం మహిళల క్రికెట్ అభివృద్ధికి మరింతగా దోహదం చేస్తుందని అధ్యక్షుడు రోజర్ బిన్నీ వ్యాఖ్యానించారు.

- ప్రస్తుతం న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు మాత్రమే ఇలా పురుష, మహిళా క్రికెటర్లకు సమానంగా మ్యాచ్ ఫీజులు చెల్లిస్తోంది. భారత్ రెండో జట్టు కాగా...ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లలో కూడా వ్యత్యాసం కొనసాగుతోంది.
- 2017 వన్డే వరల్డ్‌కప్‌లో ఫైనల్ చేరిన నాటి నుంచి భారత మహిళల జట్టు ప్రదర్శన మరింతగా మెరుగవుతూ వస్తోంది. దీనిని మరింత ప్రోత్సాహించే దిశగా తాజా ప్రకటన వెలువడింది. అయితే బోర్డు కాంట్రాక్ట్ మొత్తం విషయంలో మాత్రం ఎలాంటి మార్పూ లేదు. మహిళా క్రికెటర్లలో 'ఎ' గ్రేడ్‌కు రూ. 50 లక్షలు, 'బి', 'సి' గ్రేడ్‌లకు రూ. 30 లక్షలు, రూ. 10 లక్షలు చొప్పున బోర్డు ఇస్తోంది. అదే పురుష క్రికెటర్లకు మాత్రం ఎ, బి, సి గ్రేడ్‌లలో వరుసగా రూ. 5 కోట్లు, రూ. 3 కోట్లు, రూ. 1 కోటితో పాటు 'ఎ' ప్లస్ కేటగిరీలో రూ. 7 కోట్లు లభిస్తాయి.
- బీసీసీఐ తీసుకున్న నిర్ణయం పట్ల అన్ని వైపుల నుంచి హర్షం వ్యక్తమైంది. ఈ రోజును అతి ప్రత్యేకమైన 'రెడ్ లెటర్ డే'గా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అభివర్ణించగా... ఇదో చారిత్రాత్మక నిర్ణయమని, దీని ద్వారా మహిళల క్రికెట్‌లో కొత్త శకంలోకి ప్రవేశిస్తున్నామని మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ తన సంతోషాన్ని వ్యక్తం చేసింది.



రోసో ధనాధన్ సెంచరీ

బంగ్లాదేశ్‌పై దక్షిణాఫ్రికా ఘనవిజయం


రోసో

సిడ్నీ: దక్షిణాఫ్రికా తమ తొలి మ్యాచ్‌లోనే జింబాబ్వేపై గెలవాల్సింది. కానీ హోబర్ట్‌లో డికాక్ జోరును వర్షం ఆపేయడంతో మ్యాచ్ రద్దయ్యింది. బంగ్లాదేశ్‌తో రెండో మ్యాచ్‌లో మాత్రం డికాక్ (38 బంతుల్లో 63; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) ధాటికి, రిలీ రోసో (56 బంతుల్లో 109; 7 ఫోర్లు, 8 సిక్సర్లు) వాయువేగం కూడా జతయ్యింది. దీంతో వారిద్దరి ధనాధన్‌కు అడ్డు లేకపోయింది. 200 పైచిలుకు స్కోరు చేసిన దక్షిణాఫ్రికా కసి అంతటితో ఆగలేదు. బౌలింగ్‌తో బంగ్లాను 17 ఓవర్లను కూడా పూర్తిగా ఆడనివ్వలేదు. వంద పరుగులు దాటగానే ఆలౌట్ చేసింది. టి20 ప్రపంచకప్ గ్రూప్–2లో గురువారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో సఫారీ జట్టు 104 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. ముందుగా దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. ఓపెనర్ డికాక్, టాపార్డర్ బ్యాటర్ రోసో రెండో వికెట్‌కు 13.3 ఓవర్లలోనే 168 పరుగులు జోడించడంతోనే బంగ్లా మ్యాచ్‌పై ఆశలు వదులుకుంది. అనంతరం భారీ లక్ష్యఛేదనకు దిగిన బంగ్లాదేశ్ 16.3 ఓవర్లలోనే 101 పరుగులకే కుప్పకూలింది. పేస్‌తో నోర్జే (3.3-0-10-4) నిప్పులు చెరిగితే, స్పిన్‌తో షమ్సీ (3/20) తిప్పేశాడు. లిటన్ దాస్ (31 బంతుల్లో 34; 1 ఫోర్, 1 సిక్స్) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు.

క్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జోడీ



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ సాత్విక్-చిరాగ్ ద్వయం 21-16, 21-14తో మాన్ వె చోంగ్-కాయ్ వున్ టీ (మలేసియా) జోడీని ఓడించింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ టకురో హోకి-యుగో కొబయాషి (జపాన్)లతో సాత్విక్-చిరాగ్ తలపడతారు. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్ 21-19, 12-21, 19-21తో రస్మస్ గెమ్కె (డెన్మార్క్) చేతిలో పోరాడి ఓడిపోయాడు.

రాజా రిత్విక్ విజయం



న్యూఢిల్లీ: ఆసియా కాంటినెంటల్ చెస్ చాంపియన్‌షిప్ ఓపెన్ విభాగంలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ వరుసగా రెండో విజయం నమోదు చేశాడు. గురువారం జరిగిన రెండో రౌండ్ గేమ్‌లో రాజా రిత్విక్ 17 ఎత్తుల్లో అల్బెర్ట్ వింకెల్మన్‌పై గెలుపొందాడు. తెలంగాణకే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ హర్ష భరతకోటి రెండో రౌండ్‌లో 44 ఎత్తుల్లో భారత్‌కే చెందిన నితిన్‌పై గెలిచాడు.

శంకర్ ముందంజ

సాంటెండర్ (స్పెయిన్): ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్‌లో శంకర్ ముత్తుస్వామి (భారత్) క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో శంకర్ 21-10, 21-12తో నచాకోర్న్ పుస్రి (థాయ్‌లాండ్)పై గెలిచాడు. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి (భారత్) 17-21, 21-12, 18-21 తో హీనా అకెచి (జపాన్) చేతిలో ఓడిపోయింది.


సికందర్ రజా

పాక్ చేజేతులా...

- పరుగు తేడాతో జింబాబ్వే సంచలన విజయం
- సికందర్ రజా అద్భుత ప్రదర్శన
- పాక్ సెమీస్ అవకాశాలు సంక్లిష్టం

చిరకాల ప్రత్యర్థి భారత్ చేతిలో ఎదురైన ఓటమి నుంచి పాక్ ఆటగాళ్లు పాఠం నేర్చుకున్నట్లు కనిపించలేదు. కోహ్లి అద్భుత ఆటతీరుతో తొలి మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓడిన పాక్... స్టార్ ఆటగాళ్లు లేని జింబాబ్వే జట్టుతో జరిగిన రెండో మ్యాచ్‌లో మాత్రం చేజేతులా ఓటమిని కొనితెచ్చుకుంది. జింబాబ్వేను తక్కువ స్కోరుకే కట్టడి చేసినా లక్ష్య ఛేదనలో పాక్ బ్యాటర్ల నిర్లక్ష్యం ఆ జట్టు కొంప ముంచింది. వరుసగా రెండో ఓటమితో పాక్ జట్టు టి20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్ చేరడం సంక్లిష్టంగా మారింది.


నిరాశలో పాక్ ఆటగాళ్లు షాహీన్ అఫ్రిది, వసీమ్

పెర్త్: టి20 ప్రపంచకప్‌లో సంచలనాల పర్వం కొనసాగుతోంది. గత మెగాటోర్నీ సెమీ ఫైనలిస్ట్ పాకిస్తాన్‌పై జింబాబ్వే సంచలన విజయం సాధించింది. గ్రూప్–2లో గురువారం జరిగిన మ్యాచ్‌లో పరుగు తేడాతో పాక్ ఓడింది. తక్కువ స్కోర్ల మ్యాచ్‌లో... అది కూడా క్రికెట్ కూన జింబాబ్వే చేతిలో ఓటమి పాకిస్తాన్ ముందుకెళ్లే అవకాశాల్ని సంక్లిష్టం చేసింది. బౌలర్లు శ్రమిస్తే ఎదురైన స్వల్ప లక్ష్యాన్ని బ్యాటర్లు నిర్లక్ష్యంగా ఆడి నిరాశను మిగిల్చారు. టాస్ నెగ్గిన జింబాబ్వే మొదట బ్యాటింగ్ ఎంచుకొని నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. పాక్ బౌలర్లు వసీమ్ (4/24), షాదాబ్ ఖాన్ (3/23) కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో టాపార్డర్ బ్యాటర్స్ వెస్లీ మధెవెర్ (17), ఎర్విన్ (19), మిల్టన్ (8)... కనీసం 20 పరుగులైనా చేయలేకపోయారు. తర్వాత వచ్చిన వారిలో సీన్ విలియమ్స్ (28 బంతుల్లో 31; 3 ఫోర్లు) కాస్త మెరుగనిపించాడు. 131 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాక్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 129 పరుగులు చేసింది. గెలిచే లక్ష్యం, గెలవాల్సిన ప్రత్యర్థిని పాకిస్తాన్ బ్యాటర్లు చాలా తేలిగ్గా తీసుకున్నారు. రిజ్వాన్ (14), కెప్టెన్ బాబర్ ఆజమ్ (4) చెత్త షాట్లతో నిష్క్రమించారు. షాన్ మసూద్ (38 బంతుల్లో 44; 3 ఫోర్లు) బాగా ఆడినా... తను కూడా నిర్లక్ష్యంగా స్టంపౌటై వికెట్‌ను పారేసుకున్నాడు. ఆఖర్లో నవాజ్ (18 బంతుల్లో 22; 1 ఫోర్, 1 సిక్స్) గెలుపుపై ఆశలు పెంచి... కీలకమైన తరుణంలో పేలవమైన షాట్‌తో పెవిలియన్ చేరడం పాక్‌ను గెలవాల్సిన మ్యాచ్‌లో ముంచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సికందర్ రజా (3/25) పాక్ ఓటమిలో కీలకపాత్ర పోషించాడు. బ్రాడ్ ఇవాన్స్ (2/25), ముజరబాని (1/18), జాంగ్వే (1/10) జింబాబ్వే గెలుపునకు చెమటోడ్చారు.

7 అంతర్జాతీయ టి20ల్లో ఈ ఏడాది జింబాబ్వే ఆల్‌రౌండర్ సికందర్ రజా అందుకున్న 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' పురస్కారాల సంఖ్య. ఒకే ఏడాది అత్యధికసార్లు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు అందుకున్న ప్లేయర్‌గా విరాట్ కోహ్లి (2016లో 6 సార్లు), దినేశ్ కార్తీక్ (2021లో 6 సార్లు) పేరిట సంయుక్తంగా ఉన్న రికార్డును సికందర్ రజా అధిగమించాడు.

3 ఐసీసీలో శాశ్వత సభ్యత్వం ఉన్న జట్లపై టి20 ప్రపంచకప్ చరిత్రలో జింబాబ్వే గెలిచిన మ్యాచ్‌ల సంఖ్య. 2007లో ఆస్ట్రేలియాపై నెగ్గిన జింబాబ్వే తాజా ప్రపంచకప్‌లో ఐర్లాండ్, పాకిస్తాన్‌లపై గెలిచింది.

చివరి ఓవర్ సాగిందిలా...

19.1 ఇవాన్స్ తొలి బంతికి నవాజ్ 3 రన్స్ తీశాడు.
19.2 వసీమ్ బౌండరీ కొట్టాడు. 4 బంతుల్లో 4 పరుగులు పాక్‌ను గెలుపు వాకిట నిలిపాయి.
19.3 వసీమ్ రన్ తీసి నవాజ్‌కు స్ట్రయిక్ ఇచ్చాడు.
19.4 ఇవాన్స్ బంతికి నవాజ్ బీట్ అయ్యాడు. 2 బంతుల్లో 3 పరుగులు...
19.5 నవాజ్ మిడాఫ్‌లో ఇర్విన్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఆఖరి బంతికి 3 పరుగులు చేయాల్సివుండగా క్రీజులోకి షాహీన్ అఫ్రిది వచ్చాడు.
19.6 షాహీన్ లాంగాన్ దిశగా ఆడిన బంతిని అక్కడే ఉన్న రజా కీపర్‌వైపు త్రో చేశాడు. బౌలర్ ఎండ్‌లో అప్పటికే వసీమ్ రావడంతో చాకచక్యంగా రజా వేసిన త్రోను మొదట కీపర్ చకబ్వా జారవిడిచినప్పటికీ షాహీన్ వచ్చేలోపే వికెట్లను పడేయడంతో సంచలన విజయం సాధ్యమైంది.

ఆఖరి మజిలీకి చేరిందిలా...

పాక్ 13 ఓవర్ల వరకు 80/3 స్కోరుతో లక్ష్యం వైపే నడిచింది. 14, 16 ఓవర్లు వేసిన రజా పాక్‌ను ఓటమి వైపు మళ్లించాడు. 14వ ఓవర్ వరుస బంతుల్లో షాదాబ్ (17), హైదర్ అలీ (0)లను అవుట్ చేశాడు. 30 బంతుల్లో 38 పరుగుల సమీకరణం పాక్‌కు సులువైందే! కానీ మళ్లీ రజా 16వ ఓవర్ వేసి క్రీజులో పాతుకుపోయిన షాన్ మసూద్‌ను స్టంపౌట్ చేశాడు. చివరకు 12 బంతుల్లో 22 పరుగుల సమీకరణం పాక్‌పై ఒత్తిడి పెంచినా... నవాజ్ 19వ ఓవర్లో సిక్సర్ కొట్టి అంతరం తగ్గించాడు. ఆట ఆఖరి మజిలీకి చేరింది. పాక్ విజయానికి 6 బంతుల్లో 11 పరుగులు అవసరమయ్యాయి.

క్లుప్తంగా

హత్యానేరం కింద వరకట్న మరణం కేసులు

సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని కోర్టులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: వరకట్న మరణం కింద నమోదు చేసిన కేసుల్లో ఆధారాలను పరిగణనలోకి తీసుకుని నిందితులపై హత్యా నేరం కింద అభియోగాలను నమోదు చేసేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాల్సిన బాధ్యత విచారణ కోర్టులపై ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. పోలీసులు హత్యా నేరం కింద చార్జిషీట్ దాఖలు చేశారా లేదా అన్న దానితో సంబంధం లేకుండా విచారణ కోర్టులు ఈ అంశాన్ని పరిశీలించాలని తెలిపింది. దర్యాప్తు అధికారులు సైతం వారు సేకరించిన ఆధారాలను బట్టి నిందితులపై హత్యా నేరం కింద చార్జిషీట్ దాఖలు చేసే విషయాన్ని పరిశీలించాలని తెలిపింది. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన జి.శ్రీనివాసరావు, మరో ముగ్గురిపై వరకట్న మరణం, వరకట్న వేధింపుల కింద నమోదు చేసిన కేసును కొట్టేస్తూ గుంటూరు ఐదో అదనపు జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు రద్దు చేసింది. కేసును తిరిగి అదే కోర్టుకు పంపింది. అందుబాటులో ఉన్న ఆధారాలనుబట్టి హత్యా నేరం కింద అభియోగాల నమోదుకు ఆస్కారం ఉందో లేదో చూడాలని కింది కోర్టును ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్ర బాబు ఇటీవల తీర్పు వెలువరించారు. ఈ తీర్పు ప్రతిని అన్ని జిల్లాల కోర్టులకు, డీజీపీకి పంపాలని రిజిస్ట్రీని న్యాయమూర్తి ఆదేశించారు. వరకట్న వేధింపుల వల్ల తమ కుమార్తె శ్రీవర్థిని మరణించిందని, ఇందుకు బాధ్యులైన వారిపై పోలీసులు నమోదు చేసిన కేసును గుంటూరు కోర్టు కొట్టేయడాన్ని సవాలు చేస్తూ విజయవాడకు చెందిన రేవతీదేవి 2005లో హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన జస్టిస్ రవీంద్రబాబు.. కింది కోర్టు అన్ని సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని తప్పుపట్టారు.

గంజాయిపై ఉక్కుపాదం

హోం మంత్రి తానేటి వనిత



సాక్షి, న్యూఢిల్లీ: గంజాయి అక్రమ సాగుపై ఏపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని హోం మంత్రి తానేటి వనిత తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ పరివర్తన్' విజయవంతమైందని చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 7,552 ఎకరాల్లో సాగు చేసిన రూ.9,251 కోట్ల విలువైన గంజాయిని అధికారులు ధ్వంసం చేయగా.. గిరిజనులు 395 ఎకరాలను స్వయంగా ధ్వంసం చేశారని పేర్కొన్నారు. హరియాణాలో నిర్వహిస్తున్న హోం మంత్రుల సమావేశానికి వెళ్లే ముందు ఆమె ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. గంజాయి అక్రమ సాగు నిరోధం, ధ్వంసంలో ఏపీ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. మహిళా మిత్ర, సైబర్ మిత్ర, మహిళా సంరక్షక కార్యకర్తలు, దిశ యాక్ట్, దిశ యాప్, దిశ పోలీస్‌స్టేషన్లు, ట్రాక్ మై ట్రావెల్‌యాప్‌లు తీసుకొచ్చామని చెప్పారు. అన్ని పోలీస్‌స్టేషన్లలోనూ జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నామన్నారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా అభయం యాప్ తీసుకువచ్చామని.. సుమారు 1.50 లక్షల ఆటోల్లో 'అభయం' పరికరాలు ఏర్పాటు చేశామన్నారు. హరియాణాలో నిర్వహిస్తున్న హోం మంత్రుల సమావేశంలో శుక్రవారం సాయంత్రం ప్రసంగించనున్నట్లు మంత్రి వనిత తెలిపారు.

పంజాబ్‌ను మించి..

రైతన్నలకు ఏపీలో మెరుగ్గా వ్యవసాయ రుణాల పంపిణీ

నాబార్డు అధ్యయన నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: గత దశాబ్ద కాలంలో దేశంలో వ్యవసాయ రుణాల పంపిణీ మూడు రెట్లు పెరిగినట్లు నాబార్డు నివేదిక వెల్లడించింది. 2011–12లో దేశవ్యాప్తంగా వ్యవసాయ రుణాల పంపిణీ రూ.5.11 లక్షల కోట్లు ఉండగా 2020–21 నాటికి మూడు రెట్లు పెరిగి రూ.15.58 లక్షల కోట్లకు చేరుకున్నాయి. పదేళ్లలో 11.9 శాతం వృద్ధి నమోదైంది. పంజాబ్‌ను మించి ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రుణ లభ్యత మెరుగ్గా ఉండటం గమనార్హం. నాబార్డు నివేదికలో ముఖ్యాంశాలు ఇవీ..

- 2011–12 నుంచి స్వల్పకాలిక పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక టర్మ్ రుణాలు పెరిగాయి. 2017–18లో దీర్ఘకాలిక టర్మ్ రుణాల పంపిణీలో వృద్ధి 9.9 శాతం ఉండగా 2020–21 నాటికి 43.17 శాతానికిచేరింది.
- వ్యవసాయ యాంత్రీకరణ, పంపు సెట్లు, నీటి పారుదల నిర్మాణాలు, తోటల అభివృద్ధి, ఫామ్ పాండ్‌లు, మైక్రో ఇరిగేషన్, పొలంలో ఉత్పాదక సామర్థ్యం పెంపు తదితరాలకు నాబార్డు, బ్యాంకులు దీర్ఘకాలిక టర్మ్ రుణాలను మంజూరు చేస్తున్నాయి.
- బ్యాంకుల ద్వారా వ్యవసాయ రుణాల పంపిణీ పెరగడంతో వడ్డీ వ్యాపారుల నుంచి రైతులకు విముక్తి లభించినా బ్యాంకు రుణాల మంజూరులో రాష్ట్రాల మధ్య వ్యత్యాసాలున్నాయి.
- దక్షిణాది రాష్ట్రాల్లో అత్యధికంగా వ్యవసాయ రుణాల పంపిణీ జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో హెక్టార్‌కు రుణ లభ్యత మెరుగ్గా ఉంది. మిగతా రాష్ట్రాల్లో చాలా చోట్ల హెక్టార్‌కు రుణ లభ్యత రూ.లక్ష లోపే ఉంది.
- 2019 – 20లో ఆంధ్రప్రదేశ్‌లో హెక్టార్‌కు రూ.1.29 లక్షలు, పంజాబ్‌లో రూ.లక్షకు పైగా రుణ లభ్యత ఉంది.
- వ్యవసాయ రుణాల పంపిణీ పెరగడంలో కిసాన్ క్రెడిట్ కార్డులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. 2019 మార్చి 31 నాటికి 1,896 లక్షల కిసాన్ క్రెడిట్ కార్డులు మంజూరయ్యాయి.
- 2011–12లో స్వల్పకాలిక వ్యవసాయ రుణాలు రూ.3.96 లక్షల కోట్లు ఉండగా 2020–21 నాటికి రూ.8.85 లక్షల కోట్లకు చేరుకున్నాయి. దీర్ఘకాలిక టర్మ్ రుణాలు ఇదే సమయంలో రూ.1.14 లక్షల కోట్ల నుంచి రూ.6.73 లక్షల కోట్లకు పెరిగాయి.

వ్యవసాయ రంగానికి బ్యాంకు రుణాల మంజూరు రూ.కోట్లలో

ఆర్థిక ఏడాది	స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు	వార్షిక వృద్ధి శాతం
2011-12	5,11,029	9.1
2012-13	6,07,376	18.9
2013-14	7,30,123	20.2
2014-15	8,45,328	15.8
2015-16	9,15,510	8.3
2016-17	10,65,756	16.4
2017-18	11,62,616	9.6
2018-19	12,56,829	9.1
2019-20	13,92,730	10.8
2020-21	15,58,831	11.9

ఆ ఉత్తర్వులను సవరించే ప్రసక్తే లేదు

- సంఘీభావం విషయంలో కోర్టు ఆదేశాలను సరిగా అర్థం చేసుకోలేదు
- ఆ విషయాన్ని వదిలేస్తే ఇరుపక్షాలు కొట్టుకునే పరిస్థితి వస్తుంది
- తేల్చి చెప్పిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్‌రావు
- డీజీపీ, రైతుల అనుబంధ పిటిషన్లపై నేడు విచారణ



సాక్షి, అమరావతి : అమరావతి నుంచి అరసవెల్లి వరకు చేపట్టిన మహా పాదయాత్రలో 600 మంది మాత్రమే ఉండాలని, సంఘీభావం తెలపాలనుకున్న వారు రోడ్డుకు ఇరువైపులా ఉండాలే తప్ప, యాత్రలో పాల్గొనడానికి వీల్లేదంటూ ఇచ్చిన ఆదేశాలను సవరించే ప్రసక్తే లేదని న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు తేల్చి చెప్పారు. కొత్త అంశాలు ఏవైనా ఉంటే వాటి విషయంలో మాత్రమే జోక్యం చేసుకుంటామని స్పష్టం చేశారు. తమ మహా పాదయాత్రకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు వారి అనుచరులు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా వారిని ఆదేశించడంతో పాటు పోలీసులు చట్ట ప్రకారం తమ విధులను నిర్వర్తించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ అమరావతి పరిరక్షణ సమితి కార్యదర్శి గద్దె తిరుపతిరావు, మరి కొందరు గత వారం హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. కాగా, పాదయాత్రకు ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలంటూ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఓ అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. వాటిపై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు, గత నెలలో ఇచ్చిన ఆదేశాలను సవరించే ప్రసక్తే లేదని తాజాగా తేల్చి చెప్పారు. ఈ వ్యాజ్యాలు గురువారం మరోసారి విచారణకు వచ్చాయి. ఈ సందర్భంగా రైతుల తరఫు న్యాయవాదుల్లో ఒకరైన ఉన్నం మురళీధర రావు స్పందిస్తూ, యాత్రను 600 మందికే పరిమితం చేయడంతో పాటు సంఘీభావం తెలిపే విషయంలో ఇచ్చిన ఆదేశాలను సవరించాలంటూ ఓ అనుబంధ పిటిషన్ దాఖలు చేశామని న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. కేవలం 150 మందికి మాత్రమే గుర్తింపు కార్డులున్నాయని, మిగిలిన వారికి పోలీసులు ఇవ్వలేదని తెలిపారు. దీనిపై అడ్వొకేట్ జనరల్ (ఏజీ) శ్రీరామ్ స్పందిస్తూ.. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు యాత్రలో పాల్గొంటున్న రైతుల గుర్తిం పు కార్డులు అడిగారని తెలిపారు. అత్యధికుల వద్ద గుర్తింపు కార్డులు లేవన్నారు. అందరికీ గుర్తింపు కార్డులిచ్చామని స్పష్టం చేశారు.

యాత్రను ఆపేశారా?

సంఘీభావం తెలుపుతున్న వారిని పోలీసులు అడ్డుకుంటున్నారని, అందువల్ల గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరించాలని న్యాయవాది కోరారు. దీనికి న్యాయమూర్తి స్పందిస్తూ, తానేమీ కొత్తగా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని, గత నెలలో ఇచ్చిన ఆదేశాలనే అమలు చేయాలని మాత్రమే చెప్పానన్నారు. తమ వ్యాజ్యంపై విచారణ జరిపి తీరాలన్న అర్థంలో న్యాయవాది మాట్లాడగా, దానిపై న్యాయమూర్తి అసంతృప్తి వ్యక్తం చేశారు. యాత్రను ఆపేశారా? యాత్ర చేస్తున్న వారు ఎక్కడ ఉన్నారంటూ ప్రశ్నించారు. పోలీసుల తీరు వల్ల యాత్రను బలవంతంగా నిలుపుదల చేయాల్సి వచ్చిందని, రామచంద్రాపురంలో యాత్ర ఆగిందని,వారికి ఆహారం, నీరు అందించేందుకు పోలీసులు ఎవరినీ అనుమతించడం లేదన్నారు.

సంఘీభావం అంటే పాల్గొనడం కాదు

సంఘీభావం అంటే యాత్రలో పాల్గొనడం కానే కాదని న్యాయమూర్తి తేల్చి చెప్పారు. దీనిని అలాగే వదిలేస్తే ఇరుపక్షాలు వీధుల్లో తన్నుకునే పరిస్థితి వస్తుందన్నారు. ఈ సమయంలో పిటిషనర్ల తరఫు మరో న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు జోక్యం చేసుకుంటూ, యాత్రలో 600 మంది ఒకేసారి పాల్గొనడం సాధ్యం కాదని, రొటేషన్ పద్ధతిలో ఇతరులు పాల్గొనేలా ఉత్తర్వులు సవరించాలని కోరారు. అది సాధ్యం కాదని న్యాయమూర్తి పునరుద్ఘాటించారు. ఇరుపక్షాలు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లపై శుక్రవారం మధ్యాహ్నం పూర్తి స్థాయిలో విచారణ జరుపుతానని స్పష్టం చేస్తూ న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు.

రైతుల అభ్యర్థనను తోసిపుచ్చిన ధర్మాసనం

మహా పాదయాత్రను 600 మందికే పరిమితం చేస్తూ గత నెలలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ ధర్మాసనం ముందు రైతులు తాజాగా అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై లంచ్‌మోషన్ రూపంలో అత్యవసరంగా విచారణ జరపాలని రైతుల తరఫు న్యాయవాది జ్యోతిరత్న అనుమోలు ధర్మాసనాన్ని కోరారు. పోలీసుల తీరు వల్ల యాత్ర నిలిచిపోయిందని, రైతులందరూ రోడ్లపై ఉన్నారని ఆమె వివరించారు. అయితే ఈ అభ్యర్థనను న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ దుప్పల వెంకటరమణ ధర్మాసనం తోసిపుచ్చింది. లంచ్‌మోషన్ రూపంలో విచారించే ఆస్కారమే లేదని తేల్చి చెప్పింది. మంగళవారం ఉదయం సీజే ధర్మాసనం ముందు ఈ అప్పీల్ గురించి ప్రస్తావించాలని స్పష్టం చేసింది.

4 నుంచి ఏపీ నిట్‌లో ఫిజికల్ రిపోర్టింగ్

ఈ నెల 29 వరకు ఆప్షన్ల ఎంపిక

తాడేపల్లిగూడెం: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో సీట్లు పొందిన విద్యార్థులు నవంబర్ 4 నుంచి 9 వరకు ఫిజికల్‌గా రిపోర్టింగ్ చేయాలని నిట్ వర్గాలు తెలిపాయి. నిట్‌లో ఉన్న 8 బ్రాంచ్‌ల్లో సీఎస్‌ఈలో అన్ని సీట్లు భర్తీ అవగా.. బయోటెక్నాలజీ, సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్‌లలో కొన్ని సీట్లు మిగిలినట్లు సమాచారం. కాగా, సెంట్రల్ సీట్ అలోకేషన్ బోర్డు (సీ శాబ్) రెండు విడతల ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్‌ను బుధవారం ప్రారంభించింది. ఈ నెల 29 వరకు ఆప్షన్లను ఎంచుకోవచ్చు. 30న సాయంత్రం 5 గంటలకు సీట్ల కేటాయింపు ఉంటుంది. ఈసారి ఫిజికల్ రిపోర్టింగ్ సందర్భంగా అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా తెలుగుతో పాటు 8 భాషల్లో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. స్టడీ ఇన్ ఇండియా ప్రోగ్రామ్‌లో భాగంగా నిట్‌లో సీట్లు పొందిన విదేశీ విద్యార్థులు నవంబర్ 7 ,8 తేదీల్లో ఫిజికల్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.



విజయనగరం జిల్లా వంగర మండలం వీవీఆర్‌పేట పంచాయతీ పరిధి జేకేగుమ్మడ గ్రామానికి చెందిన మత్స్యకారుడు రాము నాగావళి నదిలో గురువారం చేపల వేటకి వెళ్లాడు. అతడి వలకు 25 కిలోల 'బొచ్చె' చేప చిక్కింది.

\- వంగర

విశాఖ రాజధాని కాకూడదన్నదే వారి లక్ష్యం



పరిపాలన రాజధాని కావడం తథ్యం

- చంద్రబాబు, పవన్, ఈనాడు, ఆంధ్రజ్యోతి తాతలు దిగొచ్చినా ఆపలేరు
- 2023 విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి విశాఖ నుంచే పరిపాలన
- ఉత్తరాంధ్ర టీడీపీ నేతలంతా ఈ ప్రాంతానికి వెన్నుపోటు పొడుస్తున్నారు
- పోరాటం పేరిట ఈ ప్రాంతంపై టీడీపీ దుష్ప్రచారం
- రుషికొండపై ప్రభుత్వ కార్యాలయం నిర్మిస్తే తప్పేంటి?
- చక్కెర కర్మాగారాలను మూసివేసింది టీడీపీ ప్రభుత్వంలోనే..
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: విశాఖ పరిపాలన రాజధాని కాకూడదన్నదే టీడీపీ, ఈనాడు, ఆంధ్రజ్యోతి లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజమెత్తారు. అన్నం పెట్టిన విశాఖపైనే ఈనాడు విషం చిమ్ముతోందని అన్నారు. విశాఖ పరిపాలన రాజధాని తథ్యమని, చంద్రబాబు, ఆయన ప్యాకేజీ స్టార్ పవన్, ఈనాడు, ఆంధ్రజ్యోతి.. వారి తాతలు దిగొచ్చినా ఆపలేరని చెప్పారు. 2023 విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే విశాఖ నుంచి పరిపాలన జరుగుతుందని ధీమా వ్యక్తంచేశారు. ఆయన గురువారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర ప్రజలు విశాఖ పరిపాలన రాజధాని అవ్వాలని అనుకోవడంలేదని అనే వాళ్లందరికీ 'విశాఖ గర్జన' కనువిప్పు కలిగించిందని చెప్పారు. పోలీసులు ఆధార్ కార్డులు చూపమనగానే అమరావతి రైతుల పేరిట పాదయాత్ర చేస్తున్న టీడీపీ నాయకులు తోక ముడిచారని అన్నారు. విశాఖ పరిపాలన రాజధానిని అడ్డుకొనేందుకు చంద్రబాబు ఆయన ప్యాకేజీ స్టార్ పవన్‌తో రెండు రోజుల డ్రామా ఆడించారన్నారు. ఇప్పుడు ఉత్తరాంధ్రలో సమస్యలపై పోరాటమంటూ కొత్త డ్రామాకి తెరలేపుతున్నారన్నారు. వెన్నుపోటు నాయకుడు చంద్రబాబు నేతృత్వంలో ఉత్తరాంధ్ర టీడీపీ నాయకులు ఉత్తరాంధ్రకే వెన్నుపోటు పొడుస్తున్నారని మండిపడ్డారు. గంజాయి మాఫియా అంటూ ఉత్తరాంధ్ర బ్రాండ్ ఇమేజ్‌ని దెబ్బ తీయాలని చూస్తున్నారని చెప్పారు. టీడీపీ హయాంలోనే గంజాయి స్మగ్లింగ్, భూముల రికార్డుల ట్యాంపరింగ్ జరిగిందని తెలిపారు. గంజాయి మాఫియాలో అయ్యన్నపాత్రుడి పాత్ర ఉందని సహచర మంత్రే చెప్పారన్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో పాటు పలువురు టీడీపీ నేతలు, గీతం యూనివర్సిటీ అధినేత భూఆక్రమణలకు పాల్పడ్డారన్నారు. చంద్రబాబు హయాంలో ఉత్తరాంధ్రలో ఎన్ని సుగర్ ఫ్యాక్టరీలు మూత పడ్డాయో తెలీదా అని ప్రశ్నించారు. ఉత్తరాంధ్రపై విషం చిమ్మి అమరావతి వైపు పెట్టుబడులు వెళ్లేలా ప్రయత్నిస్తున్నారని చెప్పారు. తాము అమరావతికి అడ్డుపడటంలేదని, దానితో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధినీ కోరుతున్నామని తెలిపారు. రుషికొండపై గెస్ట్ హౌస్ కడితే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విశాఖ వచ్చేస్తారని చంద్రబాబుకి భయమన్నారు. విశాఖలో ప్రభుత్వ భవనాలు కట్టకూడదన్నది టీడీపీ ఆలోచన అని చెప్పారు.


త్యాగమంటే ఇదీ

భూములు ఇచ్చాం రాజధాని ఏర్పాటు చేయాలని అమరావతి రైతులు కోరడం త్యాగమెలా అవుతుందని ప్రశ్నించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్, పోర్ట్, బీహెచ్‌ఈఎల్ లాంటి పరిశ్రమలకు ఉత్తరాంధ్ర ప్రజలు భూములు ఇచ్చారని, దీనిని త్యాగమంటారని చెప్పారు. ఎవరి కోసం వారు భూములు ఇవ్వడమనేది త్యాగమవదని, స్వార్థమని తెలిపారు. అమరావతి లాంటి నగరాన్ని నిర్మించాలంటే ముప్పై, యాభై ఏళ్లు పడుతుందని, ఆరు నెలల్లో నిర్మించామని చంద్రబాబు అంటే ఎలాగని అన్నారు. మంత్రుల మీద దాడికి పాల్పడిన జనసేన కార్యకర్తలు, నాయకులను, దాడికి ప్రోత్సహించిన వారిని మాత్రమే అరెస్ట్ చేశారని చెప్పారు. తాను ఓ కుటుంబ కార్యక్రమంలో తన భార్యతో డాన్స్ చేశానని, పవన్‌కళ్యాణ్‌లా ముగ్గురు ముగ్గురితో రికార్డింగ్‌లు వేయలేదని అన్నారు.

సోనోవిజన్ 'డ్రా'లో కార్లు గెలుచుకున్న కొనుగోలుదారులు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): దసరా, దీపావళిని పురస్కరించుకుని కొనుగోలుదారులకు సోనోవిజన్ ప్రకటించిన బహుమతులకు సంబంధించి వేర్వేరు నగరాల్లో లక్కీ డ్రా నిర్వహించారు. హోండా అమేజ్ కారుతో పాటు, మూడు మారుతీ కార్లను కొనుగోలుదారులు గెలుచుకున్నారు. రాజమండ్రి జేఎన్ రోడ్డులోని షోరూమ్‌లో నిర్వహించిన లక్కీడ్రాలో స్థానిక ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి డ్రా తీసి విజేతను ఎంపిక చేశారు. రాజమండ్రిలోని సైక్లోన్ కాలనీకి చెందిన కుసుమ ప్రియ హోండా అమేజ్ కారును గెలుపొందారు. తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డు న్యూ బాలజీ కాలనీలోని షోరూమ్‌లో నిర్వహించిన డ్రాలో తిరుపతి ఏఎస్పీ కులశేఖర్ డ్రా తీసి విజేతను ఎంపిక చేశారు. భవానీనగర్‌కు చెందిన సౌజన్య మారుతీకారు గెలుపొందారు. తెనాలి రత్నా టాకీస్ దగ్గర షోరూమ్‌లో నిర్వహించిన డ్రాలో తెనాలి టౌన్ డీఎస్పీ స్రవంతిరాయ్ డ్రా తీసి విజేతను ఎంపిక చేయగా, స్థానిక బాలాజీరావుపేటకు చెందిన గుమ్మడి సుజాత మారుతి కారు గెలుపొందారు. గుడివాడలోని షోరూమ్‌లో నిర్వహించిన డ్రాలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు డ్రా తీయగా యలమర్రుకు చెందిన టీ నాగరాజు మారుతీకారును గెలుపొందినట్లు సోనోవిజన్ ఎండీ భాస్కరమూర్తి తెలిపారు.

అథ్లెట్లకు నగదు ప్రోత్సాహకం అందజేత



జ్యోతి, భవానీలను ఘనంగా సత్కరించిన శాప్

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ అథ్లెట్ జ్యోతి యర్రాజీ, పారా అథ్లెట్ భవానీలను శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఎండీ ప్రభాకరరెడ్డి సత్కరించారు. ఇటీవల జరిగిన జాతీయ క్రీడల్లో జ్యోతి రెండు స్వర్ణ పతకాలు సాధించి రాష్ట్ర ఖ్యాతిని నిలబెట్టిందని ప్రశంసించారు. ఇండియన్ ఓపెన్ పారా నేషనల్స్‌లో కాంస్య పతకం సాధించిన నెల్లూరుకు చెందిన భవానీ గ్రామీణ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ అందించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. గురువారం విజయవాడలోని శాప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇద్దరు అథ్లెట్స్‌కి శిక్షణ నిమిత్తం రూ.1.50 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.